
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 299
శనివారం 20-1-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



సింగిల్స్ చాంపియన్ శ్రీజ

అమెరికాలో జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ టోర్నీలో విజేతగా నిలిచిన తెలంగాణ అమ్మాయి. -15లో



3 రోజుల నష్టాలకు చెక్

సెన్సెక్స్ లాభం 496 పాయింట్లు.. 21,600 స్థాయి పైకి నిఫ్టీ -15లో



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయదానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 299

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

శనివారం 20-1-2024



బాలరాముడి తొలి దర్శనం

- సోషల్ మీడియాలో రామ్‌లల్లా విగ్రహం చిత్రాలు
- గర్భగుడిలోకి చేర్చకముందు చిత్రీకరణ
- ఆలయంలో వేదికపై ప్రతిష్ఠించిన విగ్రహం ఫొటోను విడుదల చేసిన వీహెచ్‌పీ.. మరో రెండు రోజుల్లో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ.. ఏర్పాట్లు దాదాపు పూర్తి

6లో

పెత్తందారీ పోకడలూ అంటరానితనమే

కుల అహంకార వ్యవస్థలపై నా పోరాటానికి అంబేడ్కరే స్ఫూర్తి..

సామాజిక సమతా సంకల్ప సభలో ఏపీ సీఎం జగన్

- 77 ఏళ్ల స్వాతంత్య్రం తర్వాత కూడా వివక్ష ఇంకా సమసి పోలేదు
- రూపం మార్చి.. బరి తెగించిన దురహంకారులు పెత్తందారులు
- పేద కులాలు ఎప్పటికీ తమ పనివారుగా, సేవకులుగానే ఉండాలట
- చివరికి చరిత్రనూ వక్రీకరిస్తూ ఈనాడు దారుణమైన రాతలు.. అంబేడ్కర్ తెలుగు మీడియం మాత్రమే ఉండాలని అన్నట్టు పెత్తందార్ల పత్రిక వక్రీకరణలు
- 206 అడుగుల ఎత్తైన 'సామాజిక న్యాయ మహా శిల్పం' ఆవిష్కరణ

12లో



వెలుగెత్తిన సమతా స్ఫూర్తి



శుక్రవారం రాత్రి విజయవాడలో డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా బాణసంచా వెలుగులు

'కల్యాణ' కానుకేదీ?

రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రుల ఎదురుచూపులు

- కుమార్తెల వివాహాలు చేసి దరఖాస్తు చేసుకున్నా అందని సాయం
- ఏడాదిన్నర క్రితం అర్జీలు కూడా పరిష్కారానికి నోచుకోని వైనం
- ప్రస్తుతం ప్రభుత్వం వద్ద 1,04,613 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అప్లికేషన్లు.. పేరుకుపోయిన బకాయిలు రూ.1,047.68 కోట్లు
- నాలుగు నెలలుగా పూర్తిగా నిలిచిన చెల్లింపుల ప్రక్రియ
- పెండింగ్‌లో సగం వాటా బీసీ, ఈబీసీలదే
- ప్రభుత్వం మారడంతో బకాయిలు వస్తాయో? లేదో? అన్న సందిగ్ధంలో లబ్ధిదారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కల్యాణ లక్ష్మి పథకం పడకేసింది. కుమార్తెల వివాహాలు చేసి ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్న దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంది. ఏడాది, ఏడాదిన్నర దాటుతున్నా 'కల్యాణ' కానుక జాడ లేకపోవడంతో..సమీప భవిష్యత్తులోనైనా వస్తుందో లేదోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి రోజు నాటికే వధువు కుటుంబానికి రూ.1,00,116 ఆర్థిక సాయాన్ని (కానుక) అందించాలనేది

మిగతా 12వ పేజీలో ▶



నల్లగొండ జిల్లా చండూరు మండలం దోనిపాములకు చెందిన ఇప్ప లక్ష్మయ్య తన కుమార్తె వివాహం 2022 జూన్‌లో చేశాడు. ఆ తర్వాత కల్యాణ లక్ష్మి పథకం కింద ప్రభుత్వానికి దరఖాస్తు సమర్పించాడు. దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా కల్యాణ కానుక అందలేదు. క్రమం తప్పకుండా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అధికారులు నెలరోజుల్లో వస్తుందని చెబుతున్నా.. అలాంటి నెలలెన్నో గడిచిపోతుండటంతో లక్ష్మయ్య సాయంపై ఆశలు వదులుకునే పరిస్థితికి చేరుకున్నాడు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రమాదం

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

విస్టెక్స్ ఏషియా సీఈఓ సంజయ్ షా దుర్మరణం

- సంస్థ ప్రెసిడెంట్‌కు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం గార్డెన్ బుక్ చేసిన విస్టెక్స్ సంస్థ
- లైమ్ లైట్ గార్డెన్‌లో గురువారం రాత్రి వేడుకల నిర్వహణ
- సరైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం
- 20 అడుగుల నుంచి ఇద్దరూ దిగుతుండగా తెగిన ప్లాట్‌ఫామ్ తాడు
- అంబులెన్స్‌లు లేక ఆస్పత్రికి తరలించడంలో తీవ్ర జాప్యం
- ఫిల్మ్‌సిటీ మేనేజ్‌మెంట్‌తోపాటు ఇతరులపై పలు సెక్షన్ల కింద కేసు

5లో



సంజయ్ షా



రాజు దాట్ల

'ఎస్సీ వర్గీకరణ'పై కమిటీ

- కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా అధ్యక్షతన ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం
- ఈ నెల 23న కార్యదర్శుల కమిటీ తొలి సమావేశం

- వివరాలు 6లో

నెలాఖరులో రాష్ట్రానికి మోదీ?

- ఆదిలాబాద్ లేదా నల్లగొండలో పర్యటన!
- 28న కరీంనగర్, మహబూబ్‌నగర్‌లో అమిత్‌షా టూరు
- నెలాఖరు లేదా వచ్చే నెలలో జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్ రాక
- వచ్చే నెల 5 నుంచి 14 వరకు రథయాత్రలు

- 12లో

క్లుప్తంగా...

పెట్టుబడులు పెట్టేందుకే దావోస్‌కు..

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై బీజేపీ నేత ఎన్వీఎస్‌ఎస్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: దావోస్, తదితర చోట్ల విదేశీ పర్యటనలకు వెళ్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు అక్కడ పెట్టుబడులు పెట్టేందుకే వెళుతున్నారు తప్ప తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడానికి కాదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో దావోస్ నుంచి తెలంగాణకు రూ.21వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవి ఎక్కడికి వెళ్లాయో ఎందుకు చెప్పలేదని నిలదీశారు. తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో భాగంగా దావోస్‌లో అదానీ గ్రూప్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యి రాష్ట్రానికి రూ.12 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నట్లు గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ సమస్యలు

ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు అడుగడుగునా ప్రొటోకాల్ సమస్యలు ఎదురవుతున్నాయని ఆ పార్టీ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఓడిన కాంగ్రెస్ అభ్యర్థులు అధికారిక కార్యక్రమాల్లో పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. శుక్రవారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూ రైన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపాలని చూస్తోందన్నారు. పార్టీ నాయ కత్వం ఎవరికి టికెట్ ఇచ్చినా మెదక్ లోక్‌సభ స్థానాన్ని నాలుగోసారి కైవసం చేసుకుంటామన్నారు.

రాముడిపై రాజకీయాలు తగవు

- 22న సెలవుదినంగా ప్రకటించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి బండి విజ్ఞప్తి



ఇల్లందకుంట (హుజూరాబాద్): పార్టీలు, వర్గాలకు అతీతంగా రాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తుంటే.. రాముడిపై రాజకీయాలు తగవని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కోరారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిధి సేకరించినప్పుడు, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు.. పార్టీలకతీతంగా ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేసిన రోజు లేని అభ్యంతరాలు ఇప్పుడు ఎందుకు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. అయోధ్యలో ఈనెల 22న నిర్వహించే రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కోసం యావత్ ప్రపంచం ఎదురుచూస్తోందని, ఈ నేపథ్యంలో ఆ రోజును సెలవుదినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రామమందిర నిర్మాణ నిధి సేకరణలో దేశంలోనే రెండో స్థానంలో రాష్ట్రం ఉందన్నారు. అక్షింతలను అవమానపరచడం కాంగ్రెస్ నేతలకు తగదన్నారు.

200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లులు రద్దు చేయాలి

సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో ఎలాంటి షరతులు లేకుండా 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లులు రద్దు చేశారని, రాష్ట్రంలో కూడా వెంటనే అదే తరహాలో కరెంటు బిల్లులు రద్దు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు సరఫరా చేస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీని అమలు చేయాలని సతీశ్‌రెడ్డి నేతృత్వంలో ఎల్బీనగర్ పరిధిలోని నాగోల్ బస్తీ వాసులు వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లులు సోనియా గాంధీనే కట్టాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

ఇదండీ జగత్



'రా.. కదలిరా' సభకు తీసుకెళ్లుతున్నారు!

నెలలోగా ప్రాజెక్టుల అప్పగింత

కృష్ణాబోర్డుకు శ్రీశైలం, సాగర్ అప్పగింతపై రెండు రాష్ట్రాల సమ్మతి

- వారంలో ఈఎన్‌సీలు, కృష్ణాబోర్డు ఆధ్వర్యంలో విధివిధానాల ఖరారు
- సాగర్ వద్ద కృష్ణా బోర్డు అనుమతితోనే రెండు రాష్ట్రాల ఇంజనీర్లకు ప్రవేశం
- తెలంగాణ, ఏపీతో జలశక్తి శాఖ సమావేశంలో రెండు రాష్ట్రాల అంగీకారం
- సమావేశం వివరాలను వెల్లడించిన కేంద్ర జలశక్తి శాఖ



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను నెల రోజుల్లోగా కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ)కి అప్పగించేందుకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు సమ్మతి తెలిపాయి. ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఈఎన్‌సీలు, కృష్ణా బోర్డు సమావేశమై.. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు సంబంధించిన 15 ప్రధాన కాంపోనెంట్లు/ఔట్ లెట్లను కృష్ణా బోర్డుకు అప్పగించడంలో అనుసరించాల్సిన విధివిధానాల(హ్యాండింగ్ ఓవర్ ప్రొటోకాల్స్)కు అంగీకారం తెలిపాయి. అదేవిధంగా పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లోగా సిద్ధం చేస్తామని తెలిపాయి. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర జలశక్తి శాఖ తాజాగా ప్రకటించింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య కృష్ణా జల వివాదాల పరిష్కారానికి ఈ నెల 17న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఇరు రాష్ట్రాలు ఈ మేరకు అంగీకరించినట్టు సమావేశపు మినట్స్‌లో ఆ శాఖ పొందుపరిచింది. తెలంగాణ తరఫున రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ సి.మురళీధర్, ఏపీ తరఫున ఆ రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణ రెడ్డితో పాటు కృష్ణా బోర్డు చైర్మన్ శివనందన్‌కుమార్, కేంద్ర జలసంఘం చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సాగర్ వద్ద నో ఎంట్రీ

నాగార్జునసాగర్ డ్యామ్ పరిసరాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు పటిష్ట బందోబస్తును కొనసాగించనున్నాయి. కృష్ణా బోర్డు నుంచి ముందస్తు అనుమతి లేకుంటే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇంజనీర్లు / అధికారులను సైతం ఇకపై డ్యామ్ పరిసరాల్లోకి అనుమతించరు. ఈ విషయంపై సైతం రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. నాగార్జునసాగర్ డ్యామ్ రెండు రాష్ట్రాల భూభాగాల పరిధిలో చెరి సగం వస్తుండగా, ఏదైనా మరమ్మతు పనులు చేపట్టేందుకు సంబంధిత భూభాగం పరిధిలోని రాష్ట్రం ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కృష్ణా బోర్డు పర్యవేక్షణలోనే ఈ పనులు చేయాల్సి ఉంటుంది. కేఆర్‌ఎంబీకి చెల్లించాల్సిన బకాయిలను సైతం తక్షణమే చెల్లిస్తామని రెండు రాష్ట్రాలు సమ్మతి తెలిపాయి. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలులో పురోగతిని సమీక్షించేందుకు 15 రోజుల తర్వాత మళ్లీ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి సమీక్ష నిర్వహించనున్నారు.

తెలంగాణ, ఏపీ వాదనలు ఇవే..

ఇతర అంశాలపై చర్చించి పరిష్కరించుకోవడానికి ముందు నాగార్జునసాగర్ వద్ద 2023 డిసెంబర్ 28కి ముందు నెలకొని ఉన్న పరిస్థితులను పునరుద్ధరించాలని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఈ సమావేశంలో కోరారు.

- కృష్ణా జలాల్లో ఏపీ, తెలంగాణకు 50:50 నిష్పత్తిలో కేటాయింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు.
- విద్యుదుత్పత్తి ద్వారా నీళ్లను తెలంగాణ కిందికి విడుదల చేస్తుండడంతో శ్రీశైలం జలాశయంలో నిల్వలు అడుగంటిపోతున్నాయని ఏపీ జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సాగర్ కుడికాల్వ ద్వారా ఏపీకి నీటి విడుదల కోసం కృష్ణా బోర్డు అనుమతి ఇచ్చినా తెలంగాణ అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి సాగర్ నుంచి నీటివిడుదలను నిలుపుదల చేశామని తెలిపారు.

నీటి వాటాలు తేలకుండా కేఆర్‌ఎంబీలోకి ఎలా?

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

- ఉమ్మడి ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- కేంద్రం చేతిలోకి వెళితే తెలంగాణకు తీవ్ర నష్టం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారబోతున్న సాగునీటి ప్రాజెక్టుల వ్యవహారంపై ప్రభుత్వం తక్షణం దృష్టి పెట్టాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి సాగు నీటి ప్రాజెక్టులు కేంద్రం చేతిలోకి వెళ్తాయనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలప్పుడు రాజకీయాలు, ఆ తర్వాత అభివృద్ధిపై చర్చించాలన్నదే తమ విధానమని హరీశ్‌రావు చెప్పారు. బీఆర్ ఎస్‌కు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, వాటి కోసం ఎంతకైనా తెగిస్తుందని అన్నారు. ఉమ్మడి ప్రాజెక్టులు వారం రోజుల్లోగా (కృష్ణా నదీ యాజమాన్య బోర్డు) కేఆర్‌ఎంబీ పరిధిలోకి వెళ్తాయని తెలుస్తోందని, అదే జరిగితే ఏపీకి లాభం, తెలంగాణకు నష్టం జరుగుతుందన్నారు. కేంద్రం జూలై 2021లోనే ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధి లోకి తేవాలని ప్రతిపాదించిందని, ఈ ప్రతిపాదనను కేసీఆర్ గట్టిగా వ్యతిరేకించారని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా ఇంకా తేలనప్పుడు ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధిలోకి ఎలా తెస్తారని ప్రశ్నించారు. కృష్ణా నీటిని ఏపీకి 50%, తెలంగాణకు 50% పంపిణీ చేయాల్సిందిగా తాము షరతు విధించామని వివరించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి జల విద్యుత్ ఉత్పత్తి చేసి 264 టీఎంసీల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేయాలని మరో షరతు పెట్టినట్లు వెల్లడించారు. ఏక పక్షంగా నిర్ణయం తీసుకోకుండా అపెక్స్ కమిటీ వేయాలని కోరినట్లు తెలిపారు. ఆపరేషన్ మాన్యువల్ రూపొందించకుండా ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధిలోకి ఎలా తెస్తారని ప్రశ్నించారు. కేఆర్‌ఎంబీలో ఉమ్మడి ప్రాజెక్టులను చేరిస్తే రాష్ట్రానికి ఆత్మహత్యా సదృశ్యమేనన్నారు.

జల విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం

ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధిలోకి తెస్తే జల విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుందని హరీశ్‌రావు చెప్పారు. నాగార్జున సాగర్ ఎడమ గట్టు కాలువ ఆయకట్టుపై కూడా దీని ప్రభావం ఉంటుందన్నారు. హైదరాబాద్ తాగునీళ్లకు కూడా కటకట ఏర్పడుతుందని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలని, రాజకీయం మాని రాష్ట్రానికి జరిగే నష్టంపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం స్పందించకుంటే బీఆర్‌ఎస్ పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ఎప్పటికైనా తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది గులాబీ జెండానేనని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి నష్టం కలిగినా నీటిని ఎత్తిపోయడంలో ఇబ్బంది లేదని, ఇప్పటికీ అక్కడ 4 నుంచి 5 వేల క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయని తెలిపారు. కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు కూడా వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పుకోలేదు



శుక్రవారం ఖమ్మంజిల్లా ప్రాజెక్టులపై సమీక్షలో మాట్లాడుతున్న భట్టి, ఉత్తమ్, పొంగులేటి

హరీశ్‌రావు ఆరోపణలు పచ్చి అబద్ధం

- 10 ఏళ్లలో ఒక్క చుక్కనైనా అదనంగా తెచ్చారా?..
- రూ.1,552 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుల వ్యయం రూ.22,981కోట్లకు పెంచారు
- విచారణకు ఎంత మంది జడ్జిలు కావాలో అని ఆలోచిస్తున్నాం
- ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రాజెక్టులపై సమీక్ష అనంతరం మీడియాతో ఉత్తమ్, భట్టి

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు తమ ప్రభుత్వం ఒప్పుకోలేదని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులపై శుక్రవారం ఆయన సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆ జిల్లాకు చెందిన ఇతర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్షించారు. అనంతరం భట్టి విక్రమార్కతో కలిసి సచివాలయం మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణకు నీటి కేటాయింపుల్లో ఒక్క చుక్కను అదనంగా తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై గత ప్రభుత్వం అనుసరించిన వైఖరి, ఇప్పుడు జరుగుతున్న పరిణామాలపై త్వరలో రాష్ట్ర శాసనసభలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

సీతారామ ప్రాజెక్టులో భారీ దోపిడీ: భట్టి విక్రమార్క

సీతారామ–సీతమ్మసాగర్ ప్రాజెక్టు పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీ దోపిడీకి పాల్పడిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.792 కోట్లతో రాజీవ్‌సాగర్, రూ.760 కోట్లతో ఇందిరాసాగర్ మిగులు పనులు పూర్తి చేస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3.3లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు లభించేదన్నారు. మొత్తం రూ.1552 కోట్లతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టులను రీడిజైనింగ్ పేరుతో కలిపేసి సీతారామ ప్రాజెక్టుగా పేరు మార్చడంతో పాటు అంచనా వ్యయం రూ.13,057 కోట్లకు చేర్చిందని, కేసీఆర్ ప్రభుత్వం ఆ తర్వాత రూ.18,500 కోట్లకు పెంచిందని ఆరోపించారు. అదనపు నీటి నిల్వ సామర్థ్యం కోసం రూ.3481 కోట్లతో సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణం చేపట్టి తర్వాత దీని వ్యయం సైతం రూ.4481 కోట్లకు పెంచిందన్నారు. ఇలా సీతారామ–సీతమ్మప్రాజెక్టుల అంచనాలను మొత్తం రూ.22,981 కోట్లకు పెంచారని విమర్శించారు. రూ.1552 కోట్లతో పూర్తి అయ్యే ప్రాజెక్టు అంచనాలను రూ.22,981 కోట్లకు పెంచి ఇప్పటికే రూ.8వేల కోట్లను ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి నీళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు. శబరి, గోదావరి కలిసే చోట పోలవరం వద్ద ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ఇందిరాసాగర్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం విరమించుకోవడంతో 365 రోజులు ప్రవహించే శబరి నదిని రాష్ట్రం కోల్పోయిందన్నారు.

దేశ చరిత్రలో ఇంత దోపిడీ జరిగి ఉండదు: ఉత్తమ్

భారతదేశ చరిత్రలో ఇలాంటి దోపిడీ జరగడం చాలా అరుదు అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రూ.10, రూ.20 కోట్లకే ఉద్యోగాలు పోతాయని, ప్రభుత్వాలు కూలుతాయన్నారు. రోజురోజుకు బయటకు వస్తున్న విషయాలను చూసి నీటి పారుదలశాఖ మంత్రిగా నిర్ఘాంతపోతున్నట్టు పేర్కొన్నారు. ఎన్నో కుంభకోణాలు జరిగాయని, విచారణకు ఎంత మందో జడ్జిలు కావాలో అన్న అంశంపై ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సిట్టింగ్ జడ్జిని కేటాయించాలని హైకోర్టు సీజేకు లేఖ రాశామని, కేసీఆర్, హరీశ్ రావులు నీటిపారుదలశాఖ మంత్రులుగా వ్యవహరించి ఆ శాఖను ధ్వంసం చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులనే ఇంకా కొనసాగించడంపై విలేకరులు ప్రశ్నించగా, త్వరలో మార్పులు చూస్తారని బదులిచ్చారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై మంత్రివర్గంలో చర్చిస్తామని చెప్పారు. ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించే విధానం లేదని, బదులుగా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు కేంద్ర పథకాల కింద 60శాతం నిధులు ఇస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జాతీయ హోదాపై మాట్లాడేందుకు హరీశ్‌రావుకు సిగ్గుశరం ఉండాలన్నారు. గతంలో 2–4శాతం వడ్డీలతో ప్రభుత్వాలు రుణాలు తెచ్చాయని, తెలంగాణ వచ్చాక 10.5శాతం వరకు అధిక వడ్డీలతో గత ప్రభుత్వం రూ.2లక్షల కోట్ల అప్పులు చేసి మనందరి జీవితాలను తాకట్టు పెట్టిందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నీటిపారుదల శాఖ రుణాల తిరిగి చెల్లింపులకే రూ.18వేల కోట్లు, జీతాలకు మరో రూ..2వేల కోట్లు, గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బిల్లుల చెల్లింపులకు మరో రూ. 9500 కోట్లు అవసరమన్నారు. తమ ప్రభుత్వం విజ్ఞప్తి చేయడంతో వడ్డీలను తగ్గించేందుకు కేంద్ర ఆర్థిక శాఖమంత్రి సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కర్ణాటకకు వెళ్లి తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీలను విడుదల చేయాలని కోరుతామని చెప్పారు. కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు ఉందా? శ్రీశైలం ప్రాజెక్టు వెనుకభాగంలో ఏపీ లిఫ్టులు కట్టుతుంటే ఎప్పుడైనా మాట్లాడారా? అని నిలదీశారు. ఏపీ చేపట్టిన సంగమేశ్వరం ప్రాజెక్టుపై ఒక్కసారైనా కేసీఆర్, హరీశ్ మాట్లాడారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలతోపాటు సీలేరు ప్రాజెక్టును కేంద్రం ఏపీకి కేటాయించినా ఏం చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

కాంగ్రెస్ 420 హామీలు అమలు చేసేదాకా విడిచిపెట్టం

అదానీతో ఒప్పందాల వెనుక ఏముంది?

- మెదక్ లోక్‌సభ సన్నాహక సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ పార్టీ నోటికి ఎంతొస్తే అంత అన్నట్టుగా హామీలు ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారంటీలు కాదని, అవి 420 హామీలని మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగంలో తెలంగాణ గుల్లయ్యిందని, రాష్ట్ర ఏర్పాటు విఫలమైందని, అబద్ధాలు మాట్లాడించారని, వాస్తవాలు ఏంటో తెలియజేసేందుకు 'స్వేద'పత్రం విడుదల చేసినట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన తెలంగాణ సమగ్ర అభివృద్ధిని గణాంకాలు, ఆధారాలతో సహా వివరించినట్టు చెప్పారు. అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని, రూ.2 లక్షల రుణం తెచ్చుకోండని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ మాట్లాడారని గుర్తు చేశారు. కానీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రుణాలు వసూలు చేయాలని, లేకుంటే కేసులు పెట్టమని ఆదేశాలు జారీ చేశారన్నారు. వ్యవసాయ రుణాలు విడతల వారీగా మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించి, ముక్కుపిండి వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం శోచనీయమన్నారు. ప్రియాంకాగాంధీ నిరుద్యోగ భృతి ఇస్తామని చెబితే, భట్టి విక్రమార్క అలా చెప్పలేదని హరీశ్‌రావు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేసేదాకా విడిచి పెట్టేది లేదని పునరుద్ఘాటించారు. ప్రధాని, అదానీ ఒక్కటని విమర్శలు చేసిన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నేడు ఆయనతోనే ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ అదానీని తిడితే, రేవంత్‌రెడ్డి అదే సమయంలో దావోస్‌లో ఒప్పందం చేసుకున్నారని, నోటికి వచ్చినట్టు మాట్లాడిన కాంగ్రెస్, బీజేపీ నాయకుల అసలు రంగు బయట పడుతున్నదన్నారు. కేసీఆర్ ఉన్నంతకాలం అదానీ ఇక్కడ అడుగు పెట్టలేదని, కానీ కాంగ్రెస్ రాగానే ఎలా వస్తున్నాడని కేటీఆర్ నిలదీశారు.

ఈసారి కూడా మెదక్ మనదే ...

మెదక్ లోక్‌సభ సెగ్మెంట్‌లో మరోసారి గులాబీ జెండా ఎగరబోతున్నదని కేటీఆర్ అన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో హరీశ్‌రావు నాయకత్వంలో కార్యకర్తలంతా క్రియాశీలకంగా పనిచేయడంతో అత్యధిక మెజారిటీ సాధించామని, మరోసారి అది పునరావృతం కావాలన్నారు. కొందరు దుష్ప్రచారం చేయడంతోనే మెదక్ పార్లమెంట్ పరిధిలో తాను ఒక్కదాన్నే ఓడిపోయానని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, ఎమ్మెల్సీలు వెంకటరామిరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

పనికొచ్చే సమీక్షలు చేయడం లేదు: హరీశ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వం పనికొచ్చే సమీక్షలు చేయడం లేదని, సమీక్షల తర్వాత కేసీఆర్ ప్రభుత్వం అవినీతి చేసిందంటూ లీకులు ఇస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు మండిపడ్డారు. ఇదంతా ఓ ఆరునెలలు సాగుతుందేమో, ఆ తర్వాత చెల్లదని స్పష్టం చేశారు. ఎవరూ అధైర్య పడొద్దని, భవిష్యత్‌లో వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అన్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత నిజమైన మార్పు వస్తుందన్నారు. కొందరు బీఆర్‌ఎస్ నుంచి అధికారం కోసం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నారని, చెత్త పార్టీ నుంచి వెళ్లిపోతోందని భావిద్దామని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వారు బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, పోలీసులతో భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పోలీస్ స్టేషన్లు, జైళ్లు, పోరాటాలు తమకు కొత్త కాదన్నారు. కార్యకర్తలకు ఏం జరిగినా, 39 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బస్సు వేసుకుని బాధితుల దగ్గరికి వచ్చి అండగా ఉంటారన్నారు. రైతు బంధు విషయంలో కేసీఆర్ చిత్తశుద్ధిని, ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

లండన్ థేమ్స్‌లా మూసీ అభివృద్ధి

- నది పునరుజ్జీవం, అభివృద్ధి కోసం రాష్ట్ర సర్కారు ప్రణాళిక
- విజన్ 2050కు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయం
- లండన్ పర్యటనలో థేమ్స్ నది పాలక మండలితో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి



థేమ్స్ నది పాలక మండలి సభ్యులతో సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: నదులు, సరస్సులు, సముద్ర తీరం వెంట ఉన్న నగరాలన్నీ చారిత్రాత్మకంగా అభివృద్ధి చెందాయని.. హైదరాబాద్‌కు కూడా అటువంటి ప్రత్యేకత ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అటు మూసీ నది వెంబడి, హుస్సేన్‌సాగర్ చుట్టూ, ఉస్మాన్‌సాగర్ వంటి జలాశయాలు కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పారు. మూసీకి పునర్వైభవం తీసుకొస్తే.. నది, సరస్సులతో హైదరాబాద్ మరింత శక్తివంతంగా తయారవుతుందని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా.. ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను తెలుసుకునేందుకు సీఎం రేవంత్ బృందం బ్రిటన్‌లోని లండన్‌లో పర్యటించింది. ఆ నగరంలోని థేమ్స్ నదిని పరిశీలించి.. దానిని నిర్వహిస్తున్న తీరును, అక్కడి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును అభివృద్ధి చేసిన తీరును సీఎం అడిగి తెలుసుకున్నారు. తర్వాత థేమ్స్ నది పాలక మండలి, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ అధికారులు, నిపుణులతో దాదాపు మూడు గంటల పాటు సమావేశమై చర్చించారు. విజన్ 2050కి అనుగుణంగా మూసీ అభివృద్ధి ప్రాజెక్టును చేపట్టనున్నామని, దీనికి సహకరించాలని సీఎం రేవంత్ కోరారు.

అభివృద్ధితోపాటు సంరక్షణకు ప్రాధాన్యం

దశాబ్దాలుగా వివిధ దశల్లో థేమ్స్ నదీ తీరం వెంట చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అక్కడి కార్పొరేట్ అఫైర్స్ డైరెక్టర్ సియాన్ ఫోస్టర్, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ హెడ్ రాజ్‌కెహల్ లీవీ తదితరులు సీఎం రేవంత్ బృందానికి వివరించారు. ఈ క్రమంలో ఎదురైన సవాళ్లు, పరిష్కారాలు, ఖర్చయిన నిధులు, అనుసరించిన విధానాలను తెలిపారు. నదీ ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలతోపాటు నది సంరక్షణకు ప్రాధాన్యమిచ్చినట్టు స్పష్టం చేశారు. నదీ జలాలను సుస్థిరంగా ఉంచటంతోపాటు స్థానికులకు ఎక్కువ ప్రయోజనముండే రెవెన్యూ మోడల్‌ను ఎంచుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు తాము పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన ఔట్ లైన్, వివిధ సంస్థల భాగస్వామ్యంపై చర్చించారు. భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరపాలని నిర్ణయించారు. సమావేశంలో సీఎం రేవంత్‌తోపాటు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత సంతతి బ్రిటన్ ఎంపీలతో రేవంత్ భేటీ

దావోస్ పర్యటన ముగించుకుని లండన్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి భారత సంతతి ఎంపీలతో సమావేశమయ్యారు. ఓల్డ్ వెస్ట్ మినిస్టర్ పార్లమెంటు భవనంలో లేబర్ పార్టీకి చెందిన ఎంపీ వీరేంద్రశర్మ ఆతిథ్యమిచ్చిన ఈ భేటీలో.. ఏడుగురు బ్రిటన్ ఎంపీలతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. భారత్–బ్రిటన్ దేశాల మధ్య ఉన్న బలమైన దౌత్యబంధం ఉందన్నారు. ఇరు దేశాలు మహాత్మాగాంధీ సందేశాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

దావోస్ పర్యటన విజయవంతం

- రూ.40,232 కోట్ల పెట్టుబడులకు దిగ్గజ కంపెనీల ఆసక్తి
- పారిశ్రామికవేత్తలను ఒప్పించడంలో విజయం సాధించాం: సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: తమ దావోస్ పర్యటన విజయవంతమైందని, తెలంగాణ ఏర్పాటు తరువాత అత్యధిక పెట్టుబడులను ఆకర్షించగలిగామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారత్‌లో పెట్టుబడులకు తెలంగాణను తొలి రాష్ట్రంగా ఎంచుకునేలా పారిశ్రామికవేత్తలను ఒప్పించడంలో విజయం సాధించామన్నారు. మొత్తం రూ.40,232 కోట్ల పెట్టుబడులతో, 35 వేల ఉద్యోగాల కల్పన జరిగేలా దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు మూడు రోజుల దావోస్ పర్యటన ముగింపు సందర్భంగా పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 2 నెలలు కూడా కాక ముందే ఇంత భారీస్థాయిలో పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు వెల్లడించారు. టాటా గ్రూప్, అదానీ, జిందాల్, గోడి ఇండియా, వెబ్ వెర్క్స్, ఆరాజెన్ లైఫ్ సైన్సెస్, గోద్రెజ్ ఇండియా, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్, ఉబర్, క్యూ సెంట్రియో, ఓ9 సొల్యూషన్స్ వంటి కంపెనీలు తెలంగాణలో తమ ప్రాజెక్టుల స్థాపన, విస్తరణకు ముందుకొచ్చాయని వివరించారు. దావోస్‌కు రావడం, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వ్యాపారవేత్తలను కలుసుకోవటం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధితోపాటు సంక్షేమం అందించాలంటే పెట్టుబడులు, వృద్ధి కలసి రావాలని.. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించేందుకు తమ ప్రయత్నం కొనసాగుతుందన్నారు.



ఏటా 2 లక్షల మంది యువతకు ఉపాధి శిక్షణ

- మండల, జిల్లా స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాదాపూర్ (హైదరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లను అభివృద్ధి చేయనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో శుక్రవారం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి న్యాక్ ప్రతినిధులతో కలసి సంస్థలో కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం 2 లక్షల మంది యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. మండల, జిల్లా స్థాయిలో ఒక్కో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రయోగాత్మకంగా మొదలుపెట్టి అనంతరం వాటిని విస్తరిస్తామని వివరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరానికి సంబంధించిన న్యాక్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి, న్యాక్ వైస్ చైర్మన్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

24న బీసీ గురుకుల వ్యవసాయ డిగ్రీ కాలేజీలో ప్రవేశాల కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ ఈఐఎస్) పరిధిలోని వనపర్తి, కరీంనగర్ మహిళా వ్యవసాయ డిగ్రీ కాలేజీల్లో బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 24న రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్యభట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్ – 2023లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. ఎంసెట్ ర్యాంక్‌తోపాటు గురుకుల అగ్రికల్చర్ డిగ్రీ కాలేజీ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులు మాత్రమే హాజరుకావాలని సూచించారు. కౌన్సెలింగ్ వివరాలు, ఖాళీ సీట్లసంఖ్య కేటగిరీలవారీగా సొసైటీ వెబ్‌సైట్ (https://mjptbcwreis. telan gana.gov.in)లో ఉంచామని తెలిపారు.

వేగంగా కోలుకుంటున్న తమ్మినేని

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వేగంగా కోలుకుంటున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తెలిపారు. ఆయనకు వెంటిలేటర్‌ను కూడా తొలగించారని, కుటుంబ సభ్యులతో, పార్టీ ముఖ్య నాయకులతో తమ్మినేని మాట్లాడుతున్నారని వివరించారు. కొద్దిరోజుల్లోనే ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అవుతారని తెలిపారు. ఆయనను చూసేందుకు ఎక్కువమంది వస్తే ఇబ్బంది పడే అవకాశం ఉన్నందున ఆసుపత్రికి ఎవరూ రావొద్దని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.





17, 18 తేదీల్లో ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం

- 101 శాతాన్ని మించి ఓఆర్ నమోదు
- రెండురోజుల్లో సమకూరిన రూ.45.1 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి వస్తుండటంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. బుధ,గురువారాల్లో రికార్డు స్థాయిలో 101 శాతాన్ని మించి ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) నమోదైంది. ఈ రెండు రోజుల్లో టీఎస్ఆర్టీసీకి రూ.45.1 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు 33.93 లక్షల కి.మీ.మేర తిరిగి 48.94 లక్షలమంది ప్రయాణికులను గమ్యం చేర్చాయి. ఆ రోజు 101.62 శాతం ఓఆర్‌తో రూ.22.45 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక 18వ తేదీన 34.18 లక్షల కి.మీ.మేర బస్సులు తిరిగ్గా 50.60 లక్షలమంది ప్రయాణికులు గమ్యం చేరారు. 101.92 శాతం ఓఆర్ నమోదైంది. ఇప్పటివరకు ఇదే గరిష్ట శాతం కావటం విశేషం. ఆ రోజు రూ.22.65 కోట్ల ఆదాయం సమకూరింది. ఒక రోజులో ఇంత ఆదాయం నమోదు కావటం కూడా ఇదే తొలిసారి కాగా, గతేడాది జనవరి నెలలో 17వ తేదీనాటికి సమకూరిన ఆదాయం కంటే ఈసారి రూ.92 కోట్లు ఎక్కువ నమోదు కావటం విశేషం.






ఖాదర్‌వలీకి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ రాష్ట్రపతి కోవింద్

ఖాదర్‌వలీకి ‘బ్రిక్స్’ జీవన సాఫల్య పురస్కారం

- అవార్డును ప్రదానం చేసిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

సాక్షి సాగుబడి, హైదరాబాద్: బ్రిక్స్‌- చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (సీసీఐ) 2024 వార్షిక పురస్కారాల ప్రదానోత్సవంలో ‘మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియా’, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలీ జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలోని లెమెరిడీన్ హోటల్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బ్రిక్స్‌-సీసీఐ సుస్థిర వ్యవసాయ మార్గదర్శి జీవన సాఫల్య పురస్కారాన్ని ఖాదర్‌వలీకి ప్రదానం చేశారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ...ప్రస్తుతం ప్రపంచం కేంద్రీకృత కార్పొరేట్ వ్యవస్థ దిశగా ఎకనామిక్ మోడల్‌ను అనుసరిస్తోందని, ఎకాలజీ మోడల్ దిశగా జరిగితే తప్ప మానవాళికి భద్రమైన భవిత అసాధ్యమన్నారు. ప్రకృతి వనరులను విచ్చలవిడిగా ఖర్చు చేసే వినిమయతత్వం నుంచి వనరులను పొదుపుగా వాడుకునే సంరక్షణ విధానానికి మారాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ పురస్కార ప్రదానోత్సవంలో ఖాదర్ వెంట ఆయన భార్య ఉష ఉన్నారు.



నిత్యజ్ఞాన స్వరూపమైన ఆత్మకు పుట్టుక లేదు. గిట్టుటా లేదు. ఇది మరేదో ఒక దాన్నుండి రూపొందింది కాదు. దీన్నుండి మరేదైనా రూపొందడమూ లేదు. ఇది నిత్యము. శాశ్వతము. శరీరం నాశనమైనా దీనికి నాశనం లేదు.

– కేనోపనిషత్తు

సాక్షి

శనివారం, 20 జనవరి 2024

పరిణతితో ప్రవర్తించాలి

ప్రపంచంలో ఉన్న ఘర్షణలు చాల్లేదన్నట్టు కొత్త తగువులు పుట్టుకొస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఇస్లామిక్ రాజ్యాలైన ఇరాన్, పాకిస్తాన్‌లు ఉగ్రవాదాన్ని అణిచే పేరిట పరస్పరం క్షిపణులతో, డ్రోన్‌లతో దాడులు జరుపుకోవటం తాజా పరిణామమైతే ఇంతవరకూ ఇరుపక్షాలకూ సర్దిచెప్పటానికి ఎవరూ ప్రయత్నిస్తున్నట్టు లేదు. పాక్ గగనతలాన్ని అతిక్రమించిన ఇరాన్ విమానాలు సున్నీ మిలిటెంట్ సంస్థ జైష్ అల్ అదల్ స్థావరాలపై దాడులు చేయగా పాకిస్తాన్ సైతం ఇదే వంకతో ఇరాన్ భూభాగంపై బాంబులు కురిపించింది. ఇరాక్, సిరియాలపైనా ఇరాన్ దాడులు చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధం మొదలై రెండేళ్లు దాటుతుండగా, మూడు నెలల క్రితం గాజాలో ఇజ్రాయెల్ మొదలెట్టిన దాడులు విరామం లేకుండా సాగుతూనేవున్నాయి. దాదాపు 24,000 మంది పాలస్తీనా పౌరుల ప్రాణాలు బలయ్యాయి. అటు ఎర్ర సముద్రంలో హౌతీలపై అమెరికా, బ్రిటన్‌లు చేస్తున్న దాడులు ఫలిస్తున్న సూచనలు కనబడటం లేదు. ఇండో–పసిఫిక్ ప్రాంతం రానున్న కాలంలో పెను సవాలు కాబోతున్నదని అగ్రరాజ్యాలు అంచనా వేసుకుని పదిహేనేళ్లుగా పథక రచన చేస్తుండగా తాజా పరిణామాలు ఆ అంచనాలను తలకిందులు చేశాయి.

దేశాల మధ్య ఉన్న విభేదాలు దీర్ఘకాలం అపరిష్కృతంగా ఉండిపోతే అవి ఏదో ఒక దశలో కొత్త బలాన్ని సంతరించుకుని మరింత సంక్లిష్టంగా మారుతాయి. ఇప్పుడు ఘర్షణలు తలెత్తిన ప్రాంతాలు, ఇప్పటికే ఉద్రిక్త వాతావరణం నెలకొన్న ప్రాంతాలు గమనిస్తే ఈ సమస్యలు కొత్తగా తలెత్తినవి కాదని అర్థమవుతుంది. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం చోటుచేసుకుని అప్పటి పాలకుడు ఇరాన్ షా పదవీచ్యుతుడయ్యేవరకూ ఇరాన్, పాకిస్తాన్ రెండూ అమెరికాకు గట్టి మిత్ర దేశాలు. మనతో 1965లోనూ, ఆ తర్వాత 1971లోనూ పాకిస్తాన్ తలపడినప్పుడు ఆ దేశాన్ని అన్నివిధాలా ఆదుకున్న చరిత్ర ఇరాన్‌ది. పాకిస్తాన్ విచ్ఛిన్నాన్ని సహించబోనని ఇరాన్ షా పరోక్షంగా మన దేశాన్ని హెచ్చరించాడు. అలాగని ఇరాన్–పాకిస్తాన్ సరిహద్దులు ఎప్పుడూ ప్రశాంతంగా లేవు. అక్కడ స్థావరాలు ఏర్పర్చుకుని ఆ రెండింటినీ చికాకు పెడుతున్న బలూచిస్తాన్ మిలిటెంట్లకు కొదవ లేదు. కానీ ఇరాన్‌లో ఆయతుల్లా ఖొమైనీ ఏలుబడి తర్వాత అక్కడ షియాల ఇస్లామిక్ రాజ్యం ఏర్పడ్డాకే ఆ దేశానికి సున్నీ మెజారిటీ పాకిస్తాన్‌తో సమస్యలు బయల్దేరాయి. అటు పాకిస్తాన్ ఆర్థికంగా దివాలా తీసిన స్థితిలో వుండగా, ఇటు ఇరాన్ అమెరికా విధించిన ఆంక్షలతో ఊపిరాడకుండా వుంది. ఇలాంటి గడ్డు స్థితిలో అక్కడ తక్షణం యుద్ధం తలెత్తే ప్రమాదం వుండకపోవచ్చు. అలాగని ఆ రెండు దేశాలూ ఒక అంగీకారానికి రాకపోతే ఏమైనా జరగొచ్చు. వాస్తవానికి ఇజ్రాయెల్ అస్తిత్వానికి ఏ బెడదా లేకుండా చేయటానికీ, పశ్చిమాసియాలో తన పట్టు జారకుండా చూసుకొనేందుకూ అమెరికా చేయని ప్రయత్నమంటూ లేదు. పాలస్తీనా విషయంలో 1973 వరకూ ఏకతాటిపై ఉన్న అరబ్ దేశాలూ, ఇతర ముస్లిం దేశాలూ ఆ తర్వాత కాలంలో పరస్పరం విభేదించుకోవటంలో అమెరికా పాత్ర తక్కువేమీ కాదు. 1979లో ఇజ్రాయెల్–ఈజిప్టు మధ్య సయోధ్య కుదిర్చిన మాదిరిగానే 1994లో జోర్డాన్‌తో, ఈమధ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, మొరాకోలతో ఇజ్రాయెల్‌కు సఖ్యతను ఏర్పర్చింది కూడా అమెరికాయే. మరోపక్క సిరియాలో బషర్ అల్ అసద్‌తో, యెమెన్‌లో హౌతీలతో, గాజాలో హమాస్, ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఫ్రంట్‌లతో, లెబనాన్‌లో హిజ్‌బొల్లాతో జట్టుకట్టి అమెరికా అనుకూల ఫ్రంట్‌కు ప్రత్యామ్నాయాన్ని రూపొందించటంలో ఇరాన్ చాన్నాళ్లుగా బిజీగా వుంది. ఇజ్రాయెల్‌కు దగ్గరైన దేశాల్లో చాలా భాగం సున్నీ ఆధిపత్యంలోనూ, ఇరాన్ కూడగడుతున్న దేశాలు షియా ప్రాబల్యంలోనూ ఉండటం యాదృచ్ఛికం కాదు. ఈమధ్యలో చైనా ఏడెనిమిదేళ్లుగా జరుపుతున్న మధ్యవర్తిత్వం ఫలించి నిరుడు మార్చిలో ఇరాన్–సౌదీ మధ్య చర్చలు మొదలయ్యాయి.

ఏదీ కారణం లేకుండా మొదలు కాదు. విస్తరించదు. బలూచిస్తాన్‌లో ముస్లిం మైనారిటీల సమస్యలను పరిష్కరించటంలో ఇరాన్, పాకిస్తాన్ రెండూ వైఫల్యం చెందటం వల్లే ఆ ప్రాంతం చాన్నాళ్లుగా భగ్గుమంటోంది. బలూచిస్తాన్‌లో అటు షియాలూ, ఇటు సున్నీలూ ఉన్నా జాతి, తెగల పరంగా ఆ వర్గాలమధ్య ఎన్నో వ్యత్యాసాలున్నా ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలూ, భాష వగైరాల్లో అక్కడి ప్రజల తీరుతెన్నులే వేరు. తాము అటు ఇరాన్‌కూ, ఇటు పాకిస్తాన్‌కూ చెందబోమని, తమది ప్రత్యేక విధానమని వారి వాదన. స్వతంత్ర సిస్తాన్–బలూచిస్తాన్ ఏర్పాటులోనే తమ భవిష్యత్తు ముడిపడివున్నదని అక్కడి పౌరులు భావిస్తుంటారు. ఈ మైనారిటీల మనోభావాలను సకాలంలో గుర్తించి, సరిచేసేందుకు ప్రయత్నించివుంటే మిలిటెంట్ సంస్థల ప్రభావం అక్కడ వుండేది కాదు. కానీ అటు ఇరాన్, ఇటు పాకిస్తాన్ అణిచివేతనే నమ్ముకున్నాయి. పైగా మీ మెతకదనంవల్లే సమస్య ముదిరిందని పరస్పరం ఆరోపించుకుంటున్నాయి. తాజా ఇరాన్ దాడుల వెనక పశ్చిమాసియా ఘర్షణలను విస్తరించాలన్న ఆలోచనలున్నాయని కొందరు విశ్లేషకులు అనుమానిస్తున్నారు. కరోనా మహమ్మారి, రష్యా–ఉక్రెయిన్ ఘర్షణలు ఇప్పటికే ప్రపంచాన్ని పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోయేలా చేశాయి. రష్యానూ, ఇజ్రాయెల్‌నూ అదుపు చేసేందుకు ప్రయత్నించాల్సిన తరుణంలో మరో సంక్షోభాన్ని పెంచటం క్షమార్హం కానిది. కనుకనే పాకిస్తాన్, ఇరాన్ రెండూ సంయమనం పాటించి చర్చలకు సిద్ధపడాలి. ఆ ప్రాంత మైనారిటీల మనోభావాలేమిటో తెలుసుకుని పరిణతితో ఆలోచిస్తే శాశ్వత పరిష్కారం అసాధ్యం కాదని గుర్తించాలి.

అయోధ్యతో కుదరాలి సయోధ్య

సందర్భం



పి. వేణుగోపాల్ రెడ్డి

జనవరి 22న అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్నది. ఏ విధంగా చూసినా ఇదొక చరిత్రాత్మక ఘట్టమే. ఇది హిందువుల ఐదు వందల ఏళ్ల ధార్మిక, రాజకీయ, న్యాయ పోరాటాల ఫలితం. ఈ వాస్తవాన్ని నిరాకరించడం విజ్ఞత కాదు. కొన్ని పీఠాల ఆచార్యులు, రాజకీయ పార్టీలు, ముహూర్తం గురించి, బీజేపీ ప్రమేయం గురించి లేవనెత్తుతున్న వివాదాలు ఇప్పుడు ప్రతిష్ఠను ఆపలేవు. అసలు కొత్త వివాదాలు లేవదీయడమే అసంగతం. శ్రీరామచంద్రుడిని హిందువులు మర్యాద పురుషోత్తమునిగా కొలుస్తారు. ఆ విశ్వాసాన్ని మిగిలిన మతస్థులు గౌరవించడం మర్యాద. ఆత్మ గౌరవానికి సంబంధించిన భావన ఇందులో బలమైనది, ప్రధానమైనది. భారతదేశ వైవిధ్యం పరిఢవిల్లాలంటే అన్ని మతాల మధ్య సయోధ్య నెలకొనాలి.

రామాలయ నిర్మాణం అంటే ఇటుకలు, సిమెంట్, ఒక నిర్మాణం అనుకోవద్దని లాల్ కృష్ణ అద్వానీ రథయాత్ర సమయం నుంచి సంఘ పరివార్ చెబుతూనే ఉన్నది. విదేశీ పాలనలతో మిగిలిపోయిన మానసిక బానిసత్వ జాడలు తొలగించుకోవాలన్న తాత్త్వికత కలిగిన రాజకీయ పక్షం, దాని నాయకత్వంలోని ప్రభుత్వం హయాంలో అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్నది. బాబ్రీ కమిటీ తరపున కోర్టులో పోరాడిన అన్సారీ సహా, పలువురు ముస్లింలు అయోధ్య ఆలయ నిర్మాణ స్ఫూర్తిని సరిగానే గ్రహించారు. పలువురు సిక్కులు కూడా. మనమంతా ఈ దేశ వారసులం, ఈ భూమిపుత్రులం అన్న ఏకసూత్రాన్ని ప్రాణప్రతిష్ఠ వారిలో ప్రతిష్ఠించింది.

ఆలయ నిర్మాణం పూర్తయింది కాబట్టి గతాన్ని మరచి అంతా సమైక్యంగా ఉండాలంటూ కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిస్వామి వంటి వారు పిలుపునివ్వడం శుభసూచకమే. అలాగే ప్రఖ్యాత పురావస్తు శాస్త్రవేత్త కె.కె.మహమ్మద్ కొద్దిరోజుల క్రితమే కాశీ, మధుర కూడా హిందువులకు అప్పగించడం సరైన చర్య అవుతుందని ఒక ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడమూ అసంగతం కాబోదు. డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి వంటి వారు ఇస్తున్న గణాంకాల ప్రకారం విదేశీయుల దండయాత్రలతో, మతోన్మాదంతో, పాలనలో ముప్పయ్ నుంచి నలభయ్ వేల హిందూ దేవాలయాలు నేలమట్టమైనాయి. హిందూ సమాజం వాటి గురించి పట్టుపట్టడం లేదు. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ డా.మోహన్ భాగవత్ కూడా ప్రతి మసీదులోనూ శివలింగాలను వెతికే పని చేయవద్దని నిర్మాణాత్మకమైన సూచన చేశారు. అయినా చరిత్రకారులుగా, ఉదారవాదులుగా చలామణీ అవుతున్న కొందరి వైఖరి హిందువులే తగ్గి ఉండాలన్నట్టుగా ఉంది. భారతదేశ వైవిధ్యం పరిఢవిల్లాలంటే అన్ని మతాల వారి మధ్య సయోధ్య నెలకొనాలి. సెక్యులరిజం అంటే మెజారిటీ మతస్థుల మనోభావాలకు మన్నన లేకపోవడం, మైనారిటీల బుజ్జగింపు కాదన్న దృష్టి అవసరం. ఒక ఆర్థిక శక్తిగా అవతరిస్తున్న భారత్ మత ఉద్రిక్తతలతో తన ప్రగతివేగాన్ని తనే తగ్గించుకోవడం ఆగిపోవాలి. దానికి రామమందిర ప్రాణ ప్రతిష్ఠతో శ్రీకారం చుట్టాలి.

బాబ్రీ మసీదు రగడలో ముస్లింల వైపు నుంచి మతోన్మాద దృక్కోణాన్ని చూడక్కరలేదు. మొదటి నుంచి బుజ్జగింపు రాజకీయాలనే నమ్ముకున్న పార్టీలు, కుహనా సెక్యులరిస్టు చరిత్రకారుల వల్ల ఇది రావణకాష్ఠం అయింది. ఈ మాట సంఘపరివార్ అన్నది కాదు. పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ కె.కె. మహమ్మద్ అన్నదే. అయోధ్య గురించి పదే పదే మాట్లాడి సమస్యను జటిలం చేసిన కొందరు చరిత్రకారులను సాక్షాత్తు సుప్రీంకోర్టు 2019 నాటి తన తీర్పులో అభిశంసించిన సంగతిని మరచిపోవద్దు. నిజానికి మసీదులను తరలించడం,



ముస్లిమేతరులు కూల్చడం, స్వయంగా ముస్లిములే తొలగించడం వంటి ఘట్టాలు బాబ్రీ కూలిన 1992 డిసెంబర్ 6కు ముందు ఉన్నాయి, తరువాత కూడా జరిగాయి. కొన్ని ఉదాహరణలు చూడాలి.

మొదటిగా చెప్పుకోవలసినది సౌదీ అరేబియాలో ప్రవక్త మహమ్మద్ జీవితంతో సంబంధం ఉన్న మసీదులు, ప్రాంతాలను కూడా వారు అవసరం మేరకు తొలగించారు. ప్రవక్త మసీదు అందులో ఒకటి. ఇది ప్రవక్త కట్టించిన పెద్ద మసీదులలో రెండవదని ముస్లిం సమాజం నమ్ముతుంది. ఈ పనిని అక్కడి ప్రభుత్వం అభివృద్ధిలో భాగంగా చేసింది. కానీ బాబ్రీ అయోధ్య విషయంలో ఇంత అవాంఛనీయ వాతావరణం ఎందుకు ఏర్పడింది? దాని వెనుక ఉన్న శక్తులు ఏమిటనేది పరిశీలిస్తే అర్థమవుతుంది. అయోధ్య రగడకు కేంద్రబిందువు జహీరుద్దీన్ మహమ్మద్ బాబర్‌కు మరణానంతరం జరిగిన గౌరవం ఏమిటో తెలియాలంటే, ఆయన సమాధికి పట్టిన గతి ఏమిటో తెలియాలి. 1530లో చనిపోవడానికి ముందే తన అంత్యక్రియలు ఆఫ్ఘనిస్తాన్‌లో జరగాలని వారసులను కోరాడు బాబర్. కానీ వారు ఆగ్రాలోనే నిర్వహించారు. బాబర్ కొడుకు హుమాయున్‌ను తరిమేసి అధికారంలోకి వచ్చిన షేర్‌షా సూర్ 1539 ప్రాంతంలో బాబర్ కోరికను నెరవేరుస్తున్న తీరులో ఆ అవశేషాలను కాబూల్ నగర శివార్లకు చేర్చాడు. అక్కడే సమాధి ఏర్పడింది. దానిని షాజహాన్, జహంగీర్ తరువాత పెద్ద గార్డెన్‌గా అభివృద్ధి చేశారు. ఆఫ్ఘాన్ రాజు నాదిర్‌షా ఈ గార్డెన్‌ను (11 హెక్టార్లు) ఒక విహార యాత్రా స్థలంగా మార్చాడు. సమాధి రూపు మార్చాడు. అక్కడంతా ఐరోపా శైలిలో భవనాలు కట్టి, హోటళ్లు, వినోదకేంద్రాలు ఏర్పాటు చేశాడు.

పోలెండ్ చరిత్రంతా రష్యా జార్ చక్రవర్తులతో, 'ఎర్ర జార్'లతో పోరాటమే. 1920లో రాచరిక జార్‌ల ఆధిపత్యం పోయిన తరవాత రాజధాని వార్సాలోని అలెగ్జాండర్ నెవ్‌స్కీ కెథడ్రల్‌ను పోలెండ్ ప్రభుత్వమే కూల్చింది. 1894లో నిర్మాణం మొదలుపెట్టి 1912లో పూర్తి చేశారు. 70 మీటర్ల ఎత్తయిన ఈ నిర్మాణం లియోన్ బెనొయిస్ అనే నాటి ప్రఖ్యాత వాస్తుశిల్పి ఆధ్వర్యంలో గొప్ప కళాత్మకంగా జరిగింది. అయినా నిర్మాణం పూర్తయిన పదేళ్లకే కూల్చారు. కారణం ఒక్కటే. పోలెండ్ ప్రజల జాతీయభావాలను అవమానించడానికి జార్ చక్రవర్తి ఈ చర్చ్‌ను నిర్మించాడని స్వతంత్ర పోలెండ్ భావించడమే. రెండు దేశాలవారు క్రైస్తవులే. తమ ప్రార్థనాలయాలే అయినా అందులో జార్ చక్రవర్తి అణచివేత జాడలను చూశారు.

ఇక చైనాలో వీగర్ ముస్లింలు, వారి అస్తిత్వం ప్రశ్నార్థకమైన సత్యాన్ని వీగర్ హ్యూమన్ రైట్స్ ప్రాజెక్ట్ నివేదిక వివరాలు కాస్త పరిశీలించినా అర్థమవుతుంది. కేరియా ఈద్‌కాహ్ మసీదు 1200 సంవత్సరం ప్రాంతంలో నిర్మించినది. ఈ మసీదు రూపాన్ని వికృతం చేసి, పగోడాలా తయారు చేశారు. 1540 నాటి కార్గిలిక్ మసీదును పూర్తిగా ధ్వంసం చేశారు. 2016లో 100 మసీదులను నేలమట్టం చేయడం లేదా, రూపురేఖలను మార్చడం జరిగింది. అంటే మసీదును సంకేతించే గుమ్మటాలు, మీనార్లు తొలగించారు. అయోధ్య మసీదు విషయంలో రగడ చేసిన వామపక్షాల వారు, వారి అనుంగు చరిత్రకారులు వీగర్ ముస్లింల మీద కాస్తయినా సానుభూతి ప్రకటించరేమి? ఇంచుమించు కాన్‌సెంట్రేషన్ క్యాంపులలోనే బతుకుతున్న వీగర్ ముస్లింల గురించి పాకిస్తాన్, టర్కీ పెదవి విప్పవేమి?

ఇవి కొన్ని ఉదాహరణలు. ఇక్కడ రెండు విషయాలు గమనార్హం. ఈ విధ్వంసంలో ఎక్కడా హిందువులకు సంబంధం లేకపోవడం. బాబ్రీ విషయంలో మాత్రమే ఇంత రగడ జరగడం. అయోధ్య ఉద్యమం తీవ్రరూపం దాల్చి, అత్యధికంగా హిందువులు రామాలయం కోరుకున్నా కూడా మూడు దశాబ్దాలు వేచి చూడడం, వేచి ఉండేటట్టు చేయడం ఎందుకు? నమాజ్ జరగని ఒక మసీదు కోసం ఇంత రగడను ఎందుకు కొనసాగించినట్టు? ఇంతకీ, అయోధ్యలో కడుతున్న కొత్త మసీదు పేరు బాబ్రీ మసీదు కాదు. మరి దేని కోసం జరిగింది ఈ అడ్డగింత? చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుందాం. వాస్తవాలు గ్రహిద్దాం. అందులో మొదటిది, హిందువుల పరమత సహనం గురించి. అయోధ్య ఉద్యమ సమయంలో, ఆ నగరంలో లేదా భారతదేశంలో కావాలని ఏ మసీదునైనా కూల్చిన దాఖలాలు ఉన్నాయా? ఆరోపణలు ఉన్నాయా? మెజారిటీ ప్రజల మనోభావాలను అవమానించే తీరులో మైనారిటీలు వ్యవహరించడం సయోధ్యకు ఉపయోగపడేది కాదు. మెజారిటీ ప్రజలలో మెజారిటీ మనస్తత్వం సరికాదని చెబుతున్నవారు మైనారిటీల కొన్ని చర్యలలోని అసంబద్ధతను కూడా ఎత్తి చూపే బాధ్యతను స్వీకరించాలి.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్
ఈ–మెయిల్: pvg@ekalavya.net

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చికిత్స అందేలా...



ప్రపంచవ్యాప్తంగా సాధారణ క్యాన్సర్లలో బ్రెస్ట్ క్యాన్సర్ ఒకటి. దీనివల్ల ఇండియాలో అత్యధికంగా మరణిస్తున్నారు. దీనికి అందుబాటులో లేని చికిత్స ఒక కారణం. గతంలో కొన్ని ఔషధాలకు తగ్గించినట్టుగానే, బ్రెస్ట్ క్యాన్సర్ ఔషధాల మీద ఉన్న జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నా.

– డింపుల్ యాదవ్, సమాజ్‌వాదీ ఎంపీ

దౌత్య విజయం



ఇరాన్, గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్, రష్యా, అఫ్గానిస్తాన్‌తో మంచి సంబంధాలు నెరుపుతూనే, 'క్వాడ్', 'బ్రిక్స్'లో కూడా ఇండియా సభ్య దేశంగా ఉంది. ఇది మంచి విషయం.దౌత్యపు లక్ష్యం స్నేహితులను పెంచు కోవడమేగానీ, అర్థరహితంగా వ్యూహాత్మక శత్రువులను పెంచుకోవడం కాదు.

– ముర్తజా హుస్సేన్, జర్నలిస్ట్

సరిపోయాయి!



ఇరాన్, పాకిస్తాన్ పరస్పర దాడుల్లో గమనించాల్సింది. వస్తున్న క్షిపణులను కనిపెట్టడంలో ఇరు దేశాల వాయు రక్షణ వ్యవస్థలు విఫలమయ్యాయి. పైగా, దాడుల వెంటనే సౌభ్రాతృత్వ సంబంధాల గురించి రెండు దేశాలూ మాట్లాడటం ఆశ్చర్యకరం.

– తిలక్ దేవేశర్, రచయిత

అడగాల్సిన ప్రశ్న



జనవరి 22 నాటి ఆలయ వేడుక ఎలా జాతీయ ఉత్సవమో మనం ఇంకా అడగాల్సే ఉంది. దానిలో రాజ్యం భాగస్వామి కావడాన్ని మనం వ్యతిరేకించాలి. రహస్యంగా ఇండియాను హిందూ రాష్ట్రంగా మార్చడాన్ని మనం అంగీకరించకూడదు.

– అపూర్వానంద్, హిందీ ప్రొఫెసర్

సుడి లేనప్పుడు...



వృత్తి పరంగా అన్నీ బాగా సాగుతున్నప్పుడు, వ్యక్తిగత జీవితం గందరగోళంగా ఉంటుందని కొందరు చెబుతుంటారు. అబద్ధాలు! రెండు చోట్లా గందరగోళంగా ఉండటం కూడా సాధ్యమే.

– శ్రేయా ధన్వంతరి, నటి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

కార్మికవర్గ విప్లవ యోధుడు

కామ్రేడ్ లెనిన్ మరణించి ఈ జనవరి 21 నాటికి వందేళ్ళు పూర్తి అవుతున్నది. ఈ సందర్భంగా లెనిన్ జీవిత విశేషాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో వుంది. లెనిన్ అసలుపేరు వ్లాదిమిర్ ఇల్యీచ్ ఉల్యానోవ్. 1870 ఏప్రిల్ 22న రష్యాలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఒక పాఠశాల అధికారిగా పనిచేశారు. లెనిన్ సోదరుడు జార్ చక్రవర్తిపై హత్యాయత్నం చేశాడన్న నేరంమోపి ఆయనకు 1887లోనే ఉరిశిక్ష విధించారు. లెనిన్ తండ్రిని ఉద్యోగం నుండి విరమించుకోవాలని ఆనాటి జార్ ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేశారు. ఈ రెండు సంఘటనలు 17 ఏళ్ళ యువకుడైన లెనిన్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపి ఆ వయస్సులోనే జార్ ప్రభుత్వంపై వ్యతిరేక భావనలు ఏర్పడేటట్లు చేశాయి. న్యాయశాస్త్రం చదివే కాలంలోనూ జార్ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. లెనిన్ ఈ కాలంలోనే కారల్ మార్క్స్ రచనలతో ప్రభావితులై 1889లో మార్క్సిస్టు అయ్యారు. 1890–91 కాలంలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో లా ప్రాక్టీసు చేశారు. మార్క్సిస్టు కార్యకలాపాలలో పాల్గొంటున్నారని ఆరోపిస్తూ జార్ ప్రభుత్వం ఆయన్ను 1897లో అరెస్టు చేసి సైబీరియాకు పంపింది. అక్కడ ప్రవాస జీవితం గడుపుతూ 1898 జులై 22న నాదెజ్డా క్రూపస్కయాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత జర్మనీకీ, స్విట్జర్లాండ్‌కూ వెళ్ళి ఇతర యూరోపియన్ దేశాల మార్క్సిస్టులను కలిశారు. ఈ కాలంలోనే ఆయన 'లెనిన్' అనే పేరును పెట్టుకున్నారు.



కా॥ లెనిన్

మొదట్లో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆ తర్వాత బోల్షివిక్ గ్రూపునకు వ్యవస్థాపక నాయకుడయ్యారు. ఆ తర్వాత లెనిన్ అందించిన నాయకత్వం వల్ల, అవలంబించిన విప్లవ ఎత్తుగడల వల్ల 1917లో జార్ చక్రవర్తి ప్రభుత్వం కూలిపోయింది. తర్వాత ఆవిర్భవించిన సోవియట్ యూనియన్ సోషలిస్టు రిపబ్లిక్‌కు చైర్మెన్‌గా 1922లో ఎన్నికై 1924 జనవరి 21న తుదిశ్వాస విడిచే వరకు కొనసాగారు. అప్పటికి ఆయన వయస్సు 53 సంవత్సరాలు మాత్రమే. 1917లో రష్యాలో కా॥ లెనిన్ నాయకత్వాన విజయం సాధించిన అక్టోబర్ విప్లవం ప్రపంచంలోని అన్నిదేశాల వలస పాలకులపై ఆ యా దేశాల ప్రజలు తిరుగుబాటు చేసేవిధంగా స్ఫూర్తిని కలిగించింది. రష్యా విప్లవం తర్వాతనే ప్రపంచంలోని అన్నిదేశాల్లో ప్రజాస్వామ్య ఉద్యమాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, జాతుల విముక్తి పోరాటాలు వెల్లువెత్తాయి.

కా॥ లెనిన్ తాత్విక భూమికకు ఆయన రచనలు సాక్ష్యాలు. ముఖ్యంగా 'రాజ్యం – విప్లవం', 'కమ్యూనిజం – ఒక బాలారిష్టం', 'ఒక అడుగు ముందుకు–రెండు అడుగులు వెనక్కి', 'సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' లాంటి ఆయన రచనలు విప్లవకారులందరికీ మార్గదర్శకంగా ఉన్నాయి. లెనిన్ రష్యా విప్లవంలోనే గాక, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో నాయకత్వ పాత్ర వహించారు. వలస, అర్ధ వలస దేశాల విప్లవాలకు మార్గదర్శక సూత్రాలను రూపొందించారు. ఈ విధంగా పీడిత ప్రజల విముక్తి కోసం తన సర్వస్వాన్నీ అర్పించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి విశేషమైన, చరిత్రాత్మకమైన సేవలందించి కా॥ లెనిన్ అజరామరుడయ్యారు. ఆ మహనీయునికి అరుణారుణ జోహార్లు.

– సి. భాస్కర్, యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్)
(రేపు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా)

నిరుద్యోగ యువత ఆకాంక్ష నెరవేరేనా!

అభిప్రాయం



డా॥ ఎ. శంకర్

తెలంగాణ ఉద్యమం 'నీళ్లు, నిధులు, నియామకాలు' ప్రధాన అంశాలుగా ప్రారంభమైంది. విద్యార్థులు ఈ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సుమారు 1,200 మంది విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం కోసం తమ జీవితాలను అర్పించారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమీప భవిష్యత్తులో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉండదనీ, నూతన రాష్ట్రంలో తమ కలలు సాకారం అవుతాయనీ భావించిన నిరుద్యోగులు ఆశించారు. కానీ వారి ఆశలు ఆడియాసలయ్యాయి. మొదటి తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఉద్యోగ నియామకాల ఊసు లేకపోవడంతో 2015లో నిరుద్యోగ జేఏసీని ఏర్పాటు చేసి ఉద్యమం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఒకటీ అరా ఉద్యోగ ప్రకటనలు వచ్చినా అనేక మంది ఉద్యమకారులకు పరీక్షలకు హాజరవ్వడానికి వయసు మీరిపోయింది. అర్హత ఉన్న చాలా మంది సీనియర్లకు నవ యువకులతో పోటీపడే శక్తి లేకుండా పోయింది. అదే సమయంలో ఉద్యోగ నియామకాలపై కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇంతలో కొత్త ప్రభుత్వం మొదటి టెర్మ్ ముగిసిపోయింది. 2018లో మళ్లీ ఎన్నికలు వచ్చాయి. అంతకు ముందు అధికారంలో ఉన్న పార్టీయే మళ్లీ అధికారంలోకి వచ్చింది. ఈసారన్నా తమకు ఉద్యోగాలొస్తాయని నిరుద్యోగులు భావించారు. ఇంతలో కరోనా విజృంభించింది. దాని కోరల నుంచి బయటపడి గ్రూప్ వన్ పరీక్షకు ప్రిపేర్ అయిన నిరుద్యోగులను పేపర్ లీకేజ్ వ్యవహారం కుంగదీసింది. అప్పటినుంచి నిరుద్యోగులు చదవడం మానేసి తమకు జరిగిన అన్యాయాన్ని గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మొదలు పెట్టారు. ప్రభుత్వం నిరుద్యోగులకు భరోసా కల్పించడంలో విఫలమైంది. అదే సమయంలో ఉద్యోగం రాలేదని బాధతో ప్రాణ త్యాగం చేసినటువంటి ఒక విద్యార్థిని కూడా అవహేళన చేసే విధంగా మాట్లాడారు అధికారంలో ఉన్నవారు. అటువంటి అహంకార ధోరణిని నిరుద్యోగులు జీర్ణించుకోలేక పోయారు. అప్పటివరకు రాజకీయ ప్రక్రియలో చురుకుగా పాల్గొనని నిరుద్యోగ యువతీ యువకులు ఒక్కసారిగా రాజకీయాలను మార్పు చేయాలనీ, తమ తలరాతను తామే మార్చుకోవాలనీ భావించి ఈ మధ్యకాలంలో జరిగినటువంటి సాధారణ ఎన్నికల్లో ప్రభావాన్ని చూపించారు.



2023 జూన్ కంటే ముందు తెలంగాణలో వేరే పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితే లేదు. ఎందుకంటే బలమైన ప్రతిపక్షం లేదు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే నాయకులను మనం వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. అటువంటి పరిస్థితులలో గ్రూప్ వన్ పేపర్ లీకేజీ అంశం ప్రతిపక్ష పార్టీలకు ప్రధాన అస్త్రంగా మారింది. అప్పటినుంచి రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు మారినాయి. అన్ని పార్టీలు నిరుద్యోగ సమస్యని తమ ప్రధాన ఎజెండాగా కార్యాచరణ రూపొందించడం ప్రారంభించాయి. ఈ నిరుద్యోగ ఉద్యోగ సమస్యలు ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొని వచ్చాయి అనడంలో అతిశయోక్తి కాదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికార పార్టీ చాలా అంశాలను ప్రస్తావించింది కాని, నిరుద్యోగులకూ, ఉద్యోగులకూ భరోసా కల్పించే విధంగా ఏ వాగ్దానాలు చేయలేదు. అందువలన ఎక్కడెక్కడో చదువుకొనే చాలామంది నిరుద్యోగులూ, చిరుద్యోగులూ తమ తమ గ్రామాలకు వెళ్లి ఆ గ్రామాలలో ఉన్నటువంటి మిగతా వర్గాల వారికీ, ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వారికీ... తమ వాదాన్నీ, బాధనూ అర్థమయ్యేలా చెప్పుకున్నారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేయమని అర్థించారు.


నిరుద్యోగుల సమస్యలను ప్రజానీకానికి తెలియచేయడానికి శిరీష అలియాస్ బర్రెలక్క ఎన్నికల్లో పోటీ చేయడం తెలిసిందే. ఒక సాధారణ వెనుకబడిన తరగతికి చెందిన యువతికి సపోర్ట్ చేయడానికి విదేశాల నుంచి కూడా కొందరు రావడం, మన రాష్ట్రంలోని చాలామంది ప్రముఖులు ఆమెకు మద్దతు ప్రకటించడం మనం గమనించాం. నిరుద్యోగ సమస్య ఎజెండాగా తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి హేమాహేమీ నాయకులకు చెమటలు పట్టించిందామె. కాబట్టి పార్టీలు ఈ అంశాన్ని ఒక గుణపాఠంగా భావించవలసిన అవసరం ఉంది.

కాంగ్రెస్ పార్టీ ఒక సంవత్సర కాలంలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇవ్వడం, జాబ్ క్యాలెండర్లు ప్రకటిస్తామని భరోసా కల్పించడంతో నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి కాంగ్రెస్ పార్టీని సంపూర్ణ మెజారిటీతో గెలిపించారు. పార్టీలో గెలిచినటువంటి 64 మంది అభ్యర్థుల మెజారిటీని మనం గమనిస్తే ఎక్కువమంది సుమారు 20 వేల నుంచి 65 వేల మధ్య మెజారిటీ సాధించినవారే కనిపిస్తారు. ఇందుకు కారణం నిరుద్యోగ యువతే అని చెప్పవచ్చు. నూతన ప్రభుత్వమైనా విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించి వారి బంగారు భవిష్యత్తుకు బాట వేస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త రాజనీతి శాస్త్ర ఉపన్యాసకుడు
మొబైల్: 99514 50009

జీవిత ప్రవాహం

రాయి నుండి లోహంగా, లోహం నుండి మొక్కగా, మొక్క నుండి నేలమీద పాకే పురుగుగా, పురుగు నుండి నీళ్ళలో ఈదే చేపగా, చేప నుండి ఆకాశంలో ఎగిరే పక్షిగా, పక్షి నుండి సహజ ప్రవృత్తి గల జంతువుగా, జంతువు నుండి విచక్షణా జ్ఞానం గల మనిషిగా – ఇట్లా వివిధ దశల్లో పరిణామం చెందుతూ ముందుకు సాగటం సృష్టి లక్షణం. పరిణామ క్రమంలో మనిషిది చివరి దశ, చైతన్య వికసనంలోగాని, ఆకార విశేషంలోగాని.



పరస్పరం అర్థం చేసుకోవటానికి, అనుభవాలు పంచుకోవటానికి నోటి మాట, చేతి రాత రూపంలో మనుషులకో భాష ఉన్నది. అలాగే వృక్షాలకు, జంతువులకు కూడా వాటి సొంతమైన భాష వాటికి ఉన్నది. ఆ భాష అత్యంత ప్రాథమిక, అపరిపక్వ స్థితిలో ఉండినది అవచ్చుగాక. అన్ని జీవరాశులూ ఒకే ప్రపంచంలో మనుగడ సాగిస్తూ జీవిత ప్రవాహంలో ముందుకు సాగుతున్నాయి. పక్షులు, జంతువులు, మనుషులు – ఇలా ప్రతి ప్రాణీ జీవిత లక్ష్యాన్ని సాధించటంలో తన వంతు పాత్ర పోషిస్తున్నది. దైనందిన జీవితంలో దైవత్వాన్ని ఆవిష్కరింప జేసుకోవటమే ప్రతి ప్రాణి యొక్క పరమ లక్ష్యంగా ఉన్నది.

మానవుని ఆత్మ ఒకసారి మానవ రూపం ధరించి జన్మించినట్లయితే, ఇక ముందు ఎప్పుడు పునర్జన్మ ఎత్తినా మానవుడిగానే జన్మిస్తుంది. సృష్టి పరిణామ క్రమంలో జీవిత ప్రవాహం పురోగమిస్తుందే తప్ప తిరోగమించదు. అయితే దీనికి ఒక మినహాయింపు ఉన్నది. మనిషి తనకు సంప్రాప్తించిన శక్తి యుక్తుల్ని అత్యంత హీన కార్యాలకు ఉపయోగ పెట్టినట్లయితే, మరణానంతరం తదుపరి జన్మలో అతడు జంతువుగానో, పక్షిగానో, మరే ఇతర రూపంలోనో పుట్టవచ్చు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: శు.దశమి రా.10.07 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: కృత్తిక తె.5.38 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి రోహిణి, వర్జ్యం: సా.5.55 నుండి 7.27 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.35 నుండి 8.07 వరకు, అమృతఘడియలు: రా.3.28 నుండి 5.01 వరకు ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.39, సూర్యాస్తమయం: 5.44.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రమాదం
విస్టెక్స్ ఏషియా సీఈఓ సంజయ్ షా దుర్మరణం

- సంస్థ ప్రెసిడెంట్‌కు తీవ్ర గాయాలు; పరిస్థితి విషమం
- సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం ఫిల్మ్‌సిటీని బుక్ చేసిన విస్టెక్స్ సంస్థ
- లైమ్ లైట్ గార్డెన్‌లో గురువారం రాత్రి నిర్వహణ
- సరైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం
- 20 అడుగుల ఎత్తునుంచి ఇద్దరూ కిందకు దిగుతుండగా తెగిన ప్లాట్‌ఫామ్ తాడు
- అంబులెన్స్‌లు లేక ఆస్పత్రికి తరలించడంలో తీవ్ర జాప్యం
- ప్రాణాలు కోల్పోయిన ప్రవాస భారతీయుడు
- రామోజీ ఫిల్మ్ సిటీ మేనేజ్‌మెంట్‌తో పాటు ఇతరులపై పలు సెక్షన్ల కింద కేసు

సాక్షి, హైదరాబాద్/అబ్దుల్లాపూర్‌మెట్:

హైదరాబాద్ నగర శివార్లలో ఈనాడు అధినేత చెరుకూరి రామోజీరావు నేతృత్వంలోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఘోర ప్రమాదం జరిగింది. నిర్వాహకుల నిర్లక్ష్యం, ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, అత్యవసర సమయంలో వినియోగించడానికి అంబులెన్స్‌లు సైతం లేక ఆస్పత్రికి తరలించడంలో 20 నిమిషాల వరకు ఆలస్యం కావడంతో ఒకరు మృత్యువాత పడ్డారు. అంచెలంచెలుగా ఎదిగిన ప్రవాస భారతీయుడు, బహుళజాతి సంస్థ విస్టెక్స్ ఏషియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈఓ సంజయ్ షా (56) ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన ఆ సంస్థ ప్రెసిడెంట్ దాట్ల విశ్వనాథ్ రాజు అలియాస్ రాజు దాట్ల (52) ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలిలోనే ఉన్న షా సతీమణి అంబులెన్స్, అంబులెన్స్ అంటూ అక్కడ ఉన్న ఫిల్మ్ సిటీ సిబ్బందిని విలపిస్తూ వేడుకోవడం కంటతడి పెట్టించింది. గురువారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనపై సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కలిదిండి జానకిరామ్ రాజు ఇచ్చిన ఫిర్యాదుతో ఫిల్మ్ సిటీ సహా మరికొందరిపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముంబై నుంచి అమెరికా దాకా..

ముంబైకి చెందిన సంజయ్ షా 1989లో అమెరికాకు వలసవెళ్లారు. అక్కడి లేహై యూనివర్సిటీ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. అమెరికాలోనే ప్రైస్ వాటర్ హౌస్ కూపర్, జనరల్ మోటార్స్‌లతో పాటు జర్మనీలోని సాప్ సంస్థలోనూ ఉన్నత స్థానాల్లో పని చేశారు. తర్వాత సొంత కంపెనీ ఏర్పాటు కోసం ఆ ఉద్యోగాన్ని వదిలేశారు. 1999లో అమెరికాలోని ఇల్లినాయిస్ కేంద్రంగా విస్టెక్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా 20 దేశాల్లో విస్తరించింది. దీని వార్షిక టర్నోవర్ రూ.3,500 కోట్లకు పైగా ఉంది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోనూ దీని కార్యాలయం ఉంది. దీనికి కలిదిండి జానకిరామ్ రాజు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. తమ సంస్థ ఏర్పాటు చేసి 25 ఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాలని భావించిన యాజమాన్యం రామోజీ ఫిల్మ్ సిటీని వేదికగా ఎంచుకుంది.



ప్రమాదానికి కారణమైన ప్లాట్‌ఫామ్ ఇదే..

లైమ్‌లైట్ గార్డెన్‌లో..

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విస్టెక్స్ కార్యాలయాల్లో ఈ వేడుకలు జరుగుతుండగా.. ప్రతి కార్యక్రమానికీ సీఈఓ సంజయ్ షా, ప్రెసిడెంట్ విశ్వనాథ్ రాజు హాజరవుతున్నారు. ఇదే క్రమంలో హైదరాబాద్‌లోని తమ ఉద్యోగులు, క్లయింట్లతో కలిసి వేడుకల నిర్వహణకు రామోజీ ఫిల్మ్ సిటీలోని లైమ్‌లైట్ గార్డెన్‌ను బుక్ చేసుకున్నారు. రెండురోజుల పాటు జరిగే వేడుకల కోసం గురువారం రాత్రి ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు.

20 అడుగుల ఎత్తునుంచి దిగుతూ..

ప్రారంభ కార్యక్రమాన్ని వెరైటీగా నిర్వహించాలని నిర్ణయించారు. కాంక్రీట్ స్టేజీపైన ఉన్న రూఫ్‌కు తాళ్లు కట్టి, వాటికి వేలాడేలా చెక్కతో ఓ ప్లాట్‌ఫామ్ తయారు చేశారు. అలంకరించిన ఆ ప్లాట్‌ఫామ్ మెల్లగా కిందకు దిగుతుండగా సీఈఓ, ప్రెసిడెంట్‌లు 20 అడుగుల ఎత్తులో దానిపై నిలబడి.. ఆహుతులకు అభివాదం చేస్తూ స్టేజీపైకి దిగేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు ఫిల్మ్ సిటీతో పాటు ఈవెంట్ మేనేజర్ల అనుమతి కూడా తీసుకున్నారు. చెక్కతో చేసిన సదరు ప్లాట్‌ఫామ్‌కు రెండు వైపులా ఇనుప చువ్వలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి 7.40 గంటల సమయంలో ఈ ప్లాట్‌ఫామ్ పైకి ఇద్దరూ ఎక్కగా.. పైన ఉన్న రూఫ్‌కు కట్టిన తాళ్ల సాయంతో ప్లాట్‌ఫామ్‌ను పైనుంచి కిందకు దింపడం ప్రారంభించారు. అయితే కొద్దిసేపటికే ఒక పక్కన తాడు తెగిపోవడంతో ప్లాట్‌ఫామ్ పక్కకు ఒరిగి, దానిపై ఉన్న ఇద్దరూ దాదాపు 20 అడుగుల ఎత్తు నుంచి సిమెంట్‌తో కట్టిన స్టేజీపై వేగంగా పడిపోయారు.

విస్టెక్స్, ఫిల్మ్ సిటీ ఉద్యోగులు, ఈవెంట్ మేనేజర్లు వెంటనే అక్కడ గుమిగూడారు. విస్టెక్స్ సంస్థ ప్రతినిధులు తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ఏదైనా పెద్ద ఆస్పత్రికి తరలించడానికి సహాయం చేయాల్సిందిగా అక్కడ ఉన్న వారిని కోరారు. ఓ వైపు సరైన

సరైన భద్రతా ఏర్పాట్లు లేవు.. రెస్క్యూ లేదు

భద్రతా ఏర్పాట్ల లోపం కారణంగా ప్రమాదం జరగ్గా.. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించేలా సరైన రెస్క్యూ టీమ్ సైతం ఫిల్మ్ సిటీకి లేకపోవడంతో విలువైన సమయం వృథా అయ్యింది. ఆస్పత్రికి తరలింపు ఆలస్యమైంది. విస్టెక్స్ ప్రతినిధులు, షా భార్య 15 నుంచి 20 నిమిషాలు వేడుకుంటే తప్ప ఫిల్మ్ సిటీ నిర్వాహకులు అంబులెన్స్‌ను ఏర్పాటు చేయలేదు. అప్పటికే తీవ్ర రక్తస్రావంతో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. ఒక అంబులెన్స్‌లో సంజయ్ షాను హయత్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పతికి తరలించారు. విశ్వనాథ్ రాజును తీసుకువెళ్లడానికి మరో అంబులెన్స్ ఏర్పాటు చేయాల్సిందిగా కంపెనీ ప్రతినిధులు ఎంత వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయన్ను సొంత కారులోనే ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో సంజయ్ షా కన్నుమూశారు. విశ్వనాథ్ రాజును మెరుగైన చికిత్స నిమిత్తం మలక్‌పేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శరీరంలో అనేక చోట్ల ఎముకలు విరగటంతో పాటు తీవ్ర గాయాలైన ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

ఫిల్మ్ సిటీపై క్రిమినల్ కేసు నమోదు

జానకిరామ్ రాజు తన ఫిర్యాదులో ఫిల్మ్ సిటీలోని భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం తదితర అంశాలను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రామోజీ ఫిల్మ్ సిటీ మేనేజ్‌మెంట్ (ఉషా కిరణ్ ఈవెంట్స్), సీనియర్ ఈవెంట్ మేనేజర్ రితిక్ ఛటర్జీ, సేఫ్టీ డిపార్ట్‌మెంట్ చీఫ్ మేనేజర్ జి.ఉదయ్ కిరణ్, ఫిల్మ్ సిటీలో స్పెషల్ ఎఫెక్ట్స్ కాంట్రాక్టర్‌గా ఉన్న ఎస్.సురేష్ బాబు, రోప్ ఆపరేటర్ ఎస్.దుర్గా సతీష్ తదితరులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఇండియన్ పీనల్ కోడ్‌లోని 336, 287 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద వీరిపై ఆరోపణలు చేశారు.

భార్య కళ్ల ఎదుటే ప్రమాదం

రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రమాదం జరిగిన సమయంలో విస్టెక్స్ సంస్థ సీఈఓ సంజయ్ షా భార్య కూడా అక్కడే ఉన్నారు. దంపతులిద్దరూ గురువారం సాయంత్రం తమ సొంత విమానంలో ముంబై నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి, అక్కడి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీకి వచ్చారు. స్టేజీ కింద ఆహుతులతో కలిసి సంజయ్ భార్య కూర్చుని వీక్షిస్తుండగానే ఈ ప్రమాదం జరిగింది. దీంతో పరుగున స్టేజీ పైకి వచ్చిన ఆమె.. రక్తపు మడుగులో పడి ఉన్న తన భర్తను ఆస్పత్రికి తరలించండి అంటూ దాదాపు 15 నిమిషాలు అందరినీ వేడుకున్నారు.

ఉస్మానియాలో పోస్టుమార్టం.. ముంబైకి మృతదేహం

సంజయ్ షా మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో శుక్రవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం భార్యకు అప్పగించారు. అక్కడి నుంచి శవపేటికను మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ప్రత్యేక అంబులెన్స్‌లో ఎయిర్‌పోర్టుకు, ఆపై విమానాశ్రయం అంబులెన్స్‌లో షా విమానం ఉన్న ప్రాంతానికి తీసుకువెళ్లారు. కానీ అందులో శవపేటికను పెట్టడానికి అవకాశం లేకపోవడంతో కార్గో విమానంలో ముంబైకి పంపారు. షా భార్య సహా మిగిలిన వారు సంజయ్ విమానంలోనే ముంబై వెళ్లారు. తమ స్వస్థలం గుజరాత్ అని, ఏళ్ల క్రితమే ముంబైకి వలసవచ్చామని సంజయ్ భార్య పోలీసులకు తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఇద్దరు కుమార్తెలు వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని చెప్పారు.

రామోజీ సంస్థలో ప్రమాదాలు నిత్యకృత్యం

విషయం బయటకు రాకుండా అన్నిరకాల జాగ్రత్తలు, ఒత్తిళ్లు

- 2008, 2009లో జరిగిన ఉదంతాల్లో ఇదే తరహా వైఖరి
- అత్యధిక ఉదంతాల్లో ఉద్యోగులే క్షతగాత్రులు
- విస్టెక్స్ సీఈఓ బయటి వ్యక్తి కావడంతోనే ఈ ప్రమాదం బయటకు

సాక్షి, హైదరాబాద్: ఎక్కడా రహస్యాలు, దాపరికాలు ఉండకూడదంటూ ఊదరగొట్టే రామోజీరావు, తన దినపత్రిక, తన గ్రూపు సంస్థల్లో జరిగే ఉదంతాలను మాత్రం అత్యంత గోప్యంగా ఉంచాలని చూస్తారు. ముఖ్యంగా ఫిల్మ్ సిటీలో ఏం జరిగినా అంత సులభంగా బయటకు పొక్కదు. రామోజీరావు అంగీకరిస్తే తప్ప ఫిల్మ్ సిటీ అనే కోటలోకి తమకు కూడా ఎంట్రీ ఉండదని పోలీసు వర్గాలే చెబుతుంటాయి. కాగా ఈ క్రమంలో తమతో పాటు అవసరమైతే ప్రభుత్వం పైనా ఒత్తిడి తీసుకువచ్చి విషయం బయట పడకుండా మేనేజ్ చేస్తారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి ఉదంతాలు కొన్ని గతంలో చోటు చేసుకున్నాయి. అయితే గురువారం చోటు చేసుకున్న ప్రమాదంలో కన్నుమూసింది తమ ఉద్యోగి కాకపోవడం, బయటి వాడైన ప్రవాస భారతీయుడు కావడంతో విషయం వెలుగులోకి వచ్చిందని అంటున్నారు.

అప్పట్లో 22 మంది ఉద్యోగులు గాయపడినా..

రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రమాదాలు చోటు చేసుకోవడం కొత్తేంకాదు. చిన్న చిన్న ఉదంతాలు, తన ఉద్యోగులకు పరిమితమైన, ఒకరిద్దరికి సంబంధించిన అంశాలు ఆ కోట దాటి బయటకు రావు.. రానివ్వరు. కానీ 2008 నవంబర్‌లో చోటు చేసుకున్న ఓ భారీ అగ్నిప్రమాదం.. వారం తర్వాత 'సాక్షి' చొరవతో వెలుగులోకి వచ్చింది. ఓ అంతర్జాతీయ సంస్థకు చెందిన వార్షిక సమావేశానికి దాని నిర్వాహకులు రామోజీ ఫిల్మ్ సిటీని ఎంపిక చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఒప్పందాలు పూర్తయిన తర్వాత వేదిక కూడా ఖరారైంది. ఆ ఏడాది నవంబర్ 2న దాదాపు



గతంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన సూపర్‌వైజర్ శ్రీనివాసరావు(ఫైల్)

3,500 మంది హాజరైన ఆ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఫిల్మ్ సిటీకి చెందిన సిబ్బంది ప్రధాన వేదికను సిద్ధం చేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఎగరేయడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా స్టేజీ సమీపంలో దాదాపు 200 హైడ్రోజన్ బెలూన్లను ఉంచారు. ఈ కార్యక్రమం నిర్వహణను అప్పట్లో ఫైర్ సూపర్‌వైజర్‌గా ఉన్న శ్రీనివాసరావు, ఫైర్ మెన్ లక్ష్మణ్‌లు పర్యవేక్షించారు. అయితే ఈ ఉత్సవాలకు హాజరైన ఓ ప్రతినిధి హైడ్రోజన్ బెలూన్ల సమీపంలో సిగరెట్ కాల్చే ప్రయత్నం చేసినా ఫిల్మ్ సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఫైర్ సూపర్‌వైజర్, ఫైర్ మెన్ మాత్రం వారించే ప్రయత్నం చేశారు. ఈలోపే ఆ ప్రతినిధి విసిరేసిన సిగరెట్ పీక సమీపంలో ఉన్న హైడ్రోజన్ బెలూన్లపై పడటం, అవి ఒక్కసారిగా పేలిపోయి మంటలు వ్యాపించడం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో అక్కడ పని చేస్తున్న దాదాపు 22 మంది ఫిల్మ్ సిటీ ఉద్యోగులకు గాయాలయ్యాయి. వీరికి తన కోటలోనే ఉన్న ఆస్పత్రిలో గుట్టుచప్పుడు కాకుండా వైద్యం చేయించిన రామోజీరావు.. పోలీసులు, అగ్నిమాప శాఖ అధికారుల వరకు విషయం చేరనీయలేదు. తన సంస్థ కోసం పని చేస్తూ గాయపడిన వారికి మొండిచేయి చూపారు. దాదాపు వారం తర్వాత ఈ విషయం నాటకీయంగా వెలుగులోకి రావడంతో హయత్‌నగర్ (అప్పట్లో అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా లేదు) పోలీసులు సీన్‌లోకి వచ్చారు. దీంతో విషయం లీక్ చేశారంటూ రామోజీ సైన్యం రాద్ధాంతం చేసింది. చివరకు నామమాత్రంగా సిబ్బందికి సహాయం చేసింది.

ఆ టాలెంట్ రామోజీ రావుకే సొంతం

ఫిల్మ్ సిటీలో జరిగిన ప్రమాదాలను బాహ్య ప్రపంచానికి తెలియకుండా దాచి ఉంచే రామోజీ రావులో మరో టాలెంట్ కూడా ఉంది. తన సంస్థల్లో చోటు చేసుకునే ఉదంతాలు పోలీసు రికార్డులకు ఎక్కకుండా చూడటమే కాదు.. తప్పంతా క్షతగాత్రులు లేదా బాధితులదే అన్నట్లుగా కూడా చూపించగలరు. బాధితులే ఆ విధంగా చెప్పేలా చేయగల నైపుణ్యం రామోజీరావు సొంతం. 2009లో బాలానగర్‌లోని ఈనాడు ప్రింటింగ్ ప్రెస్‌లో జరిగిన ప్రమాదమే దీనికి ఉదాహరణ. ఈ ఉదంతాన్ని చాలా రోజులు గోప్యంగా ఉంచిన యాజమాన్యం ఎట్టకేలకు పోలీసులకు తెలిపినా.. ఫిర్యాదు లేకుండా చూసుకుంది. సీన్ కట్ చేస్తే తప్పు తనదే అంటూ చెప్పిన ఆ బాధితుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం కొసమెరుపు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బిజయ్‌కుమార్ నిరుపేద. బతుకుతెరువు కోసం నగరానికి వలసవచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా మారాడు. 2009 మే 19న బాలానగర్‌లోని ఈనాడు ప్రింటింగ్ ప్రెస్‌లో పనికి వచ్చాడు. అక్కడి మూడో అంతస్తులో పని చేస్తూ మధ్యాహ్నం వేళ కింద పడ్డాడు. ఇది గమనించిన సెక్యూరిటీ సిబ్బంది విషయం రామోజీ కోటరీకి తెలిపారు. వాళ్ళ ఆదేశాల మేరకు విషయం బయటకు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో బిజయ్‌ను ఈనాడు ప్రింటింగ్ ప్రెస్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా బయటకు తరలించాలని ప్రయత్నించారు. అక్కడ పండ్ల వ్యాపారం చేసే సయ్యద్ ముస్తఫా ఈ వ్యవహారం గమనించి అడ్డుకుని ప్రశ్నించారు. క్షతగాత్రుడికి తక్షణ వైద్యం అందాలనే ఉద్దేశంతో '108'కు సమాచారం ఇచ్చారు. ఈ పరిణామంతో కంగుతిన్న సెక్యూరిటీ సిబ్బంది ఆయనపై దాడి చేసి తమపైనే దాడి జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు ముస్తాఫా ద్వారా ఈ ప్రమాదం విషయం వెలుగులోకి రావడంతో బాలానగర్ పోలీసులు జోక్యం చేసుకున్నారు. దీంతో హడావుడిగా బిజయ్‌కుమార్ వద్దకు వెళ్ళిన ఈనాడు సిబ్బంది కథ మార్చేశారు. అదే రోజు అతడిని తీసుకుని బాలానగర్ ఠాణాకు వచ్చారు. తన తప్పిదం వల్లే ఈనాడు కార్యాలయం పైనుంచి కింద పడ్డానని, దీనిపై కేసు వద్దని అతడితోనే రాయించి పంపారు. ఫిర్యాదు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని అప్పట్లో పోలీసులు ప్రకటించారు.

విస్టెక్స్ ఉదంతంలోనూ అనేక ప్రయత్నాలు

విస్టెక్స్ ఏషియా సీఈఓ సంజయ్ షా మరణానికి కారణమైన రామోజీ ఫిల్మ్ సిటీపై ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కలిదిండి జానకిరామ్ రాజు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇందులో ఫిల్మ్ సిటీలోని భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం, రెస్క్యూ ఆపరేషన్స్‌లో ఉన్న వైఫల్యాలను ఎత్తిచూపారు. అయితే విస్టెక్స్ ఉదంతంలోనూ రామోజీ తన మార్క్‌ను చూపించారు. దుర్ఘటన జరిగినప్పుడు అక్కడ ఉన్న ఆర్ఎఫ్‌సీ ఉద్యోగుల ఫోన్లన్నీ స్వాధీనం చేసుకోవాలని, విషయం బయటకు పొక్కనివ్వొద్దని హెచ్చరించారు. పోలీసులకిచ్చిన ఫిర్యాదులోని అంశాలు రికార్డుల్లోకి ఎక్కకుండా ఉంచేందుకు ఆఖరి నిమిషం వరకు ప్రయత్నించారు. జరిగిన ఉదంతంపై కేసు నమోదు చేసుకోవాలని, కానీ భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం, అంబులెన్స్ రాక ఆలస్యం కావడం, అదనపు అంబులెన్స్ లేకపోవడం వంటివి ప్రాథమిక సమాచార నివేదికలో (ఎఫ్ఐఆర్) నమోదు కాకుండా చూడాలని అనేక ప్రయత్నాలు చేశారు. అవి రికార్డుల్లోకి ఎక్కి, బయటకు వస్తే ఫిల్మ్ సిటీ వ్యాపారం దెబ్బతింటుదంటూ తమ మందీమార్బలంతో పోలీసులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. కానీ పోలీసులు ససేమిరా అన్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలియజేయడమే కాకుండా ఫిర్యాదులోని ప్రతి అంశాన్నీ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు.



ఘనంగా ఐపీఈ స్నాతకోత్సవం

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన బిజినెస్ స్కూల్‌లో ఒకటైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ) స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ స్నాతకోత్సవంలో భాగంగా ఈ విద్యాసంస్థ నుంచి 2023లో చదువుకున్న 435 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా 372 మంది విద్యార్థులు డిగ్రీపట్టాను అందుకున్నారు. రిజర్వ్‌బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఏపీ మాజీ సీఎస్ కాకి మాధవరావు, ఐపీఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ప్రెసిడెంట్ మహాపార అలీ, ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసమూర్తి విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 2023 ఏడాదికిగాను పీజీడీఎంలో అద్దూరి ఆదిత్య టాపర్‌గా నిలిచి ఉజ్జ్వల్‌ముద్దాన మెమోరియల్ గోల్డ్ మెడల్ సాధించారు.

బీఆర్ఎస్ నేతలనే ప్రజలు రాళ్లతో కొడతారు

- టీపీసీసీ నేత బండి సుధాకర్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆరునెలల్లో తిరగబడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడటం ఆయన అహంకారానికి, అధికార దాహానికి నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉండి కూడా ప్రజలను పట్టించుకోకుండా, చిత్తుగా ఓడిపోయిన బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయేసరికి మతిభ్రమించినట్లు మాట్లాడుతున్నారని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.17 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేస్తే, రాబందుల్లా రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ నేతలనే ప్రజలు రాళ్లతో కొట్టే రోజులు వస్తాయని పేర్కొన్నారు. ప్రజలు ఎవరిపై తిరగబడతారో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనే తేలిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మదర్సా విద్యార్థుల ఘర్షణ: ఒకరి మృతి

- హైదరాబాద్ శివారులోని నార్సింగిలో ఘటన



రకీమ్

మణికొండ: బిహార్ నుంచి వచ్చి మదర్సాలో ఉంటున్న ఇద్ద రు విద్యార్థుల మధ్య చెలరేగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... పుప్పాలగూడ తిరుమలహిల్స్ కాలనీ పక్కనే ఉన్న ఓ భవనంలో గుట్టుచప్పుడు కాకుండా మదర్సా నిర్వహిస్తున్నారు. అందులో 8 మంది బిహార్‌కు చెందిన విద్యార్థులే ఉంటున్నారు. వారిలో మహ్మద్ రకీమ్ (17), మహ్మద్ ఫిరాజ్‌ల మధ్య గురువారంరాత్రి ఘర్షణ జరిగింది. తీవ్రంగా కొట్టుకున్న ఈ ఘటనలో రకీమ్ అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అతడిని వెంటనే మదర్సా నిర్వాహకులు గోల్కొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మదర్సా నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామోజీ .. నీ నీచపు రాతలు చూస్తే జాలేస్తోంది

- ఆయన కులపోడు సీఎంగా లేడనే విషం కక్కుతున్న రామోజీ
- అంబేడ్కర్ విగ్రహావిష్కరణని చూసి ఓర్వలేకపోతున్న ఎల్లో మీడియా
- ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ప్రపంచంలోనే అతి పెద్ద డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తుంటే ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా అధిపతులు ఓర్వలేకపోతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వేడుకపై విషం చిమ్ముతూ శుక్రవారం ఈనాడు పత్రిక కథనం ప్రచురించడంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నాగా ర్జున, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద ఈనాడు పేపర్‌ను చించివేసి, పత్రిక ప్రతులను కాల్చివేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ.. దళితుల భూములను ఆక్రమించి ఫిల్మ్ సిటీ కట్టుకున్న నీచుడు రామోజీరావని ధ్వజమెత్తారు. దుర్మార్గుడైన రామోజీరావు దళిత బంధువైన సీఎం వైఎస్ జగన్‌పై విషం చిమ్మటం గర్హనీయమన్నారు. రామోజీరావు ఈనాడు పేపర్‌ను చంద్రబాబుకు తాకట్టుపెట్టి, పత్రిక విలువలు మంటగలిపారన్నారు. ఆయన కులపోడు సీఎంగా లేడన్న కారణంతోనే రాష్ట్రంపై రామోజీ విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. రామో'ఛీ'.. నీ నీచపు రాతలపై జాలేస్తోందని వ్యాఖ్యానించారు. సీఎం వైఎస్ జగన్‌పై ఈనాడులో రాసిన చెత్త రాతలపై రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రన్నారు. రామోజీ వయసుకు తగినట్టు నడుచుకోవాలని హితవు పలికారు. అంబేడ్కర్ విగ్రహం స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేస్తున్నారని తెలిసినప్పటి నుంచే పచ్చ మీడియా ఏడుపే ఏడుపు అని అన్నారు. పచ్చ మీడియాతో ఇలా చేయించటం చంద్రబాబుకు మొదటి నుంచీ ఉన్న రోగమేనన్నారు. సీఎం జగన్ దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ లక్షలాది పేద, దళిత, గిరిజన, అణగారిన వర్గాల ఇంటి పండుగని అన్నారు. స్వాతంత్ర్య చరిత్ర ఉన్న స్వరాజ్ మైదానంలో విగ్రహం ఏర్పాటు చారిత్రాత్మకమన్నారు. దశాబ్దాలుగా దళితులను అణచివేసిన చంద్రబాబుకు రామోజీ ఒక బ్రోకర్ అని విమర్శించారు. చంద్రబాబుకు ఇక అధికారం రాదనే అక్కసుతోనే సీఎం జగన్ పై అడుగడుగునా విషం కక్కుతున్నారని చెప్పారు. ప్రజలు ఈనాడును కొనడం కాదుకదా కనీసం చదివే పరిస్థితులు కూడా రాష్ట్రంలో లేవన్నారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. దళితులకు మేలు చేయటం అంటే రామోజీ, చంద్రబాబు, రాధాకృష్ణలకు నచ్చదని చెప్పారు. కాటికి కాలుచాచిన వయసులో కూడా రామోజీ విషం కక్కటం మానలేదని వ్యాఖ్యానించారు. దళితులు వారి ఇళ్లలో పాచి పనులు చేయటానికే బతకాలనేది రామోజీ, చంద్రబాబుల నైజమన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రూపొందించిన అంబేడ్కర్ శిల్పం నుండి జీవ కళ ఉట్టిపడుతోందని తెలిపారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించేవారిలో దేశంలోనే ముందుండే సీఎం జగన్ అని చెప్పారు.

బాలరాముడి తొలి దర్శనం

సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన రామ్‌లల్లా విగ్రహం చిత్రాలు

- గర్భగుడిలోకి చేర్చకముందు చిత్రీకరణ
- ఆలయంలో వేదికపై ప్రతిష్టించిన విగ్రహం ఫొటోను విడుదల చేసిన వీహెచ్‌పీ
- మరో రెండు రోజుల్లో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట.. ఏర్పాట్లు దాదాపు పూర్తి



శుక్రవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో అయోధ్య రామాలయం. (ఇన్‌సెట్లో) శుక్రవారం వీహెచ్‌పీ విడుదల చేసిన రామ్‌లల్లా విగ్రహం ఫొటో

అయోధ్య/న్యూఢిల్లీ: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్టకు ఇక రెండు రోజులే మిగిలి ఉంది. ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. గర్భగుడిలో శ్రీరాముడి దర్శనం కోసం భక్తులు ఎదురు చూస్తున్నారు. అయితే, ప్రాణప్రతిష్ట కంటే ముందే రామ్‌లల్లా విగ్రహం చిత్రాలు బయటకు వచ్చాయి. గర్భగుడిలోకి చేర్చకముందు వీటిని చిత్రీకరించినట్లు తెలుస్తోంది. బాలరాముడి చేతిలో బాణం, విల్లు కనిపిస్తున్నాయి. ఈ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నల్లరాయితో రూపొందించిన ఐదు సంవత్సరాల రాముడి విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ విధంగా రామ్‌లల్లా విగ్రహ తొలి దర్శనం ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో ప్రజలకు లభించింది. ఇక గర్భగుడిలో ప్రధాన వేదికపై ప్రతిష్టించిన తర్వాత కళ్లకు గంతలు కట్టి ఉన్న రామ్‌లల్లా విగ్రహం ఫొటోను విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విడుదల చేసింది. ప్రాణప్రతిష్ట పూర్తవకపోవడంతో విగ్రహం కళ్ల చుట్టూ పసుపు రంగు వస్త్రం చుట్టారు. రామ్‌లల్లాను గులాబీల దండతో అలంకరించారు. ప్రాణప్రతిష్ట ముగిశాక ఈ నెల 23 నుంచి సామాన్య భక్తులు గర్భాలయంలో రాముడిని దర్శించుకోవచ్చు.

ఏర్పాట్లపై సీఎం యోగి సమీక్ష

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలోని హనుమాన్ గార్హీ ఆలయంలో పూజలు చేశారు. అలాగే భవ్య రామ మందిరాన్ని దర్శించుకున్నారు. ప్రాణప్రతిష్ట వేడుక కోసం జరుగుతున్న ఏర్పాట్లు సమీక్షించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత సరయూ నదిలో సోలార్ బోటును ప్రారంభించారు. 1,008 కుండియా హనుమాన్ మహాయజ్ఞంలో పాల్గొన్నారు.

కాలర్ ట్యూన్స్‌గా రాముని పాటలు

రామాలయ ప్రాణప్రతిష్ట సందర్భంగా అయోధ్యలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. వీధుల్లో రాముడి పాటలు మార్మోగుతున్నాయి. ప్రజలు పరస్పరం పలుకరింపుల్లోనూ రామనామం ప్రస్తావిస్తున్నారు. అయోధ్య పౌరులు తమ ఫోన్లలో రాముడి పాటలనే కాలర్ ట్యూన్స్, రింగ్ టోన్స్‌గా మార్చుకుంటున్నారు. ఎవరికైనా ఫోన్ చేస్తే 'యుగ్ రామ్ రాజ్ కా', 'రామ్ ఆయే హై అయోధ్య మే', 'హరి అనంత్ హరి కథ' వంటి పాటలు వినిపిస్తున్నాయి.

మధ్యప్రదేశ్ నుంచి 5 లక్షల లడ్డూలు

అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం కోసం మధ్యప్రదేశ్ భక్తులు 5 లక్షల లడ్డూలు పంపించారు. ఈ లడ్డూలతో ఐదు వాహనాలు శుక్రవారం భోపాల్ నుంచి అయోధ్యకు బయలుదేరాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ వాహనాలకు పచ్చజెండా ఊపారు. 5 లక్షల లడ్డూలు ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయంలో తయారు చేశారు.

ఉత్తరప్రదేశ్ జైళ్లలో ప్రత్యక్ష ప్రసారం

రామమందిర ప్రారంభోత్సవం కోసం అన్ని వర్గాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని టీవీల్లో ప్రత్యక్షంగా వీక్షించాలని నిర్ణయించుకున్నారు. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సైతం ఈ అవకాశం కల్పించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాణప్రతిష్ట వేడుక ప్రత్యక్ష ప్రసారం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్లలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారక్‌లలో టీవీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

పలు రాష్ట్రాల్లో సోమవారం సెలవు

రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. రాష్ట్రమంతటా కార్యాలయాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలకు సెలవు అమలు చేస్తున్నట్లు తెలియజేసింది. మధ్యప్రదేశ్‌లోనూ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. తమ విద్యాసంస్థలకు 22న హాఫ్ డే సెలవు ఇస్తున్నట్లు జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ ప్రకటించింది.

అంబానీ నుంచి బచ్చన్ దాకా..

బాలరాముడి ప్రాణప్రతిష్టకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా అత్యంత ప్రముఖులు హాజరుకాబోతున్నారు. బిలియనీర్ ముకేష్ అంబానీ నుంచి బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ దాకా చాలామంది ప్రముఖులకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఆహ్వానం పంపించింది. ఆహ్వానితుల జాబితాలో దాదాపు 7,000 మందికి చోటు దక్కింది. ప్రముఖ రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, సినీ నటులు, క్రీడాకారులు, అధికారులు, దౌత్యవేత్తలకు ఆహ్వానాలు అందాయి. ముకేష్ అంబానీ, అమితాబ్ బచ్చన్ తమ కుటుంబ సభ్యులతో సహా హాజరుకాబోతున్నారు. సినీ ప్రముఖులు అజయ్ దేవగణ్, అక్షయ్ కుమార్, చిరంజీవి, రామ్‌చరణ్, అల్లు అర్జున్, మోహన్‌లాల్, అలియా భట్, సరోద్ కళాకారుడు అంజాద్ అలీ, దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ తదితరులను ఆహ్వానించారు.

ఆ న్యాయమూర్తులకూ...

అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్టకు దేశవిదేశాల నుంచి ప్రముఖులు హాజరుకాబోతున్నారు. అయోధ్య వివాదంపై తుది తీర్పునిచ్చి, భవ్య మందిర నిర్మాణానికి మార్గం సుగమం చేసిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సభ్యులకు రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు ఆహ్వానం పంపించారు. సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, మాజీ సీజేఐలు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం అయోధ్య వివాదంపై 2019 నవంబర్ 9న చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రాణప్రతిష్టకు హాజరు కావాలని కోరుతూ రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదుగురు సభ్యులతోపాటు 50 మందికిపైగా ప్రఖ్యాత న్యాయమూర్తులు, న్యాయవాదులను సైతం ఆహ్వానించారు.

శిల్పికి 'తీపి బహుమతి'

రామ్‌లల్లా విగ్రహాన్ని చెక్కిన మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్‌కు తియ్యటి బహుమతి లభించింది. మైసూరులోని మహాలక్ష్మీ స్వీట్స్ దుకాణం యజమాన్యం ఆయనకు అయోధ్య రామమందిరం ప్రతిరూపంగా తయారు చేసిన మిఠాయిని బహూకరించింది. రకరకాల స్వీట్లతో ఈ బహుమతిని తయారు చేశారు.




అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం, రామ్ లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కర్ణాటకలో హనుమాన్ జన్మస్థలంగా భావించే కిష్కింద నుంచి శుక్రవారం అయోధ్యకు చేరుకున్న హనుమ రథం

22న ఒడిశా రామాలయ ప్రాణప్రతిష్ట



అయోధ్యలో నిర్మించిన భవ్య రామమందిరంలో ఈ నెల 22న రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట జరుగనుంది. అదే రోజు మరో రామాలయ ప్రాణప్రతిష్ట సైతం జరగబోతోంది. ఒడిశాలో నయాగఢ్ జిల్లా ఫతేగఢ్ గ్రామంలో సర్వాంగ సుందరంగా నిర్మించిన గుడిలో శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించబోతున్నారు. ఇందు కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. సముద్ర మట్టానికి 1,800 అడుగుల ఎగువన ఓ కొండపై 2017లో ఈ ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. ఆలయం ఎత్తు 165 అడుగులు. 150 మందికిపైగా కార్మికులు ఏడేళ్లలో నిర్మాణం పూర్తిచేశారు. కళింగ శైలిలో ఆలయం రూపుదిద్దుకుంది. ఈ ప్రాంతానికి చరిత్రాత్మక ప్రాధాన్యం ఉంది. శ్రీకృష్ణుడు ఈ కొండపై తపస్సు చేశాడని చెబుతుంటారు.

ఎస్సీ వర్గీకరణపై కేంద్రం కమిటీ

- కేబినెట్ కార్యదర్శి గౌబా అధ్యక్షతన అయిదుగురితో కమిటీ
- 23న తొలి సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. శుక్రవారం కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో అయిదు మంత్రిత్వ శాఖలకు చెందిన కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. హోం, న్యాయ, గిరిజన సంక్షేమ, సామాజిక న్యాయం, సిబ్బంది, శిక్షణ శాఖల కార్యదర్శులకు ఇందులో చోటు కల్పించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి తీసుకోవాల్సిన పాలనాపరమైన చర్యలను పరిశీలించి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు, వీలైనంత త్వరగా తమ నివేదికను అందించేందుకు వీలుగా ఈ కమిటీ ఈనెల 23న తొలిసారి భేటీ కానుంది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగిన ఎస్సీ ఉపకులాల విశ్వరూప మహాసభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనడం తెలిసిందే. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు త్వరలో కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీ ఏర్పాటు చేయాలని గత నవంబర్ 24న ఆదేశించారు. గౌబా కమిటీ ఏర్పాటుకు తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం

కోవింద్ కమిటీని రద్దు చేయాలి: ఖర్గే

న్యూఢిల్లీ: దేశంలో జమిలి ఎన్నికల యోచనను కాంగ్రెస్ గట్టిగా వ్యతిరేకించింది. ఈ విధానం సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణానికి విరుద్ధమని పేర్కొంది. ఒకే దేశం–ఒకే ఎన్నికల ఆలోచనను పూర్తిగా పక్కనబెట్టాలని, దీనిపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో ఏర్పాటైన కమిటీని రద్దు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. కమిటీ కార్యదర్శి నితేన్ చంద్రకు ఈ మేరకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. ఒకే విడతలో ఎన్నికల కోసం సగం పదవీ కాలం కూడా పూర్తవని అసెంబ్లీలను రద్దు చేస్తే ఓటర్ల హక్కులను కాలరాయడమేనన్నారు.

బీజేపీది 'ఢిల్లీ' పాలన: రాహుల్


భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా శుక్రవారం అసోంలో హనుమాన్ మాస్క్‌తో రాహుల్

నార్త్ లఖీంపూర్ (అసోం): దేశాన్ని ఢిల్లీ నుంచి మాత్రమే కేంద్రీకృత విధానంలో పాలించాలన్న భావజాలం బీజేపీ, ఆరెస్సెస్‌ల నరనరాన నిండిపోయిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్‌కు మాత్రం అన్ని రాష్ట్రాలకు, అన్ని ప్రాంతాలకు సమప్రాధాన్యం లభించే స్థానిక స్వపరిపాలనే మూలమంత్రమని చెప్పారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా శుక్రవారం అసోంలోని గోగాముఖ్ వద్ద బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాలతో సమ ప్రాధాన్యముందని చాటేందుకే యాత్రను మణిపూర్ నుంచి మొదలు పెట్టానని చెప్పారు. ''దేశ చరిత్రలో తొలిసారిగా ఒక రాష్ట్రంలో అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొన్నా ప్రధాని మోదీకి అక్కడ పర్యటించే తీరిక లేదు'' అన్నారు.

పాలనలో రాముడే స్ఫూర్తి: మోదీ

22న ఇంటింటా రామజ్యోతి వెలగాలని పిలుపు

- మహారాష్ట్రలో 90 వేల 'పీఎం ఆవాస్' ఇళ్లు పంపిణీ
- బాల్యంలో తనకిలాంటి ఇల్లు లేకపోయిందంటూ భావోద్వేగం


శుక్రవారం షోలాపూర్‌లో పీఎం ఆవాస్ యోజన ఇంటిని పరిశీలిస్తున్న మోదీ

షోలాపూర్/: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శ్రీరాముని స్ఫూర్తితో నిజాయితీతో కూడిన పారదర్శక పాలన అందిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం అయోధ్యలో జరగనున్న రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠను చరిత్రాత్మక సందర్భంగా అభివర్ణించారు. ఆ రోజున దేశమంతటా ఇంటింటా రామజ్యోతిని వెలిగించాలని మరోసారి పిలుపునిచ్చారు. అది పేదరిక నిర్మూలనకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. ప్రధానిగా తాను మూడోసారి విజయం సాధించాక 'మోదీ హామీ'ల దన్నుతో భారత్‌ను ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. శుక్రవారం మహారాష్ట్రలోని షోలాపూర్‌లో రూ.2,000 కోట్ల విలువైన 8 అమృత్ ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రంలో నిర్మాణం పూర్తయిన 90 వేలకు పైగా ఇళ్లను లాంఛనంగా పేదలకు అందజేశారు. పీఎం స్వానిధి పథకం కింద 10 వేల మంది లబ్ధిదారులకు ఒకటో, రెండో వాయిదాల చెల్లింపుకు శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ''దేశమంతటా గొప్ప ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంది. నాసిక్‌లో గత వారం అనుష్ఠానం మొదలు పెట్టాను. మీ ఆశీస్సులతో అయోధ్య వెళ్తున్నా'' అని ప్రకటించారు. ఇళ్లు పొందిన లబ్ధిదారులను చూస్తుంటే తన హృదయం ఆనందంతో నిండిపోతోందంటూ భావోద్వేగానికి లోనయ్యారు. బాల్యంలో తనకిలాంటి ఇంట్లో ఉండే అవకాశం లేకపోయిందని చెమర్చిన కళ్లతో గుర్తు చేసుకున్నారు. ''ప్రజల కలలు నెరవేరినప్పుడే నిజమైన ఆనందం. వారి ఆశీస్సులే నాకు అతి పెద్ద పెట్టుబడి. గత ప్రభుత్వాల్లో పేదల సంక్షేమానికి కావాల్సిన నియత్ (ఉద్దేశం), నీతి (విధానం), నిష్ఠ (చిత్తశుద్ధి) లోపించాయి. పేదల సంక్షేమం, శ్రామికుల గౌరవం కోసం 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లు, 10 కోట్లకు పైగా టాయిలెట్లు నిర్మించాం'' అని చెప్పారు.

బోయింగ్ క్యాంపస్ ప్రారంభం

దొడ్డబళ్లాపురం/సాక్షి, చెన్నై: భారత్ శరవేగంగా సాధిస్తున్న ప్రగతిని అందిపుచ్చుకోవాల్సిందిగా అంతర్జాతీయ పెట్టుబడిదారులకు మోదీ పిలుపునిచ్చారు. పాతికేళ్లలో సంపన్న భారత నిర్మాణమే ప్రతి భారతీయుని లక్ష్యంగా మారిందన్నారు. ఆ దిశగా 25 కోట్ల భారతీయులను గత తొమ్మిదేళ్లలో పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చినట్టు చెప్పారు. వైమానిక రంగంలోనూ దేశం శరవేగంగా ప్రగతి సాధిస్తోందని హర్షం వెలిబుచ్చారు. బెంగళూరు శివార్లలో దేవనహళ్లి హైటెక్ డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్ క్యాంపస్‌లో రూ.1,600 కోట్లతో నిర్మించిన బోయింగ్ నూతన గ్లోబల్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కేంద్రాన్ని మోదీ ప్రారంభించారు. భారత సామర్థ్యంపై ప్రపంచం పెట్టుకున్న నమ్మకానికి ఈ క్యాంపస్ తాజా నిదర్శనమన్నారు. భారత్ గత కొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతి పెద్ద దేశీయ వైమానిక మార్కెట్‌గా ఎదిగిందని గుర్తు చేశారు. అనంతరం మూడు రోజుల తమిళనాడు పర్యటన నిమిత్తం మోదీ చెన్నై చేరుకున్నారు. అభిమానులు, బీజేపీ మద్దతుదారుల స్వాగతం నడుమ నెహ్రూ స్టేడియం దాకా 4 కిలోమీటర్ల మేర రోడ్ షో జరిపారు. అక్కడ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2023ను ప్రారంభించారు. 2029 యూత్ ఒలింపిక్స్, 2036 ఒలింపిక్స్ నిర్వహణకు వేదికగా భారత్‌ను తీర్చి దిద్దుతామని ప్రధాని ప్రకటించారు.

మహిళలే వృద్ధి సారథులు

భారత్‌లో ప్రతి రంగంలోనూ మహిళల సారథ్యానికి పెద్దపీట వేస్తున్నట్టు మోదీ చెప్పారు. వైమానిక రంగంలోనూ మహిళలకు నూతన అవకాశాలు కల్పించేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. ఇందుకుద్దేశించిన 'బోయింగ్ సుకన్య' పథకాన్ని ఈ సందర్భంగా మోదీ ప్రారంభించారు. భారత పైలట్లలో 15 శాతం మహిళలేనని మోదీ గుర్తు చేశారు. అంతర్జాతీయ సగటు కంటే ఇది మూడు రెట్లు ఎక్కువన్నారు. సుకన్య పథకం కింద సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) తదితరాల్లో విద్యాభ్యాసానికి అమ్మాయిలకు అవకాశం కల్పించి వైమానిక రంగ ఉద్యోగాలకు అర్హులుగా తీర్చిదిద్దుతామని బోయింగ్ ప్రకటించింది. పైలట్ శిక్షణకు మహిళలకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామని పేర్కొంది.

సిద్ధూ, అది సహజం!

'మోదీ.. మోదీ' నినాదాలపై ప్రధాని

బెంగళూరు బోయింగ్ క్యాంపస్ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని ప్రసంగిస్తుండగా సభికులంతా మోదీ, మోదీ అంటూ పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు. దాంతో ఆయన కాసేపు ప్రసంగాన్ని ఆపేసి వింటూ ఉండిపోయారు. వేదికపై కూర్చుని దీనంతటినీ తిలకిస్తున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య వైపు తిరిగి, ''ముఖ్యమంత్రీ జీ! ఐసా హోతా రహతా హై (అలా జరుగుతూంటుంది) అంటూ చమత్కరించారు. దాంతో సీఎంతో పాటు వేదికపై ఉన్న గవర్నర్ తదితరులు చిరునవ్వులు చిందించారు.

సుప్రీం జడ్జిగా కర్ణాటక సీజే

కేంద్రానికి కొలీజియం సిఫార్సు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి.వరాలే పేరును కొలీజియం సిఫార్సు చేసింది. ఆయన స్థానంలో జస్టిస్ పి.ఎస్.దినేశ్‌కుమార్‌ను కర్ణాటక హైకోర్టు సీజేగా నియమించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు కొలీజియం శుక్రవారం సమావేశమై ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకుంది. జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సి.టి.రవికుమార్ అనంతరం సుప్రీంకోర్టులో ఎస్సీ సామాజిక వర్గం నుంచి మూడో న్యాయమూర్తిగా జస్టిస్ వరాలే నిలవనున్నారు. ''జస్టిస్ ఎస్.కె.కౌల్ రిటైర్మెంట్‌తో గత డిసెంబర్ 25 నుంచి సుప్రీంకోర్టులో ఒక న్యాయమూర్తి స్థానం ఖాళీగా ఉంది. న్యాయమూర్తులపై పనిభారం ఎక్కువగా ఉన్నందున ఖాళీలుండరాదు. అందుకే జస్టిస్ వరాలే పేరును సిఫార్సు చేస్తున్నాం'' అని కొలీజియం పేర్కొంది.

56 మంది సుప్రీం న్యాయవాదులకు సీనియర్ హోదా

11 మంది మహిళలతో సహా 56 మంది న్యాయవాదులను సీనియర్ న్యాయవాదులుగా సుప్రీంకోర్టు నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. వీరిలో తెలుగు న్యాయవాది శ్రీధర్ పోతరాజు కూడా ఉన్నారు.

'బిల్కిస్' దోషుల పిటిషన్లు కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో దోషులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. లొంగిపోయేందుకు మరింత గడువు కోరుతూ వారు వేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇందుకు వారు చూపుతున్న కారణాలు సరైనవి కాదని పేర్కొంది. 2002లో గుజరాత్ మత కలహాల సమయంలో బిల్కిస్ బానో అనే మహిళపై గ్యాంగ్ రేప్, ఆమె కుటుంబంలోని ఏడుగురి హత్యకు సంబంధించిన కేసులో 11 మంది దోషులను క్షమాభిక్ష కింద విడుదల చేయడంపై స్టే విధించిన సుప్రీంకోర్టు జనవరి 21వ తేదీలోగా లొంగిపోవాలని వారిని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, అయిదుగురు దోషులు వివిధ వ్యక్తిగత కారణాలు చూపుతూ లొంగిపోయేందుకు మరింత సమయం కావాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వారు చూపుతున్న కారణాలు సరైనవి కావని పేర్కొంటూ పిటిషన్లను కొట్టివేసింది. వెంటనే లొంగిపోవాలని వారిని ఆదేశించింది.

డేరా చీఫ్‌కు 50 రోజుల పెరోల్

చండీగఢ్: అత్యాచారం కేసులో దోషిగా ఉన్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు కోర్టు 50 రోజుల పెరోల్ మంజూరు చేసింది. ఆయన ప్రస్తుతం హరియాణాలోని సునారియా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. 2022లో మూడు విడతల్లో దాదాపు మూడు నెలలు, 2023లో రెండు విడతల్లో కలిపి 70 రోజుల పెరోల్‌ను కోర్టు ఆయనకు మంజూరు చేసింది. ఆ సమయంలో యూపీలోని బర్నావాలో ఉన్న ఆశ్రమంలో గడిపారు. ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారానికి పాల్పడిన కేసులో డేరా బాబా ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్నారు. పలు హత్య కేసుల్లోనూ ఆయన నిందితుడిగా ఉన్నారు.

లాలూ, తేజస్వీలకు ఈడీ మళ్లీ సమన్లు

పట్నా: రైల్వే శాఖలో భూములకు బదులు ఉద్యోగాల కుంభకోణం కేసులో హాజరు కావాలంటూ ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్, కుమారుడు తేజస్వీ యాదవ్‌లకు ఈడీ మరోసారి సమన్లు పంపింది. లాలూను ఈ నెల 29వ తేదీన, తేజస్విని 30వ తేదీన పట్నాలోని తమ కార్యాలయంలో జరిగే విచారణకు రావాలంటూ అందులో కోరింది. నోటీసులు అందజేసేందుకు ఈడీ అధికారులు శుక్రవారం లాలూ భార్య, బిహార్ మాజీ సీఎం రబ్రీదేవి నివాసానికి వెళ్లినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత సమన్లకు లాలూ, తేజస్వీ స్పందించలేదు. యూపీఏ–1 ప్రభుత్వ హయాంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ఎస్పీ, ఆర్ఎల్‌డీ ఉమ్మడి పోరు

లక్నో: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో కలిసి పోటీ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), రాష్ట్రీయ లోక్ దళ్(ఆర్ఎల్‌డీ) నిర్ణయించుకున్నాయి. యూపీలో తమ పార్టీకి ఏడు సీట్లు కేటాయించేందుకు ఎస్పీ అంగీకరించిందని ఆర్ఎల్‌డీ ప్రకటించింది. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరి సోషల్ మీడియా వేదికగా ఈ విషయం వెల్లడించారు. యూపీలో ఉన్న 80 లోక్‌సభ స్థానాల్లో ఆర్ఎల్‌డీ పోటీ చేయనున్న సీట్లేమిటనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసే పోటీ చేయగా ఎస్పీకి 111 సీట్లు, ఆర్ఎల్‌డీకి 8 సీట్లు దక్కాయి.

గణతంత్ర వేడుకల్లో మహిళా శక్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో నారీసేన సత్తా చాటనుంది. జనవరి 26న మూడు మహిళా కంటింజెంట్లు కవాతులో పాల్గొననున్నాయి. నారీ శక్తి థీంలో భాగంగా మొట్టమొదటిసారి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌కు చెందిన మహిళా వైద్యులు, నర్సుల బృందం కవాతు చేయనుంది. 144 మందితో కూడిన త్రివిధ దళాల బృందం కూడా పరేడ్‌లో పాల్గొననుంది. దీనిలో 60 మంది సైనికులు కాగా మిగిలిన వారు ఎయిర్‌ఫోర్స్, నేవీలకు చెందిన వారు. మునుపెన్నడూ లేనివిధంగా ఢిల్లీ మహిళా పోలీసులు సైతం ఈసారి కవాతులో భాగస్వాములు కానున్నారు. ఇందుకోసం మహిళా పోలీసులు ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. గత ఏడాది జరిగిన వేడుకల్లో మహిళల కవాతు దేశ ప్రజల్ని విశేషంగా ఆకట్టుకుంది. గత ఏడాది 144 మంది సీఆర్పీఎఫ్, 144 ఎయిర్ వారియర్ కంటింజెంట్‌లు పాల్గొన్నాయి.

కాగితపు జెండాలను రోడ్లపై పడేయొద్దు

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయుల ఆకాంక్షలకు స్ఫూర్తి అయిన త్రివర్ణ పతాకాన్ని గౌరవించుకోవడం అందరి బాధ్యత అని, జాతీయ జెండాకు గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం రోడ్లపై కాగితపు జెండాలను పడేయొద్దని ప్రజలకు సూచించింది. కార్యక్రమాలు ముగిసిన వెంటనే కాగితపు జెండాలను జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలని సూచించింది.

అణు డ్రోన్‌ను పరీక్షించిన ఉత్తరకొరియా

సియోల్: ఉత్తరకొరియా అణ్వాయుధాల సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. తాజాగా పశ్చిమ సముద్ర జలాల్లో అణు దాడి చేసే సామర్థ్యమున్న డ్రోన్‌ను పరీక్షించినట్లు శుక్రవారం ప్రకటించింది. పోర్టులు, యుద్ధ నౌకలను ధ్వంసం చేసే సామర్థ్యం ఈ డ్రోన్‌కు ఉందని తెలిపింది. దక్షిణ కొరియా, అమెరికా, జపాన్‌లు కలిసి ఈ వారంలో జెజు దీవికి సమీపంలో చేపట్టిన భారీ సైనిక విన్యాసాలకు స్పందనగానే తామీ పరీక్ష జరిపినట్లు చెప్పుకుంది. గత ఏడాది మొదటిసారిగా ఈ డ్రోన్‌ను పరీక్షించినట్లు తెలిపింది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెంచుతూ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తే తీవ్ర పర్యవసానాలుంటాయని హెచ్చరించింది.

థాయ్ రాచరికంపై విమర్శలు.. 50 ఏళ్ల జైలు

బ్యాంకాక్: దేశంలోని రాచరిక వ్యవస్థను అగౌరవపరిచిన ఓ వ్యక్తికి థాయ్‌ల్యాండ్ కోర్టు రికార్డు స్థాయిలో 50 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కఠిన చట్టాలు అమల్లో ఉన్న థాయ్‌ల్యాండ్‌లో ఇంతటి భారీ శిక్షను విధించడం ఇదే మొదటిసారని హక్కుల సంఘాలు అంటున్నాయి. చియాంగ్ రాయ్ ప్రావిన్స్‌కు చెందిన మొంగ్‌కోల్ తిరఖోట్(30) ఆన్‌లైన్‌లో వస్త్ర వ్యాపారం చేస్తుంటాడు. రాజకీయ హక్కుల కార్యకర్త కూడా. రాజు ప్రతిష్టకు భంగం కలిగేలా ఆన్‌లైన్‌లో పోస్టులు పెట్టారంటూ 2023లో కోర్టు ఈయనకు 28 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మరో 12కు పైగా చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలడంతో గురువారం ఆయనకు మరో 22 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ప్రపంచంలోనే అత్యంత కఠిన రాజరిక చట్టాలు థాయ్‌ల్యాండ్‌లో అమలవుతున్నాయి. రాజు, రాణి, వారసులను విమర్శిస్తే 15 ఏళ్ల జైలు శిక్ష ఖాయం.

చంద్రుడిపై దిగిన జపాన్ అంతరిక్ష నౌక

టోక్యో: తమ మానవరహిత అంతరిక్ష నౌక చంద్రమండలంపై దిగిందని జపాన్ అంతరిక్ష సంస్థ తెలిపింది. అయితే, దాని పరిస్థితి ఏమిటనే విషయంలో స్పష్టత రావాల్సి ఉందని వెల్లడించింది. స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్(స్లిమ్) చంద్రుడి ఉపరితలంపై ఉదయం 12.20 గంటల సమయంలో దిగిందని పేర్కొంది. తాజా విజయంతో చంద్రుడిపైకి విజయవంతంగా అంతరిక్ష నౌకను పంపిన ఐదో దేశంగా జపాన్ అవతరించింది.









ఎన్నెన్ని విన్యాసాలో



సాక్షి
హైదరాబాద్
శనివారం । 20 । జనవరి । 2024

వింగ్స్ షో
ఎగిరే అదిరే



అందరి బాటా.. బోయింగ్, ఎయిర్‌బస్‌ల వైపే











విజ్ఞానం పంచుతోంది..



ఏవియేషన్ రంగంలో విజ్ఞానం పంచేలా ఎగ్జిబిషన్ ఉంది. ఎన్నో రకాల కంపెనీలు, వాటి ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకునేలా ఉన్నాయి. నేను ఏవియేషన్ షోకు రావడం ఇదే మొదటిసారి. వైమానిక విన్యాసాలు ఎంతగానో బాగున్నాయి. ఇలాంటి షోలు హైదరాబాద్‌లో నిర్వహించడం ఆనందంగా ఉంది.– స్నేహ, బోయిన్‌పల్లి

వైద్యం అందిస్తాం..



వరదలు, తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎయిర్ అంబులెన్స్ విమానాన్ని తీసుకువెళ్లి బాధితులకు వైద్య సహాయం అందిస్తాం. ఇప్పటివరకు ఎందరికో సేవలు అందించాం. దీనిపై వ్యాపారవేత్తలకు, సామాన్యులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇక్కడ ప్రదర్శనకు వచ్చాం.
– బల్కాసింగ్, ఎయిర్ అంబులెన్స్ ప్రతినిధి

ఆనందంగా ఉంది



ఎయిర్‌హోస్టెస్‌గా సేవలు అందించడం ఆనందంగా ఉంది. ఎన్నో రాష్ట్రాలు, దేశాల ప్రతినిధులను సాదరంగా ఆహ్వానిస్తూ వారికి సేవలు అందించే భాగ్యం దొరకడం సంతోషకరం. ఎయిర్‌హోస్టెస్ సేవలు మరపురాని అనుభూతులను అందించాయి. – గంగమ్మ, ఎయిర్‌హోస్టెస్

సనత్‌నగర్: వింగ్స్ ఇండియా–2024 రెండో రోజూ విమాన విన్యాసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఊపిరి బిగపెట్టుకుని కళ్లార్పకుండా విన్యాసాలు వీక్షించారు. పొగలు కక్కుకుంటూ ఆకాశంలోకి దూసుకుపోతున్నట్లుగా అనిపించేంతలో.. అమాంతం కిందపడుతుందేమోనని భయంతో చూసేవారికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. అంతలోనే మళ్లీ వేరే డైరెక్షన్‌లో విమానం దూసుకుపోవడం.. దాని వ్యతిరేక దిశలో మరో విమానం దూసుకువచ్చి రెండూ క్రాష్ అయిపోయి కిందపడుతున్నాయమోనని ఒళ్లు గగుర్పాటుకు గురిచేసే విన్యాసాలు సాగాయి. మరోవైపు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు ఎగ్జిబిషన్‌లో తమ ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రదర్శించారు.

సందర్శకుల ఆసక్తి..

ఏవియేషన్ షోకే ప్రత్యేక హైలైట్‌గా నిలుస్తోన్న బోయింగ్, ఎయిర్‌బస్‌ను చూసేందుకే సందర్శకులు మక్కువ కనబరుస్తున్నారు. క్యూలో నిల్చుని మరీ ఆయా విమానాల్లోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. బోయింగ్ విమానంలో ఎక్కేముందు సందర్శకుల పేర్లు వివరాలను నోట్‌బుక్‌లో రాయించుకుని మరీ అనుమతిస్తున్నారు. ఆయా ఫ్లైట్లను ఎక్కిన వారు సీట్లలో కూర్చొని సెల్ఫీలు, ఫొటోలతో జ్ఞాపకాలను పదిలపరుచుకుంటున్నారు.

కార్బన్ ఉద్గారాల నుంచి ఉపశమనం..

ఎలక్ట్రోలైజర్ ప్రాసెస్ ద్వారా నీటి (హెచ్2ఓ) నుంచి హైడ్రోజన్‌ను విడదీసి ఎనర్జీగా మార్చి అన్ని వాహనాలతో విమానాలను, హెలికాప్టర్లను నడిపించవచ్చని ఇక్కడి ఎగ్జిబిషన్‌లోని ఎయిర్‌పార్క్ స్టాల్ నిర్వాహకులు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం బ్యాటరీల ఆధారంగా ఈవీ వాహనాలు వస్తుండగా, ఆయా బ్యాటరీల తయారీలో కూడా రీసైక్లింగ్ ప్రాసెస్‌లో కార్బన్ ఉద్గారాలు వెలువడుతుంటాయి. ఇది పర్యావరణానికి విఘాతం కలిగిస్తోంది. దీనిని అధిగమించేందుకు హైడ్రోజన్ ఇంధనం ఎంతగానో దోహదపడుతుందని ఎయిర్‌పార్క్ నిర్వాహకులు తెలిపారు.

భారత్‌లో మొట్టమొదటి 5 సీట్ల ఈవీటోల్..

నల్వా ఏరో సంస్థ మొట్టమొదటిసారిగా భారత్‌లో ఐదు సీట్లతో ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (ఈవీటోల్) ఎయిర్‌క్రాఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సంబంధించిన డిజైన్‌ను ఆ సంస్థ ఇక్కడి స్టాల్‌లో ప్రదర్శించింది. విద్యుత్ బ్యాటరీ సహాయంతో గంటన్నర పాటు ఏకధాటిగా ప్రయాణించేలా డిజైన్ చేశారు. తక్కువ స్థలంలో సులువుగా ల్యాండింగ్, టేకాఫ్ జరిగేలా రూపొందించారు. దీనిని ఎయిర్ అంబులెన్స్‌గా, డెలివరీ సర్వీస్, ఎయిర్ ట్రాక్టర్ వంటి వివిధ రకాలుగా వాడుకునేలా తయారుచేశారు.



బుక్ మై షోలో బుకింగ్.. టికెట్ రూ.750

ఏవియేషన్ షోలో భాగంగా మొదటి రెండు రోజులు బిజినెస్ పాస్‌లు కలిగిన వారిని మాత్రమే అనుమతించగా, శని, ఆదివారాల్లో సామాన్య సందర్శకులను అనుమతించనున్నారు. బుక్ మై షో ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. పెద్దలకు, చిన్నారులకు (మూడేళ్ల పైబడిన వారికి) రూ.750 చొప్పున టికెట్ ధర నిర్ణయించారు.

భవిష్యత్తు డ్రోన్ల యుగమే..

డ్రోన్లలో వచ్చిన ఆధునిక మార్పులు స్ఫూరణకు తెస్తోంది మావియోమ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ స్టాల్. మల్టీరోటర్ మావీయోమ్ ఎక్స్4 డ్రోన్ ద్వారా గూగుల్ ఎర్త్‌కు సంబంధించి యూఏవీ ఫొటోలను ఎలా సేకరించవచ్చో ఇక్కడ తెలుసుకోవచ్చు. దీంతో పాటు అగ్రికల్చర్ రీసెర్చ్ ఫారెస్ట్ ట్రాకింగ్, సర్వైలెన్స్, డిటెక్షన్, ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్ డిటెక్షన్, మ్యాపింగ్, మైనింగ్ ప్రాంతాల గుర్తింపు, 3డీ ల్యాండ్ మోడలింగ్.. ఇలా మానవ అవసరాలకు అనుగుణంగా డ్రోన్లను ఏవిధంగా ఉపయోగించవచ్చో, ఆ రంగంలో వచ్చిన అధునాతన పరిజ్ఞానం గురించి తెలుసుకునేందుకు ఈ స్టాల్‌ను సందర్శించాల్సిందే.

స్మార్ట్ పోల్స్



ఆపత్కాలంలో ఆదుకునేలా..

- ఉచిత వైఫై, వాతావరణ సమాచారం సైతం
- తొలుత నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: ఎవరైనా ఏదైనా ఆపదలో ఉంటే పోల్‌కున్న ప్యానిక్ బటన్ నొక్కితే పోలీసులకు సమాచారం అందుతుంది. అవసరమైన సహాయం చేసేందుకు వెంటనే రంగంలోకి దిగుతారు. నగరంలో వాతావరణం ఎలా ఉంది ? వాయు, ధ్వని కాలుష్యం ఏ స్థాయిల్లో ఉన్నాయో కూడా తెలుస్తుంది. నిర్ణీత వ్యవధి మేరకు ప్రజలు ఉచిత వైఫై సదుపాయాన్ని సైతం వినియోగించుకోవచ్చు. ఏ ప్రభుత్వ విభాగమైనా ప్రజలకు అవసరమైన సమాచారాన్ని తెలియజేసేందుకు, విస్తృత ప్రచారం చేసేందుకు వీలుగా మైకులు సైతం ఉంటాయి. ఈ ఏర్పాట్లన్నీ ఒకే పోల్‌కు ఉంటాయి. అంతేకాదు.. పోల్‌కుండే సర్వైలెన్స్ కెమెరాల ద్వారా రియల్‌టైమ్ దృశ్యాలు నమోదవుతుంటాయి. తద్వారా మహిళల రక్షణ వంటి వాటికీ సదుపాయంగా ఉంటుంది. అవసరమైన సందర్భాల్లో నేరస్తులను త్వరితంగా పట్టుకునేందుకు వీలవుతుంది. ఇలా వివిధ సదుపాయాలు ఉండే స్మార్ట్‌పోల్స్‌ను తొలిదశలో సిటీలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో దాని అంచనా వ్యయం దాదాపు రూ. 11.70 లక్షలు. ఈ స్మార్ట్‌పోల్స్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు.

ఏమేం ఉంటాయి ?

వివిధ సదుపాయాల కోసం ఈ పోల్స్‌కే సీసీ కెమెరాలు, డిజిటల్ డిస్‌ప్లే, పర్యావరణ సెన్సర్లు, అత్యవసర సమస్యల్లోని వారికోసం ఎమర్జెన్సీ ప్యానిక్ బటన్(కాల్‌బాక్స్), మైకులు, వైఫై, ఎల్‌ఈడీ లైటింగ్ తదితరమైనవి ఉంటాయి.

స్మార్ట్ పోల్స్ ఇక్కడ..

తొలిదశలో దిగువ పేర్కొన్న 4 ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయనున్నారు.

- కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్
- ఖైరతాబాద్ జంక్షన్
- ఇందిరాగాంధీ విగ్రహం, పీవీఎన్ఆర్ మార్గ్

మూడేళ్ల వరకు నిర్వహణ

వీటిని ఏర్పాటు చేసే కాంట్రాక్టు ఏజెన్సీయే మూడేళ్లపాటు నిర్వహణ పనులు కూడా చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు టెండర్లు పిలిచినట్లు సంబంధిత అధికారి తెలిపారు. స్మార్ట్‌పోల్స్‌పైనే వాణిజ్య ప్రకటనలకు కూడా అవకాశం ఉంటుంది. ఆ స్థలాన్ని జీహెచ్ఎంసీయే వినియోగించుకొని ప్రకటనల ఆదాయం పొందుతుంది. స్మార్ట్‌పోల్స్ కంట్రోల్స్‌ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

పర్యావరణ హితం

వీటికి ఏర్పాటు చేసే ఎల్ఈడీ వీధిదీపాలు, సెన్సర్లు విద్యుత్‌ను పొదుపు చేస్తాయి. పరిస్థితులకనుగుణంగా బయటి వెలుతురును బట్టి దీపాలు ఆటోమేటిక్‌గా ఎక్కువ వెలుతురు, తక్కువ వెలుతురుతో వెలుగుతుంటాయి. పర్యావరణపరంగానూ ఇవి మేలైనవని అధికారులు పేర్కొన్నారు.

అవగాహన కల్పించాలి..

నగరంలో వివిధ సదుపాయాలు అందుబాటులోకి తెస్తుండటం మంచిదే అయినప్పటికీ, ప్రజలకు వాటి గురించి అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. అందుకు ఉదాహరణగా పెలికాన్ ట్రాఫిక్ సిగ్నల్లను నగర ప్రజలు గుర్తు చేస్తున్నారు. పాదచారులు ప్రమాదాల బారిన పడకుండా రోడ్డు దాటేందుకు ఏర్పాటు చేసిన వీటి గురించి వారికి అవగాహన లేకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదంటున్నారు.

నమో రామం





రామ నామాన్ని పారాయణం చేస్తున్న మహిళలు

ఎటూ చూసినా అయోధ్య హోర్డింగ్‌లే

- ఇప్పటికే ఇంటింటికీ చేరిన అక్షింతలు
- ప్రాణప్రతిష్ట రోజు ఆలయాల్లో పూజలు
- కాలనీల్లో ప్రత్యేక సమావేశాలు.. అయోధ్యకు క్యూ

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరం రామనామం జపిస్తోంది. పార్టీలు, కులమతాలకు అతీతంగా రామనామ స్మరణ చేస్తున్నాయి. సిటీలో ఎటు చూసినా అయోధ్య రామ మందిరం హోర్డింగ్‌లే దర్శనమిస్తున్నాయి. ఏ ఇద్దరు కలిసినా వారి మధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపనపైనే చర్చ కొనసాగుతోంది. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, బీజేపీ కార్యకర్తలు, దేవాలయాల నిర్వాహకులు, కాలనీ సంక్షేమ సంఘాల నిర్వాహకులు ఇప్పటికే ఇంటింటికీ అక్షతలను పంపిణీ చేశారు. అయోధ్య మందిరంలో ఈ నెల 22న రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంటా దీపాలు వెలిగించడంతో పాటు ఇప్పటికే ఇంట్లోని పూజామందిరంలో భద్రపరిచిన అక్షతలకు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ×ఇంటిపై కాషాయ ఎండా ఎగరేయడం, ప్రధాన ద్వారం ముందు శ్రీరామ తత్త్వం ఉట్టిపడేలా ముగ్గు వేయడం, శ్రీరాముని ప్రతిమను పూజించడం, శ్రీరామ జయరామ జయ జయ రామ అనే జపాన్ని వీలైనంత ఎక్కువ సార్లు జపించాలంటూ భక్తులకు సూచిస్తున్నారు.

భక్తి గీతాలు, నిష్టగా పూజలు

- సోమవారం ఇంట్లో పూజా క్రతువు ముగిసిన తర్వాత ఇదే రోజు సాయంత్రం సమీపంలోని దేవాలయాలకు మూకుమ్మడిగా చేరుకుని, భక్తి గీతాలు, భజనలు, రామనామ స్మరణలతో హోరెత్తించాలని భావిస్తున్నారు. ఆ మేరకు ఆయా దేవాలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నగరానికి చెందిన కొంత మంది భక్తులు రామకోటి రాయడంలో బిజీగా మారిపోయారు. వీరిలో ఇప్పటికే పలువురు అయోధ్యకు చేరుకున్నారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. మరికొంత మంది అయోధ్య బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, సామాన్య కార్యకర్తలు, భక్తులు వాట్సాప్, ఫేస్‌బుక్ రామ మందిర ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫొటోలనే షేర్ చేస్తున్నారు. కొన్ని వ్యాపార సముదాయాలైతే ఏకంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడం గమనార్హం. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో కీలకమైన ఆది, సోమ వారాల్లో మాంసం, మద్యం ముట్టుకోకూడదని తీర్మానిస్తున్నారు. వీటి అమ్మకాలను నిలిపివేయాల్సిందిగా కోరుతూ ఆయా కాలనీల్లోని వ్యాపారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

'స్వచ్ఛ తీర్థ అభియాన్'

అయోధ్య రామ మందిరంలో రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ నగరంలోని పలువురు భక్తులు ప్రత్యేక దీక్షలు చేపట్టారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన దీక్షను ఆదర్శంగా తీసుకుని వారు కూడా స్వచ్ఛ తీర్థ అభియాన్ పేరుతో నగరంలోని పలు దేవాలయాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు శుక్రవారం కాచిగూడలోని శ్యామ్ మందిర్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య ఆలయాన్ని శుభ్రం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్ రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

150 వారాలకు చేరిన ఆధ్యాత్మిక గ్రంథాల పారాయణం

ఓల్డ్ సిటీలోని దాదాపు 50 మంది మహిళలు రెండేళ్ల క్రితం 'మాతృశక్తి' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా వీరంతా రామాయణం, భగవద్గీత, వేదాలు, ఉపనిషత్తులు తదితర ఆధ్యాత్మిక గ్రంథాల పారాయణం ప్రారంభించారు. మాతృశక్తి కార్యక్రమం 150 వారాలను ఘనంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్య నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మహిళలంతా పాల్గొని శ్రీ రామ, జయరామ నామాలను ఏకధాటిగా పఠించారు. కాగా..

నగరంలోని మెహిదీపట్నానికి చెందిన 'సత్వ', అత్తాపూర్ వేదికగా మరో బృందం ఆధ్వర్యంలో రామనామ జపం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఓల్డ్ సిటీలోని విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలోని మహిళల బృందం ఈ నెల 15వ తేదీ నుంచి పలువ దేవాలయాల్లో స్వచ్ఛ భారత్ చేపట్టారు.



నగరంలో వెలసిన శ్రీరాముడి కటౌట్







పశు సంక్రాంతిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తదితరులు



పల్లె కాంతి.. పశు సంక్రాంతి

నగర శివారు నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం గోవులు, గేదెలకు పూజలు నిర్వహించి పశు సంక్రాంతిని ప్రారంభించారు. గుజరాత్, హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన గేదెలు, ఆవులను అందంగా ముస్తాబు చేసి అమ్మకానికి పెట్టారు. వీటి ధరలు రూ.50 వేల నుంచి రూ.2.50 లక్షల వరకు పలికాయి. పట్టినాగులపల్లికి చెందిన ప్రమోద్ అనే పాల వ్యాపారి దులియా, జాఫ్రి జాతికి చెందిన 10 గేదెలను ఒక్కోదాన్ని రూ.2.51 లక్షల చొప్పున కొనుగోలు చేశారు.
– మణికొండ

ఫిజీ పర్యాటక అభివృద్ధికి భారత్ సహకారం

- ఫిజీ దేశ ఉప ప్రధాని గవోక
- తమ దేశంలో వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఐఎస్ఎమ్ ఎడ్యూటెక్‌కు వినతి..



సాక్షి, సిటీబ్యూరో: ఫిజీ దేశంలో పర్యాటక రంగ అభివృద్ధికి భారతదేశ సహకారం ఎంతో అవసరమని, ఈ నేపథ్యంలో భారత్‌లో తన పర్యటన విజయవంతమైందని ఫిజీ దేశ ఉప ప్రధాని విలియమే గవోక అన్నారు. శుక్రవారం నగరంలోని ఐఎస్ఎమ్ ఎడ్యూటెక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన పర్యాటక రంగ అభివృద్ధి, ఇరు దేశాల సత్సంబంధాలకు అవసరమైన కృషి తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, ప్రముఖ చలనచిత్ర కథకులు విజయేంద్రప్రసాద్, ఉగాండా దేశంలోని డాట్ నెట్ కంపెనీ చైర్మన్ వేణుగోపాల్, ఐఎస్ఎమ్ ఎడ్యూటెక్ సంస్థ డైరెక్టర్లు వై.జగన్ మోహన్, అర్క సాయి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలియమే గవోక మాట్లాడుతూ., భారత్ తరహాలో ఫిజీ దేశంలో వైద్యం, వైద్యవిద్య రంగానికి సంబంధించిన సమగ్రమైన వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఐఎస్ఎమ్ ఎడ్యూటెక్ సంస్థను కోరారు. ఇందుకు అవసరమైన అన్నిరకాల సహాయ సహకారాలను తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఫిజీ దేశంలో చలనచిత్ర రంగాన్ని అభివృద్ధి చేస్తామని, దీనికి సంబంధించిన నిర్మాణ బాధ్యతలను విజయేంద్ర వర్మకు అప్పగిస్తామన్నారు. ఫిజీ దేశం అద్భుతమైన ప్రదేశమని, ఆ దేశ నేపథ్యంలోని కథతో ఒక సినిమా చేయనున్నట్లు విజయేంద్ర ప్రసాద్ తెలిపారు. ఫిజీ దేశంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేసే బాధ్యత అప్పగించడం తమ సంస్థ కార్యదీక్షకు తార్కాణమని ఐఎస్ఎమ్ ఎడ్యూటెక్ వై.జగన్ మోహన్ తెలిపారు.

రాజస్థాన్ టు హైదరాబాద్

- అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్ట్
- రూ. కోటి విలువైన డ్రగ్స్ స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

ఆల్వాల్: రాజస్థాన్ నుంచి మాదకద్రవ్యాలను తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం, బర్మర్ జిల్లాకు చెందిన నరేంద్ర బిష్ణోయి, ప్రవీణ్ బిష్ణోయి,హేమా రామ్ మీర్‌పేట్‌లో నివాసం ఉంటూ స్టీల్ రైలింగ్ పనిచేస్తున్నారు. అదే ప్రాంతంలో హార్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్న పాకారం దేవాసితో పాటు వీరు డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. ఈ నేపథ్యంలో వారు రాజస్థాన్ నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి తాము వినియోగించడమేగాక విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సమాచారం అందడంతో గురువారం ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందంతో కలిసి మీర్‌పేట్ పోలీసులు అల్మాస్‌గూడలోని వర్షిణి ఫంక్షన్ హాల్ వద్ద వీరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 150 గ్రాముల హెరాయిన్, 32 గ్రాముల ఎన్‌డీఎంఏ, రెండు తూకం మిషన్లు, వివిధ రకాల కవర్లు, రెండు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ నుంచి వీరు ప్రైవేట్ బస్సుల్లో అక్రమ రవాణా చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ప్రధాన నిందితుడితో పాటు, మరొకరు పరారీలో ఉన్నారన్నారు.

మహిళల రక్షణే ధ్యేయం

- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు
- మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు:
- షీ టీమ్స్‌కు పట్టుబడిన వారికి కౌన్సెలింగ్..



కౌన్సెలింగ్ ఇస్తున్న షీ టీమ్స్ పోలీసులు

నాగోలు: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 1 నుంచి 15 వరకు దాదాపు 118 మంది ఆకతాయిలను రాచకొండ షీ టీమ్స్ అదుపులోకి తీసుకున్నాయి. వీరిలో 54 మంది మేజర్లు, 64 మంది మైనర్లు ఉన్నారు. ఫోన్ల ద్వారా వేధించినవి 30, వాట్సాప్, మెసేజీల ద్వారా వేధించిన కేసులు 20, సోషల్ మీడియా కేసులు 33, నేరుగా వేధించిన కేసులు 55 కేసులు ఉన్నాయి. ఇందులో నలుగురిపై క్రిమినల్ కేసులు, 53 మందిపై పెట్టి కేసులు నమోదు చేశారు.వారికి శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఎన్జీవో వారి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాచకొండ సీపీ మాట్లాడుతూ మహిళలను వేధించే పోకిరీలను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. బాధితులు వెంటనే రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, సీఐ పరశురాం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణ నిఘా రిజిస్టర్

- పోకిరీల ప్రవర్తనపై 6 నెలలు ప్రత్యేక నిఘా
- ఎస్‌హెచ్ఓ, ఎస్ఐలదే రిజిస్టర్ నిర్వహణ బాధ్యత



సాక్షి, సిటీబ్యూరో: మహిళ భద్రత, రక్షణ కోసం రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగా మహిళా సంరక్షణ నిఘా రిజిస్టర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మహిళలను లైంగిక వేధింపులకు, ఈవ్ టీజింగ్ వంటి కేసులలో నిందితులపై ఆరు నెలల పాటు ప్రత్యేకంగా నిఘా పెట్టడమే ఈ రిజిస్టర్ ఉద్దేశమని కమిషనర్ జీ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో ఈ రిజిస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బాధిత మహిళలకు ఆకతాయిల నుంచి కక్షపూరిత వేధింపులు, దాడులు వంటివి పునరావృతం కాకుండా చేయడంతో పాటు నిందితుల ప్రవర్తన, వారి కార్యకలాపాలపై నిఘా ఉంచుతామన్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ హౌస్ అధికారి (ఎస్‌హెచ్ఓ), సెక్టార్ ఎస్ఐల ఆధ్వర్యంలో ఈ రిజిస్టర్ నిర్వహిస్తారన్నారు. బాధితులకు లేదా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా, అవసరమైన పక్షంలో వ్యక్తిగతంగా భద్రత, ఇతరత్రా రక్షణ కల్పిస్తారన్నారు.

ప్రతి వ్యక్తిలో అంతర్గత సామర్థ్యాన్ని గుర్తించాలి

అమృత విశ్వ విద్యాపీఠం కులపతి మాతా అమృతానందమయి



లక్డీకాపూల్ : ప్రతి వ్యక్తిలో ఉండే అంతర్గతమైన సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అమృత విశ్వ విద్యాపీఠం కులపతి మాతా అమృతానందమయి అన్నారు. విద్య మనోనేత్రాన్ని, బాహ్య నేత్రాన్ని తెరుచుకునేలా బోధన జరగాలన్నారు. అమృత విద్యాపీఠం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా ఆవిష్కరణ, పరిశోధన, సమర్థతపై కొనసాగుతున్న సదస్సులో శుక్రవారం ఆమె మాట్లాడుతూ విలువ ఆధారిత విద్య, ఇండిక్ స్టడీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంక్లూసిటవిటీ, పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ తదితర అంశాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. సదస్సులో సైన్స్ టెక్నాలజీ అధికారి డాక్టర్ అఖిలేష్ గుప్తా, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఉపేంద్ర కుమార్ సింగ్, విద్యా పీఠం ప్రొవోస్ట్ డాక్టర్ మనీషా వి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ ప్రేమ విషాదాంతం

- బాలికపై దాడి చేసిన బాలుడి ఆత్మహత్య
- పోలీసులకు భయపడి.. రైలు కింద పడి..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

అంబర్‌పేట్/కాచిగూడ: మైనర్ ప్రేమ రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. గురువారం బాలికపై దాడికి పాల్పడిన బాలుడు శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. బాగ్ అంబర్‌పేట మల్లికార్జున నగర్‌కు చెందిన బాలుడు.. ఆరో తరగతి నుంచి తన ఇంటి సమీపంలో నివసించే ఓ అమ్మాయితో స్నేహంగా మెలిగి ఆమెపై ప్రేమ పెంచుకున్నాడు. వీరిద్దరూ పదో తరగతి పాసైన తర్వాత వేర్వేరు కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. గురువారం సాయంత్రం బాలుడు.. బాలిక ఇంటికి వెళ్లి కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన బాలిక సోదరిపై సైతం కత్తితో దాడి చేసి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కత్తిపోట్లకు గురైన ఇద్దరు బాలికలను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలికలపై దాడి చేసిన బాలుడు ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. పోలీసులు తన కోసం వెతకడంతో భయాందోళనకు గురయ్యాడు. బాగ్ అంబర్‌పేట నుంచి శివంరోడ్ మీదుగా విద్యానగర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. పట్టాలపై తల పెట్టి పడుకున్నాడు. అతని వెంటే వెళ్లిన పోలీసులు విద్యానగర్ రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడ వైపు వెతికారు. విద్యానగర్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వైపు వెతికితే బాలుడు ప్రాణాలతో పోలీసులకు దొరికేవాడు. పట్టాలపై తల పెట్టి పడుకున్న రైలు వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి ఆత్మహత్య



రాహుల్ (ఫైల్)

సికింద్రాబాద్: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికిలోనైన ఓ బాలుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. తుకారాంగేట్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న మురళి, లీలావతి దంపతులకు రాహుల్ (15), దుర్గాభవాని (13) సంతానం. వీరిద్దరూ పిల్లలు మిక్స్‌డ్ రైల్వే హై స్కూల్‌లో చదువుతున్నారు. మురళి మద్యానికి బానిస కావడంతో లీలావతి టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆర్థిక సమస్యల నేపథ్యంలో వారి మధ్య తరచూ గొడవలు జరిగేవి. గురువారం కూడా వారి మధ్య గొడవజరగడంతో మనస్తాపానికిలోనైన రాహుల్ గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై కప్పుకు కండువాతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి ఇంటికి తిరిగివచ్చిన లీలావతి లోపలినుంచి గడియపెట్టి ఉన్నట్లు గుర్తించింది. పలుమార్లు పిలిచినా రాహుల్ పలుకకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా రాహుల్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. అతడిని కిందకు దింపి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అమ్మమ్మ మందలించిందని...



కళ్యాణ్ (ఫైల్)

చిక్కడపల్లి: అమ్మమ్మ మందలించడంతో మనస్తాపానికిలోనైన ఓ బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐ మౌనిక కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రిసాల కుర్షిద్ ప్రాంతానికి చెందిన డి.రాజు, సరిత దంపతుల కుమారుడు కళ్యాణ్(16) చిక్కడపల్లిలోని ఓ జ్యూయలరీ షాప్‌లో పని చేస్తూ నెల రోజుల క్రితం మానేశాడు. 2013లో అతడి తల్లి సరిత అనారోగ్యంతో మృతి చెందగా, తండ్రి రాజు కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. అప్పటి నుంచి అతను తన అమ్మమ్మ శంకరమ్మ ఇంట్లో ఉంటున్నాడు. గత కొద్ది రోజులుగా అతను పనికి వెళ్లకపోవడంతో అతడి అమ్మమ్మ శంకరమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి లోనైన కళ్యాణ్ శుక్రవారం తెల్లవారుజామున బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన శంకరమ్మ స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ అవుట్‌పోస్ట్‌లో అగ్నిప్రమాదం

కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరు విద్యుత్‌శాఖ ఉద్యోగులకు గాయాలు

అబిడ్స్: పోలీస్ అవుట్‌పోస్ట్‌లో అగ్నిప్రమాదం సంభవించడంతో ఓ పోలీస్ కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరు విద్యుత్‌శాఖ ఉద్యోగులు గాయపడిన సంఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దారుసలాం పోలీస్ అవుట్‌పోస్ట్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దారుసలాంలోని పురాతనమైన పోలీస్ అవుట్‌పోస్ట్ భవనం చాలా ఏళ్లుగా వాడకంలో లేదు. ఈ భవనంలో పోలీసులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సిలిండర్లు, వాహనాలు, ఇతర సామగ్రిని డంప్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున పొగలు రావడంతో గుర్తించిన విద్యుత్ శాఖ సిబ్బంది పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం అందించారు. దీంతో నైట్ డ్యూటీలో ఉన్న ఎస్ఐ.సుబ్రమణ్యం, కానిస్టేబుల్ రాజా తదితరులు సంఘటన స్థలికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుండగా, భవనంలో ఉన్న సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో కానిస్టేబుల్‌తో పాటు విద్యుత్ శాఖకు చెందిన లైన్‌మెన్లు కలీం, హుస్సేనిలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం నాంపల్లి కేర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గౌలిగూడ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళ్‌హాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల అనుమానాస్పద మృతి

మల్కాజిగిరి: అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ లక్ష్మణ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లికార్జుననగర్‌కు చెందిన శ్రీనివాస్(47) బార్బర్‌గా పనిచేస్తుండగా అతని భార్య రమాదేవి(37)టైలరింగ్ పని చేసేది. ఈ నెల 17న రాత్రి వీరి కుమార్తె సుష్మిత అదే ప్రాంతంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లింది. 18న ఉదయం ఇంటికి వచ్చిన ఆమె తలుపు తట్టినా స్పందించకపోవడంతో కిటికీ తెరచి చూడగా తండ్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నట్లు గుర్తించి తన మామయ్య హరీష్‌కు సమాచారం అందించింది. దీంతో ఆయన అక్కడికి వచ్చి తలుపు పగులగొట్టి చూడగా రమాదేవి బెడ్‌రూమ్‌లో విగతజీవిగా పడి ఉంది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. గత కొంత కాలంగా వారిరువురూ ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు మృతురాలు రమాదేవి తల్లి యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాంబోర్గిని నడిపిన వ్యక్తి కోసం గాలింపు

- దుబాయ్‌లో ఉన్నట్లు గుర్తింపు
- లుక్‌ఔట్ నోటీసుల జారీకి సన్నాహాలు



బంజారాహిల్స్: కారు మాత్రమే నీది.. రోడ్డు కాదు.. అంటూ మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్న ఓ కారును ఉద్దేశించి వాహనచోదకుడు ఆ కారు ఫొటోతో సహా చేసిన ట్వీట్ సంచలనం సృష్టించింది. జూబ్లీహిల్స్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేయడమే కాకుండా సదరు కారును సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే... ఇటీవల బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రహదారులపై టీఎస్09 జీడీ 9777 నెంబర్ లాంబోర్గిని కారు అదుపుతప్పిన వేగంతో, మితిమీరిన శబ్దంతో వెళుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. ర్యాష్ డ్రైవింగ్‌తో దూసుకెళ్తున్న ఈ కారును ఓ వ్యక్తి ఫొటో తీసి పోలీసు అధికారులకు ట్వీట్ చేశారు. కారును సీజ్ చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆ రోజు ఈ కారును ప్రముఖ రియల్టర్, రిచ్‌మౌంట్ వెంచర్ సంస్థ అధినేత కార్తీకేయ మ్యాడం నడిపినట్లుగా గుర్తించి, అతడిపై పలు సెక్షన్ల కింద కేసు కూడా నమోదు చేశారు. ఆయన కోసం గాలింపు చేపట్టిన పోలీసులు ఆరా తీయగా అతను దుబాయ్‌లో ఉన్నట్లుగా తేలింది. దీంతో లుక్ అవుట్ నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. నిర్లక్ష్యంగా ఎంవీ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించి అదుపుతప్పిన వేగంతో ర్యాష్ డ్రైవింగ్ చేసిన కార్తీకేయపై చర్యలకు సిద్ధమవుతున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శోభాయాత్రలో సంయమనం పాటించాలి

ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ వెంకటేశ్వరావు

రహమత్‌నగర్: శోభాయాత్రలో భకుతలు సంయమనం పాటించాలని ఎస్‌ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వరావు నిర్వాహకులకు సూచించారు. శోభాయాత్ర నిర్వహణకు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకొని, యాత్ర సాగే ప్రాంతాల వివరాలు తెలియపర్చాలని ఆదేశించారు. ఈ నెల 22 అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకుని శోభాయాత్రాలు నిర్వహించే ప్రతిభానగర్, కార్మికనగర్, శ్రీరాంనగర్ ఆలయాలను ఆయన శుక్రవారం పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... శోభాయాత్ర శాంతియుతంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. నిర్ణీత సమయంలోపు యాత్ర ముగించాలని స్పష్టం చేశారు. బోరబండ డీఐ భూపాల్‌గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రాన్ని అందుకుంటున్న రమేష్ మంజల్కర్

హిమాయత్‌నగర్: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడిగా రమేష్ మంజల్కర్‌ను నియమించినట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ వెల్లడించారు. బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన రమేష్ మంజల్కర్‌కు అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడిగా నియమిస్తూ, నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడి ఉన్న వడ్డెర సామాజికవర్గం అభివృద్ధికి, సంక్షేమానికి పాటుపడేందుకు యువతకు ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వడ్డెరులను పూర్తిగా విస్మరించి, అభివృద్ధికి దూరం చేసిందన్నారు. బీసీ ఏ నుంచి ఎస్టీ జాబితాలోకి మార్చడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి యువత పోరాటాలు నిర్వహించాలన్నారు. అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు వి.తిరుమల దేవి, ప్రధాన కార్యదర్శి జి.రేణుక, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.నారాయణ,వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ల మల్లేష్,నేతలు డి.రూప మహేశ్వరి, ఆర్.గిరిబాబు, ఇ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్వర నీరాజనం



కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

బంజారాహిల్స్: విశాఖ శ్రీశారదా పీఠ పాలిత ఫిలింనగర్ దైవ సన్నిధానంలో జరుగుతున్న స్వర నీరాజనం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సంగీత విభావరి వీనులవిందు చేసింది. రామవజ్జుల శ్రీదేవి శిష్య బృందం, రామలక్ష్మీలు ఆలాపించిన రామదాసు, త్యాగయ్య, అన్నమాచార్య కీర్తనలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. గాయకులను దైవ సన్నిధానం పాలకమండలి సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి లక్ష్మీ శాలువాతో సత్కరించారు. కోశాధికారి కాజా సూర్యనారాయణ, సభ్యులు చుక్కపల్లి సురేష్‌లు జ్ఞాపికలను అందజేశారు. రోజూ రామాయణంలోని ఒక్కొక్క కాండాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం రాంబాబు ప్రవచిస్తూ భక్తులను భక్తిపారవశ్యంలో నింపుతున్నారు. అందులో భాగంగా సుందర కాండ ప్రవచనం చేశారు.

నిమ్స్‌లో ఐదుగురు రిటైర్డ్ అధికారులు

లక్డీకాపూల్: నిమ్స్‌లో కొనసాగుతున్న విశ్రాంత అధికారులను జాబితాను యాజమాన్యం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఆస్పత్రిలో ఉద్యోగ విరమణ తర్వాత కూడా విధుల్లో కొనసాగుతున్న వారి వివరాలను అందించింది. ఈ జాబితాలో డిప్యూటేషన్ పద్ధతిలో నిమ్స్ విస్తరణ ప్రాజెక్ట్ విధులు నిర్వహిస్తున్న ఎస్.మధుసూదన్, ఆర్ అండ్ బీ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ లక్ష్మారెడ్డి, రవీంద్ర రెడ్డి, లీగల్, హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ డాక్టర్ నబీ, ఎలక్ట్రికల్ ఈఈ అశోక్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హిమాయత్‌నగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా హిమాయత్‌నగర్‌లోని పలు ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సైఫాబాద్ డివిజన్ సీబీడీ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ అధికారి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హిమాయత్‌నగర్‌లోని స్ట్రీట్ నంబర్ 8 నుంచి 12 వరకు గల దత్తానగర్ ఏరియాలో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హిమాయత్‌నగర్ స్ట్రీట్ నంబర్ 12 నుంచి 15 ప్రాంతాలతో పాటు నారాయణగూడ మెహిఫిల్ హోటల్ ఏరియాలోని విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

లైఫ్‌స్టైల్ భవనంలో అగ్నిప్రమాదం



పంజగుట్ట: బేగంపేట లోని లైఫ్‌స్టైల్ భవనంలో శుక్రవారం మధ్యాహ్నం స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన భవన నిర్వహణ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. వివరాల్లోకి వెళితే .. జ్యోతిబా పూలే ప్రజాభవన్ ఎదురుగా ఉన్న లైఫ్‌స్టైల్ భవనంలోని మొదటి అంతస్తులో ఓ హోటల్ కొనసాగుతోంది. అందులోని కిచెన్‌లో గ్యాస్ లీకేజీ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన హోటల్ సిబ్బంది మంటలను కొంతమేర అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. గ్యాస్ లీకేజీ కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో 'వోల్టా రైడ్' సేవలు

VOLTA "Mein Khush,Mera Driver Khush"

లక్డీకాపూల్: నగరంలో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే క్రమంలో వోల్టా రైడ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైడ్ షేరింగ్ స్టార్టప్ వ్యవస్థాపకులు శశికాంత్ కనపర్తి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయంగా, (జీరో పర్సెంట్ కమిషన్) డ్రైవర్లకు తక్షణ చెల్లింపులే లక్ష్యంతో ఈ సేవలను అందించనున్నట్లు చెప్పారు. మార్కెట్‌లోని ఇతర రైడ్ షేరింగ్ సర్వీసుల కంటే భిన్నంగా వోల్టా సంస్థ కస్టమర్లను వారి గమ్య స్థానాలకు చేర్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని... ఇందులో భాగంగా సంప్రదాయ రైడ్ షేరింగ్ సంస్థల నుంచి డ్రైవర్లు తరచు ఎదుర్కొనే అధిక కమిషన్ భారం, ఆలస్యంగా చెల్లించే చెల్లింపుల భారం నుంచి విముక్తి కలిగించామన్నారు. 'రైడ్ ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని, తక్కువ ఛార్జీలు చెల్లించేలా మరో రైడ్ కోసం ఎదురు చూసే పనిలేదన్నారు. వోల్టా యాప్‌లో తక్కువ ప్రయాణ ధరల్ని సూచించేలా యాప్‌లో ప్రయాణికులకు సరికొత్త ఫీచర్లను అందిస్తున్నామని తెలిపారు. ఫలితంగా తక్కువ ఛార్జీలను చెల్లించి వారి చేరుకోవాల్సిన గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చని వోల్టా సీఈఓ రాజా విక్రమ్ తెలిపారు. వోల్టా యాప్ ఐఓఎస్, ఆండ్రాయిడ్ యాప్ స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

నేడు, రేపు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు

రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ మేరకు మొదటి సంక్షిప్త ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో స్పెసల్ క్యాంపెయిన్ డేస్‌ను నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారు.

- అందుబాటులో ఉండనున్న అధికారులు
- ఓటు నమోదుతో పాటు సవరణలకూ అవకాశం
- వినియోగించుకోవాలంటున్న జీహెచ్ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని 240 పోలింగ్ కేంద్రాల్లో, జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని 329 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి కొత్త ఓటరు నమోదుతో పాటు సవరణలకు అవకాశం కల్పించడమే కాకుండా ఇందుకు సంబంధించిన ఫారాలను అందుబాటులో ఉంచనున్నారు.

◆ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు నమోదుకు ఫారం-6లో వివరాలు భర్తీ చేసి దరఖాస్తును అక్కడే ఉండే బీఎల్‌ఓలకు అందించవచ్చని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు.

◆ ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర సవరణలు, నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం మార్పు, ఇతర నియోజకవర్గంలోకి పేరు మార్పు, అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారని, ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.



ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలపై సమీక్షిస్తున్న ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే

◆ ఇందుకోసం అన్ని పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

◆ ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలకు సంబంధించి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే సమీక్ష నిర్వహించారు.

◆ ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని 21 తరువాత వారం రోజుల్లో పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

◆ ఫారం-6 ద్వారా నూతన ఓటరుగా నమోదు, ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం-7, ఓటరు స్థాన చలనం తదితర మార్పుల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

◆ ఇంకోవైపు ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా ప్రకటించనుండగా వాటి ఆధారంగా పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

చీరల పంపిణీ

లిబర్టీ: భారతీయ ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎస్.శర్మ చీరలను పంపిణీ చేశారు. శుక్రవారం వేదపండితుల సతీమణులకు, అర్చకుల సతీమణులతో పాటు వివిధ ఆలయాల వద్ద ఉన్న పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఆలయాల వెలుపల ఆకలి కోసం అన్నదానం కోసం ఎదురు చూస్తున్న పేదలకు వృద్ధులకు, మహిళలకు చీరలు, దుప్పట్లు ఇతర దుస్తులు, ఆహార పదార్థాలను అందజేశారు.

దీపాదాస్ మున్షీని కలిసిన విజయారెడ్డి



బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీని, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేష్‌కుమార్‌గౌడ్‌ను గాంధీ భవన్‌లో శుక్రవారం ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పి.విజయారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మహేష్‌కుమార్‌గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేత పి.మోహన్‌యాదవ్ పాల్గొన్నారు.

నిర్మాణ వ్యర్థాలపై నిఘా ఉంచండి: జెడ్‌సీ



అధికారులకు సూచనలిస్తున్న జెడ్‌సీ వెంకటేష్ ధోత్రే

బంజారాహిల్స్: భవన నిర్మాణ వ్యర్థాలతో పాటు ఇతర సామగ్రిని ఎక్కడంటే అక్కడ వేయకుండా తగిన నిఘా ఉంచాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రె సూచించారు. జోనల్ పరిధిలోని ఎస్ఈ, ఈఈ, డీఈలు, ఏఎంహెచ్‌వో, టౌన్ ప్లానింగ్ ఏసీపీలు, ఇతర విభాగాల అధికారులతో శుక్రవారం ఆయన జోనల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ... నిర్మాణ వ్యర్థాలను వేసిన ప్రాంతాలపై నిఘా ఉంచి వారికి జరిమానాలు విధించాలన్నారు. గుర్తించిన ప్రాంతాలలోనే నిర్మాణ వ్యర్థాలు వేయించి, సోమా కంపెనీతో వాటిని అక్కడి నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

22న రథోత్సవం

బంజారాహిల్స్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న జూబ్లీహిల్స్‌లోని శ్రీ సీతారామస్వామి వారి దేవాలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8 నుంచి పంచామృతాభిషేకం, అలంకరణ, ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ రహదారుల్లో రథోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నామని, అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు.

అభినందన



బంజారాహిల్స్: హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన ఎస్.గౌతమ్‌రావును శుక్రవారం పలువురు నేతలు, కార్యకర్తలు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. బీజేవైఎం నగర ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్‌తో పాటు పలువురు నేతలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. రెండోసారి ఎన్నికైనందుకు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

మహిళలను వేధిస్తే ఇక జైలుకే

నగర షీ టీమ్స్ డీసీపీ కవిత

హిమాయత్‌నగర్: మహిళలు, యువతులను వేధిస్తే ఇక జైలుకు వెళ్లాల్సిందే. నగరంలోని పలు రద్దీ ప్రాంతాలలో మహిళలను వేధిస్తున్న పోకిరీలు, ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని నగర షీ టీమ్ డీసీపీ కవిత వెల్లడించారు. జనవరి నెలలో షీ టీమ్ పోలీసులు మఫ్టీలో నుమాయిష్ ఎగ్జిబిషన్, కైట్ ఫెస్టివల్ సమయంలో పీపుల్స్ ప్లాజా, చార్మినార్, అఫ్జల్‌గంజ్ బస్టాప్, పరేడ్ గ్రౌండ్స్, సిటీలోని వివిధ ప్రాంతాలలో మహిళలను అసభ్యకరంగా తాకుతూ వేధిస్తున్న 39 మందిని రెడ్ హ్యాండెడ్‌గా వీడియో ఆధారాలతో పట్టుకొని కేసులు నమోదు చేశామని తెలిపారు. వీరిలో పది మంది నిందితులకు కోర్టు 3 రోజుల జైలు శిక్ష, రూ. 250 జరిమానా విధించారన్నారు. మరో ముగ్గురుని మందలించి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన 26 మందిపై కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నగరంలోని మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించడానికి, బహిరంగ ప్రదేశాల్లో.ర వాణా ప్రాంతాలలో షీ టీమ్ పోలీసులు నిరంతరం నిఘా పెట్టి పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. వేధింపుల విషయంలో మహిళలు ఫిర్యాదులు ఉంటే సిటీ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో లేదా అత్యవసర పరిస్థితుల్లో 100కి డయల్ చేయాలని డీసీపీ సూచించారు.

విద్యార్థులకు పాఠాలు బోధించిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



అంగన్‌వాడీ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి నిర్వహిస్తున్న పాదయాత్ర శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. రాజీవ్‌గాంధీనగర్, ఆరోగ్యనగర్, ఇందిరానగర్ ఫేజ్-2 బస్తీల్లో పాదయాత్ర నిర్వహించిన ఆయన ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు పనులకు సంబంధించిన నివేదికలు రూపొందించాలని కోరారు. బస్తీ నాయకులతో సమావేశం పెండింగ్ పనులు వివరాలను సేకరించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆయన పాఠాలు బోధించారు. రాజీవ్‌గాంధీనగర్ బస్తీ అధ్యక్షుడు శాంతకుమార్, నాయకులు స్వామి గొలుసుల ఎల్లయ్య, ఇందిరానగర్ ఫేజ్-2 బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల యాదయ్య, నాయకులు చెన్నయ్య, వెంకటేశ్‌లతో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

21న బాలికల సాధికారత కోసం వాక్

పంజగుట్ట: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ (ఆదివారం)న ఉదయం 7 గంటలకు నెక్లెస్ రోడ్డులో 'బాలికల సాధికారత కోసం వాక్' నిర్వహించనున్నట్లు చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై) తెలుగు రాష్ట్రాల ఆపరేషన్స్ ఇన్‌చార్జి బడుగు చెన్నయ్య తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వాక్ కరపత్రాన్ని క్రై సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ... ప్రస్తుత కంప్యూటర్ యుగంలోనూ బాలికల పరిస్థితి ఆశించినంతగా ఎదగలేదని, ఇప్పటికీ విద్య, ఆరోగ్య, రక్షణ విశయాలు ఆందోళనకరంగా ఉండటం బాధాకరమన్నారు. దేశ బాలికలకు మరింత ఆశాజనక భవిష్యత్ రూపొందించేందే ప్రయత్నంలో భాగమే ఈ వాక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఎస్‌బీఐ లైఫ్, కామినేని ఆస్పత్రిలు భాగస్వాములుగా ఉన్నాయని తెలిపారు. వాక్‌ను ఐపీఎస్ అధికారి శిఖా గోయల్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో క్రై సభ్యులు సత్య, సౌమ్య, సోనిలు పాల్గొని వారి కుటుంబాల్లో చిన్నతనంలో వివాహం చేసేందుకు యత్నిస్తే దాన్ని అధిగమించి ఎలా చదువుకుంటున్నారో వివరించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?



అన్నపూర్ణ స్టూడియో మలుపు వద్ద అక్రమ నిర్మాణం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని అన్నపూర్ణ స్టూడియోకు వెళ్లే మలుపు వద్ద రోడ్డు, ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. జీహెచెంసీ శిలాఫలకాన్ని ఆనుకుని ఓ వ్యక్తి సెట్ బ్యాక్ స్థలాన్ని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకోకుండానే అక్రమ నిర్మాణాలు దర్జాగా చేపట్టారు. ఇక్కడ గతంలోనే సదరు కబ్జాదారుడు నిర్మాణాలు చేపట్టగా అప్పటి జీహెచ్ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని కూల్చివేశారు. ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఎన్నికల నిర్వహణ, కొత్త ప్రభుత్వం,ప్రజాపాలన హడావిడిలో ఉండగా సదరు కబ్జాదారులు మళ్లీ ఈ అక్రమ నిర్మాణాలను చేపట్టారు. సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఇప్పటికే ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందాయి. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు కూడా పలువురు ఫిర్యాదు చేశారు. ప్రజాపాలనలోనూ ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందాయి. ఇంతవరకు వీటిని కూల్చకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి అనుమతులు తీసుకోకుండా నిర్మించిన వీటిని తొలగించి ఇక్కడ ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సీతాదేవికి లక్ష పుష్పార్చన



బంజారాహిల్స్: అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఫిలింనగర్ దైవ సన్నిధానంలో కొలువుదీరిన శ్రీకోదండ రామ స్వామి సన్నిధిలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సీతాదేవికి లక్ష పుష్పార్చన వేడుక వైభవంగా జరిగింది. అలాగే యుద్ధకాండ ప్రవచనంతో పాటు రామనామ సంకీర్తన వీనులవిందుగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేయగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది.

హనుమాన్ ఆలయంలో బీజేపీ స్వచ్ఛభారత్



ఆలయాన్ని శుభ్రపరుస్తున్న బీజేపీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలోని హనుమాన్ దేవాలయంలో శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ నేతలు స్వచ్ఛభారత్‌ను నిర్వహించి ఆలయం మొత్తాన్ని శుభ్రపరిచారు. ఈనెల 22న అయోధ్యలో భవ్యమైన రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నేతలు బంగారు ప్రశాంత్, జాతీయ మహిళామోర్చా కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని, గొంటి కుమార్‌చౌదరి యాదవ్, ఎ. శాంతికుమార్, ఉమేష్, విష్ణువర్ధన్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం

హిమాయత్‌నగర్: చదువుకోవాలని తపన ఉండి, నిస్సహాయ స్థితిలో ఉన్న విద్యార్థులకు చదువుకోవడానికి తన తల్లిదండ్రుల పేరు మీద లక్ష్మీజనార్దన్‌రెడ్డి ఎడ్యుకేషన్ సేవా సమితి ద్వారా సాయం అందిస్తానని ఉపాధ్యాయుడు ఎలుగుమెట్ల నాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చేతుల మీదుగా లక్ష్మీజనార్దన్ రెడ్డి ఎడ్యుకేషన్ సేవా సమితి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉపాధ్యాయుడు నాగిరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని పలు సేవా సంస్థలు ముందుకొచ్చి పేదల చదువుకు తోడ్పాటు అందించాలన్నారు. ఉపాధ్యాయుడు నాగిరెడ్డి మాట్లాడుతూ... చదువుకునే రోజుల్లో ఆర్థికంగా చాలా బాధలు ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు.



NOTICE

Sub:- Cooperation Department - Osmania University Employees Cooperative Housing Society Ltd, O.U. Colony, Shaikpet, Hyderabad, Regd. No.TAB-261 - Convening the General Body meeting -Notice issued-Regarding.

****

All the members of the Osmania University Employees Cooperative Housing Society Ltd are hereby informed that, it is decided to conduct the **General Body Meeting of the society on 04-02-2024(SUNDAY) at 11:00 AM at H.No.1-8-284/406, Plot No.406, O.U Colony, Shaikpet Mandal, Hyderabad-500008** to discuss and decide the matter related to the following agenda.

AGENDA

1. Income and expenditure for the period from 18-08-2022 to 31-12-2023.
2. Placing the Audit Reports for the year 2021-22.
3. Implementation of Awards issued by the Arbitrator and regularization of plots who have paid the cost.
4. To discuss the land released from the encroachers near water tank.
5. Any other matter with the permission of the chair.

All the members are requested to attend the General Body Meeting to discuss and decide the above stated agenda items.

Date: 16-01-2024 — Sd/- ASST.REGISTRAR / OFFICIAL PERSON INCHARGE


కేబీఆర్ పార్కు చుట్టూ మల్టీలెవల్ పార్కింగ్ సౌకర్యం



కేబీఆర్ పార్కు పార్కింగ్ స్థలం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రతిష్ఠాత్మక కేబీఆర్ పార్కుకు ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది వాకర్స్ వస్తుంటారు. అలాగే పార్కు చుట్టూ ఉన్న జీహెచ్ఎంసీ వాక్ వే లోనూ ఐదు కిలోమీటర్ల మేర కొంతమంది వాకర్లు వాకింగ్ చేస్తుంటారు. అయితే వాకర్లు తమ వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేయడం తలనొప్పిగా మారింది. అసలే ఇరుకుగా ఉన్న కేబీఆర్ పార్కు చుట్టూ రహదారులు, రోడ్ల పక్కన అక్రమ పార్కింగ్‌తో మరింత ఇరుకుగా మారుతూ ట్రాఫిక్ సమస్యగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఎనిమిది పార్కింగ్ స్థలాలను మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణాలు చేపట్టేందుకు యోచిస్తున్నారు. ఇందుకు తగిన ప్రతిపాదనలు రూపొందించాల్సిందిగా ఆదేశాలు వెలువడటంతో స్థానిక ట్రాఫిక్ పోలీసులు ఎక్కడెక్కడ మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణాలు చేపట్టవచ్చో వాటి వివరాలను అందజేశారు. పార్కుకు రోజుకు వందలాదిగా వాకర్స్, సందర్శకులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఇక్కడ పార్కింగ్ నరకప్రాయంగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితుల్లో ఇందుకు పరిష్కారంగా మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణాలను అందుబాటులో తేవడానికి ప్రతిపాదనలు రూపొందించారు. త్వరలోనే ఇక్కడ మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణాల కోసం అధికారులు సిద్ధమవుతున్నారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంగా వీటి నిర్మాణానికి ముందుకువస్తున్నారు. విదేశీ నగరాల తరహాలో ఇక్కడ పార్కింగ్ స్థలాల్లో మరిన్ని వాహనాలు పార్కింగ్ చేసేవిధంగా తీర్చిదిద్దేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో పార్కింగ్‌ల కోసం ఖాళీ స్థలాలు గుర్తించాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాలను అందుబాటులోకి తేవడానికి సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించిన సర్వేను ట్రాఫిక్ పోలీసులు చేస్తున్నారు. ప్రతిపాదనలను సంబంధిత అధికారులకు పంపించేందుకు సిద్ధమవుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



హిమాయత్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో లభ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు... కానిస్టేబుల్ శ్రవణ్, హోంగార్డ్ అస్లాంలు హిమాయత్‌నగర్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఆయిల్ సీడ్ క్వార్టర్స్ కంపౌండ్ వాల్ వద్ద వన్ ప్లస్ షోరూమ్‌కి ఎదురుగా ఒక గుర్తు తెలియని మృతదేహం పడి ఉందని గమనించారు. మృతుడికి సుమారు 55 సంవత్సరాల వయసు ఉటుంది. అనారోగ్య కారణాలతో వ్యక్తి మరణించినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

క్లుప్తంగా...

మరో రూ. రెండు వేల కోట్ల రుణం

బాండ్ల వేలం వేసి ఆర్‌బీఐ ద్వారా సర్కారు సేకరణ

సాక్షి, హైదరాబాద్: ఈ నెలలో తెలంగాణ ప్రభుత్వరుణాలు రూ.2 వేల కోట్లకు చేరనున్నాయి. రుణాల కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ద్వారా సెక్యూరిటీ బాండ్ల వేలం వేస్తోంది. ఈ మొత్తంలో రూ.వెయ్యికోట్లను ఈ నెల 16వ తేదీన తీసుకోగా, మరో రూ.వెయ్యి కోట్లను 23న సమకూర్చుకోనుంది. ఈ మేరకు ఆర్‌బీఐ షెడ్యూల్ విడుదల చేసింది. గత డిసెంబర్‌లో రూ.1,400 కోట్ల రుణాలను బహిరంగ మార్కెట్‌లో సేకరించిన ప్రభుత్వం జనవరిలో మరో రూ.రెండు వేల కోట్లను సమకూర్చుకోనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ అప్పుల పద్దు రూ.3,400 కోట్లకు చేరనుంది.

వ్యవసాయేతర రుణాలను వసూలు చేయాలి

మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: డీసీసీబీలు, ప్యాక్స్‌ల్లో వ్యవసాయేతర రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని ఎగవేతదారుల నుంచి బకాయిలను వసూలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పర్యటన సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు ప్యాక్స్ నిబంధనలకు విరుద్ధంగా రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించనివారిపై కఠినచర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్యాక్స్‌లను బలోపేతం చేయాలని కోరారు. తమది రైతు ప్రభుత్వమని, రైతుల మేలు కోరే ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గుగ్గిళ్ల నరేశ్(32) చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి కొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ధనుంజయ్య తెలిపారు.

తెలంగాణకు మరిన్ని కేంద్ర సంస్థలు



ఇన్వెంటివ్-2024 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ఐఐటీ హైదరాబాద్‌లో ఇన్వెంటివ్-2024 ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

- వెయ్యి కోట్లతో సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశాం
- అభివృద్ధి భారత్ లక్ష్యాన్ని సాధించడానికి స్టార్టప్‌లే వెన్నెముక
- దేశాన్ని మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చాలని పిలుపు
- ఐఐటీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: డిజిటైజేషన్, డిస్టెన్స్ లెర్నింగ్ మెథడాలజీ, ఆన్‌లైన్ అప్రోచ్, డిజిటల్ నెట్ వర్కింగ్ వంటి అంశాలకు సంబంధించి తెలంగాణలో కేంద్ర సంస్థలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. తెలంగాణలో ఇటీవలే రూ.వెయ్యి కోట్లతో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రాచీన భారతం ఎన్నో ఆవిష్కరణలకు భూమికగా నిలిచిందని.. ఆధునిక భారతం విశ్వమిత్రగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. 'జై విజ్ఞాన్, జై అనుసంధాన్' నినాదంతో దేశయువత భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ లీడర్‌గా మారుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఉన్నత విద్యా సంస్థల రెండో ఎడిషన్ 'ఇన్వెంటివ్, ఆర్‌అండ్‌డీ ఇన్నోవేషన్ ఫెయిర్'ను ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజుల ఈ సదస్సులో ఐఐటీలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థలు కలిపి మొత్తం 53 విద్యా సంస్థల నుంచి 120 ఆవిష్కరణలను ప్రదర్శనకు పెట్టారు. హెల్త్‌కేర్, అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, క్లైమేట్ చేంజ్, ఈ-మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, డిఫెన్స్ అండ్ స్పేస్, ఇండస్ట్రీ 4.0 తదితర ఇతివృత్తాలతో వీటిని రూపొందించారు.

దేశాన్ని తయారీ కేంద్రంగా మారుస్తాం

ప్రజల రోజువారీ జీవితంలో ఉపయోగపడేలా సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఐఐటీలకు ప్రధాని మోదీ సూచించినట్టు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గుర్తు చేశారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న కల సాకారంలో స్టార్టప్ కంపెనీలు వెన్నెముకగా నిలుస్తాయని.. ఇన్వెంటివ్-2024 వంటి సమావేశాలు రోడ్ మ్యాప్‌గా ఉపయోగపడతాయని చెప్పారు. నూతన ఆవిష్కరణలు మరింత పెరిగేలా విద్యాసంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ అంతా సహకారం అందించాలని కోరారు. దేశ జీడీపీలో కనీసం 25 శాతా నికి దోహదపడేలా భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడమే లక్ష్యమని వివరించారు. ఆ దిశగానే 'మేక్ ఇన్ ఇండియా, ఇన్వెస్ట్ ఇన్ ఇండియా, పీఎల్‌ఐ స్కీమ్, ఎఫ్‌డీఐ లిబరలైజేషన్'వంటి విధానాలను కేంద్రం తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డొమైన్‌లో 46 శాతం గ్లోబల్ డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయని, మనదేశం ఇన్నోవేషన్‌కు ఇంక్యుబేటర్‌గా మారిందని చెప్పారు. 2014లో 350 స్టార్టప్ కంపెనీలు ఉంటే.. ఇప్పుడవి లక్షా 20వేలకు చేరాయన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలు

విద్యార్థుల ఆత్మహత్యలు సమాజానికి మంచిది కాదని కేంద్ర మంత్రి అన్నారు. ఐఐటీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాయన్నారు.

పెట్టుబడుల కోసం అదానీని కలిస్తే తప్పేంటి?

- బావ బావమరిది పోటీపడి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు
- డిపాజిట్లు రావనే బీజేపీ నేతలతో మంతనాలు: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడుల కోసం, పరిశ్రమల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో పారిశ్రామికవేత్త అదానీని కలిస్తే తప్పేంటని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. దాన్ని కూడా విమర్శిస్తున్నారని, ఆ మాత్రం కామన్‌సెన్స్ కేటీఆర్‌కు లేదా అని జూపల్లి నిలదీశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కి చెందిన బావ బావమరుదులు హరీశ్, కేటీఆర్ పోటీపడి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం బీఆర్‌ఎస్ తెర వెనుక యత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు రావని నిర్ధారించుకున్న తర్వాతే బీఆర్‌ఎస్‌ను బతికించుకునేందుకు బీజేపీ నేతలతో మంతనాలు సాగిస్తున్నారని విమర్శించారు.

హరీశ్‌వి ఝూటా మాటలు

కేసీఆర్ బంగారు పళ్లెంలో పెట్టి రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టారంటూ హరీశ్ ఝూటా మాటలు మాట్లాడుతున్నారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ రూ.ఏడు లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచారని, ఆయన నిర్వాకాన్ని మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రజల ముందు బట్టబయలు చేశామన్నారు. ఇంత అప్పుల భారం ఉన్నా ప్రజల కిచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అత్యధిక స్థానాలను హస్తగతం చేసుకుంటుందన్నారు.

గల్ఫ్ ఏజెంట్ల ఇంట్లో సీఐడీ సోదాలు

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలోని ముగ్గురు గల్ఫ్ ఏజెంట్ల ఇళ్లలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో కొన్ని పాస్‌పోర్టులు, నకిలీ ధ్రువపత్రాలు, స్టాంపులతో పాటు ఓ గల్ఫ్ ఏజెంట్ ఇంట్లో రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సోదాలు జరిగాయి. కోరుట్లకు చెందిన అశోక్‌రావు, చాంద్, ఖమర్‌లు కొన్నేళ్లుగా పాస్‌పోర్టులు ఇప్పిస్తూ గల్ఫ్ ఏజెంట్లుగా చెలామణి అవుతున్నారు. ల్యాప్‌టాప్‌లు, బ్యాంక్ అకౌంట్ బుక్‌లు, పదోతరగతి మెమోలు, బోనఫైడ్ సర్టిఫికెట్లు, స్టాంపులు, ఇతరత్రా నకిలీ ధ్రువపత్రాలు స్వాధీనం చేసుకొని ముగ్గురు ఏజెంట్లతో పాటు, ఓ ఏఎస్‌ఐని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించినట్టు తెలిసింది.

నకిలీ పాస్‌పోర్టు ఆధారంగా..

నెలరోజుల క్రితం జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడి ఎయిర్‌పోర్టులో అతడిది నకిలీ పాస్‌పోర్టు అని గుర్తించిన ఇమిగ్రేషన్ అధికారులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఇండియన్ ఎంబసీకి సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం మేర కు అప్రమత్తం అయిన హైదరాబాద్ పోలీసులు కేసును సీఐడీకి అప్పగించినట్టు సమాచారం. నకిలీ పాస్‌పోర్టు జారీ చేసే సమయంలో సదరు ఏఎస్‌ఐ జగిత్యాల స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్నాడు.

నకిలీ ధ్రువపత్రాల ఆరోపణలు

అశోక్‌రావు, చాంద్, ఖమర్‌లు పదేళ్లక్రితం పాస్‌పోర్టులు ఇప్పించే సమయంలో కంపెనీలు వీసాల కోసం జతచేసే ఈసీఎన్‌ఆర్ క్లియరెన్స్‌కు దరఖాస్తుదారు చదువుకోకున్నా, కొన్ని విద్యా సంస్థలకు చెందిన నకిలీ ధ్రువపత్రాలు తయారు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా నకిలీ పత్రాలతో పదోన్నతులు పొందిన కొంతమంది ఉపాధ్యాయులు సైతం రివర్షన్‌కు గురయ్యారని సమాచారం. మళ్లీ నకిలీ ధ్రువపత్రాలు తయారుచేస్తున్నారన్న సమాచారంలో సీఐడీ అధికారులు సోదాలు చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు పెంచండి

- సోలార్ విద్యుత్ వినియోగం, ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి: భట్టి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులను ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు ఇంధన పొదుపులో భాగంగా మార్కెట్లోకి వస్తున్న విద్యుత్ వాహనాలకు చార్జింగ్ అందించడానికి అన్ని ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్లు నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న సౌర, పవన, జల విద్యుత్ ఉత్పత్తి కార్యక్రమాలపై డిప్యూటీ సీఎం శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత రాకుండా సౌర విద్యుత్‌ను పెద్ద మొత్తంలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్రంలోని జలాశయాలపై సోలార్ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ రూఫ్‌టాప్ సిస్టం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సంప్రదాయేతర ఇంధన విద్యుదుత్పాదనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే పరిశీలించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

ఆ రాయితీలను ప్రజలకు వివరించండి

రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచడానికి గృహ వినియోగదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. గృహ వినియోగదారులు ఒక కిలో వాట్ సౌర విద్యుత్ ఉత్పత్తి ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే..రూ. 18 వేలు రాయితీ ప్రభుత్వం ఇస్తున్న విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. మూడు కిలో వాట్స్ నుంచి పది కిలో వాట్స్ వరకు కిలో వాట్ కు రూ. 9 వేలు లెక్కన ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

బీసీల బడ్జెట్ రూ. 20 వేల కోట్లకు పెంచాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రమిచ్చిన ఎంపీ కృష్ణయ్య



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: వచ్చే బడ్జెట్‌లో బీసీల కేటాయింపులను రూ.20 వేల కోట్లకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, కోట్ల శ్రీనివాస్, టి.రాజ్‌కుమార్ శుక్రవారం సచివాలయంలో మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. బీసీల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని భట్టికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, బీసీ బంధు పథకం ప్రవేశపెట్టాలని కోరారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలని, 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో రూ.2వేల కోట్లు కేటాయించాలని విన్నవించారు. బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని కోరారు. మెస్ చార్జీలు, స్కాలర్ షిప్స్‌ను పెంచాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు.

విమానాల్లో నాణ్యమైన భోజనం ఇవ్వాలి

- క్యాటరింగ్ సంస్థలకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: విమాన ప్రయాణికులకు అందజేసే ఇన్‌ఫ్లైట్ భోజనం విషయంలో కచ్చితమైన నాణ్యతాప్రమాణాలను పాటించాలని ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) సంబంధిత సంస్థలను ఆదేశించింది. విమానాల్లో ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందజేసే క్యాటరింగ్ సంస్థలు, ఎయిర్‌లైన్స్ సంస్థలతో ఈ నెల 16వ తేదీన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహార పదార్థాల నాణ్యత, నిబంధనల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు ఇచ్చే ఆహారం ఎంతో సురక్షితంగా, నాణ్యమైనదిగా ఉండాలని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సూచించింది. ఆహార భద్రత, ప్రమాణాల మేరకు లేబులింగ్, డిస్‌ప్లే స్పష్టంగా ఉండాలని, ఈ మేరకు 2020లో విధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్ని విమాన క్యాటరర్లు, విమానయాన సంస్థలను ఆదేశించింది. ప్రయాణ సమయంలో అందజేసే ఆహార పదార్థాల పూర్తి వివరాలు ప్రయాణికులకు ఇవ్వాలని ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆదేశించారు. దీంతో క్యాటరింగ్ సేవల్లో పారదర్శకత పెరుగుతుందన్నారు. మరోవైపు ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

లండన్ షార్డ్‌లో రేవంత్‌రెడ్డి, అక్బరుద్దీన్




సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి లండన్ షార్డ్‌ను సందర్శించారు. అక్కడ నుంచి లండన్ అర్బన్ లేఅవుట్, అభివృద్ధిని ఏరియల్‌వ్యూ ద్వారా పరిశీలించారు. 72 అంతస్తుల పైభాగంలో, 309 మీటర్ల పొడవు (1,016 అడుగులు) ఎత్తు నుంచి, నిండుగా ఉన్న థేమ్స్ నది లండన్ ఉత్తర- వైపున ప్రాచీన నగరంతో ఆధునిక పశ్చిమ భాగాన్ని కలుపుతున్న వైనాన్ని పరిశీలించారు.

సాక్షి రియల్టీ

2,707 ఎకరాల లావాదేవీలు!

- ఇందులో 1,945 ఎకరాలు గృహ నిర్మాణాల కోసమే
- దక్షిణాది నగరాల్లోనే అత్యధిక లావాదేవీలు
- 29 ఒప్పందాలలో 765.91 ఎకరాలు సేకరణ
- హైదరాబాద్‌లో 10 డీల్స్‌లో 143.26 ఎకరాల కొనుగోలు
- అనరాక్ గ్రూప్ నివేదికలో వెల్లడి



ప్రధాన నగరాలలో భూ లావాదేవీలు

నగరం	ఒప్పందాలు	ఎకరాలు
ఎన్‌సీఆర్	22	190.81
ఎంఎంఆర్	25	289.59
బెంగళూరు	11	424.35
హైదరాబాద్	10	143.26
పుణే	6	49.34
చెన్నై	7	198.3
కోల్‌కతా	3	24.88

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలు, వడ్డీ రేట్ల పెరుగుదల, ప్రతికూల పరిస్థితులు ఇవేవీ భూ క్రయవిక్రయాలపై ప్రభావం చూపించలేకపోయాయి. 2023లో దేశంలో 97 ఒప్పందాలలో 2,707 ఎకరాల లావాదేవీలు జరిగాయి. ప్రధాన నగరాలలో గృహాలకు డిమాండ్ పెరుగుతుండటంతో లావాదేవీలలో 72 శాతం భూములను నివాస సముదాయాల నిర్మాణాల కోసమే జరిగాయని అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడించింది.

- మెట్రో నగరాలలో కంటే ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలలోనే భూ క్రయవిక్రయాలు ఎక్కువగా జరిగాయి. దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో 84 ఒప్పందాలలో 1,320.53 ఎకరాల లావాదేవీలు జరగగా.. పట్టణాలలో 13 డీల్స్‌లో 1,386.72 ఎకరాల ట్రాన్సాక్షన్స్ జరిగాయి. అత్యధికంగా బెంగళూరులో 11 డీల్స్‌లో 424.35 ఎకరాల లావాదేవీలు జరగగా.. అత్యల్పంగా కోల్‌కతాలో మూడు ఒప్పందాలలో 24.88 ఎకరాలు పూర్తయ్యాయి.
- గతేడాది పూర్తయిన భూ లావాదేవీలలో అత్యధికంగా నివాస సముదాయాల కోసమే కేటాయించారు. 74 డీల్స్‌లో 1,945.49 ఎకరాలు ఓపెన్ ప్లాట్లు, గృహ నిర్మాణాల కోసమే కొనుగోలు చేయగా.. 564.75 ఎకరాలు పారిశ్రామిక, తయారీ, లాజిస్టిక్ పార్క్‌ల కోసం, 126.16 ఎకరాలు మిశ్రమ నిర్మాణాల అభివృద్ధి కోసం, 27.5 ఎకరాలు వాణిజ్య సముదాయాలు, ఐటీ పార్క్‌ల కోసం, 43.35 ఎకరాలు రిటైల్ స్టోర్లు, హోటళ్ల కోసం కేటాయించారు.

దక్షిణాది నగరాల్లోనే ఎక్కువ..

దక్షిణాది నగరాలలోనే ఎక్కువ భూ క్రయవిక్రయాలు జరిగాయి. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో 29 ఒప్పందాలలో 765.91 ఎకరాల లావాదేవీలు జరిగాయి. ఎన్‌సీఆర్, ముంబై, పుణే, కోల్‌కతా నగరాలలో 56 డీల్స్‌లో 554.62 ఎకరాల ట్రాన్సాక్షన్స్ పూర్తయ్యాయి. హైదరాబాద్‌లో 10 ఒప్పందాలలో 143.26 ఎకరాల లావాదేవీలు జరిగాయి. గతేడాది మూడో త్రైమాసికంలో రాజపుష్ప ప్రాపర్టీస్ 3.2 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. దీని విలువ సుమారు రూ.362 కోట్లు. ఈ స్థలంలో నివాస సముదాయ నిర్మాణం కోసం కేటాయించింది.

నగర వార్తలు

వామ్మో.. కూరగాయలు!

- ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.80-100
- రానున్న వేసవిలో ధరలకు మరింత రెక్కలు
- నగర శివారు నుంచి తగ్గిన దిగుమతులు
- కూరగాయల నిల్వకు ప్రత్యామ్నాయం ఎక్కడ?
- అంతా కమీషన్ ఏజెంట్ల మాయాజాలం
- పట్టించుకోని మార్కెటింగ్ అధికారులు



సాక్షి సిటీబ్యూరో: మార్కెట్‌లో కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామన్య ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జనవరి నెలలోనే కూరగాయలు ధరలు ఇలా ఉంటే రాన్ను వేసవిలో ధరలు ఏ స్థాయిలో పెరుగుతాయని జనం ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో నిలకడగా ఉన్నా కూరగాయల ధరలు ఈ నెల ప్రారంభంతోనే ఒకేసారి భగ్గుమంటున్నాయి. ధరలు ఈ స్థాయిలో పెరిగితే ఇక వచ్చే మే, జూన్, జూలై నెలలో ధరలు ఆకాశాన్నంటుతాయని మార్కెట్ వర్గాల అంచనా.. టమాటా ధర తప్ప అన్ని రకాల కూరగాయల ధరలు రైతు బజార్లతో పాటు బహిరంగ మార్కెట్‌లలో కిలో రూ.80-100 దాటాయి. మార్కెటింగ్ శాఖ అధికారులు కూరగాయల ధరలను నియంత్రించడానికి ఎన్ని చర్యలు తీసుకున్నా ధరలు మాత్రం రోజు రోజుకూ పెరుగుతునే ఉన్నాయని వినియోగదారులు చెబుతున్నారు.

నగర శివారు నుంచి తగ్గిన దిగుమతులు

నగర శివారు జిల్లాలైన వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ రైతులు కూరగాయలు పండించడంతో ఎక్కువ దిగుమతి అయ్యాయి. దీంతో కూరగాయల ధరలు నవంబర్, డిసెంబర్ వరకు ధరలు తక్కువగా ఉన్నాయి. అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుంచి కూడా కూరగాయల దిగుమతులు ఎక్కువగా ఉండటంతో ధరలు ఎక్కువగా పెరగలేదు. డిసెంబర్ కంటే ముందు వరకు కూరగాయల ధరలు కిలో రూ.50 నుంచి రూ.60 వరకు రైతు బజార్‌లలో ధరలు ఉన్నాయి.

ప్రత్యామ్నాయం అంటూ లేదు..

సీజన్‌లో కూరగాయలు ఎక్కువ దిగుబడి అయితే వాటిని నిల్వ చేసి ఆఫ్‌సీజన్‌లో ధరలు నిలకడగా ఉంచడానికి మార్కెటింగ్, ఉద్యాన శాఖ వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. మార్కెటింగ్ శాఖ ద్వారా కూరగాయల రేట్ల నిర్ధారణ లేదు. ఆఫ్ సీజన్‌లో మార్కెటింగ్ శాఖ ద్వారా కాకుండా ఏజెంట్లు రాష్ట్రంలో నుంచి అందుబాటులో లేని కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేస్తారు. ఏజెంట్లు నిర్ధారించిన ధరల్లోనే ఆఫ్ సీజన్‌లో కూరగాయలు అందుబాటులో ఉంటాయి.

కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్‌లో..

టమోటా కిలో రూ.30 వంకాయ రూ.80, బెండ రూ.100, పచ్చిమిర్చి రూ.80, కాకరకాయ రూ.80, బీరకాయ రూ.100, కాలిఫ్లవర్ రూ.80, క్యాబేజీ రూ.60, క్యారెట్ రూ.80, దొండ రూ.90, ఆలుగడ్డ రూ.65, గోకర రూ.80, దోస రూ.80, సొరకాయ రూ.80, పొట్లకాయ రూ.40, చిక్కుడు రూ.120, అర్వి రూ.80, చిలుకడ దుంప రూ.80, బీట్‌రూట్ రూ.60, కీర రూ.60, బీన్స్ రూ.100 క్యాప్సికమ్ రూ.40.

ఓటరు నమోదు, మార్పు చేర్పులు

- నేడు, రేపు స్పెషల్ క్యాంపెయిన్

సాక్షి, సిటీబ్యూరో: ఓటరు జాబితాలో పేరు లేని వారు నమోదు చేసుకునేందుకు, చిరునామా మార్పులు, పొరపాట్ల సవరణ, తదితర కార్యక్రమాల కోసం ఈ నెల 20, 21 తేదీల్లో (శని, ఆదివారాలు)స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బూత్‌లెవల్ అధికారులు సంబంధిత ఫారాలతో ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రెండు విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందం



అవగాహన ఒప్పందాలను మార్చుకుంటున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం రెండు విశ్వవిద్యాలయాలతో పని చేసేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ యూనివర్సిటీ(కుఎల్‌యూ)తో ఎమర్జింగ్ ఏరియాల్లో పరిశోధన కోసం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. పీజేటీఎస్‌ఏయూ తరపున రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ, కేఎల్‌యూ తరపున డాక్టర్ రామకృష్ణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. పీజీ, పీహెచ్‌డీ కోర్సుల బోధన, పరిశోధనల్లో సహకారం, విద్యార్థులు, ఫ్యాకల్టీల పరస్పర మార్పిడీకి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. ఈ రెండు విశ్వవిద్యాలయాలు ప్రాథమికంగా ఆరు అంశాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. రెండవది గుజరాత్‌కు చెందిన జీఆర్‌ఏ ఎక్స్‌పోర్ట్స్‌తోనూ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తెలంగాణ సోనా అమ్మకానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని రిజిస్ట్రార్ వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ సీమ, డాక్టర్ అనిత, దీపక్ హిలాని పాల్గొన్నారు.

21 నుంచి కోటి ప్రత్యాంగిర మహాయాగం

కవాడిగూడ: కూర్తాలం శంకరాచార్యులు పరమహంస పరివ్రాజక చార్యులు, జగద్గురు సిద్ధేశ్వర నంద భారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా శ్రీసిద్ధేశ్వర పీఠం కుర్తాలం ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దేశంలోనే తొలిసారిగా 108 హోమకుండాలతో, 25వేల కిలోల ఎండు మిరపకాయలతో కోటి ప్రత్యాంగిర మహాయాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పీఠం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మాచర్ల శశిభూషణ్, ధర్మాధికారి వల్లూరి శివ కోటేశ్వర్‌రాజు, కోఆర్డినేటర్ మునిపల్లే శ్రీనివాస్, పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మలు తెలిపారు.

ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న యాగ ఏర్పాట్లను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు యాగం నిర్వహిస్తామని, 6.30 తర్వాత భక్తి సంగీతం, శ్రీలలిత, శ్రీ విష్ణు, సౌందర్యలహరి, శ్రీహనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయని తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 7.30 గంటలకు వివిధ దేవతామూర్తుల కల్యాణ మహోత్సవం నిర్వహించిన అనంతరం శ్రీసిద్ధేశ్వర నంద భారతి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ రంగారెడ్డి రీజనల్ మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 23వ తేదీ రాత్రి 8 గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా 24వ తేదీ సాయంత్రం అరుణాచలం చేరుకుంటాయి. 25వ తేదీ దర్శనం అనంతరం 26వ తేదీ ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటాయి. ఆర్టీసీ ఏజెంట్లు, లేదా ఆర్టీసీ వెబ్‌సైట్ www.tsrtconline.in లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. టికెట్ చార్జీ బీహెచ్‌ఈఎల్ నుంచి రూ.3,800, ఎంజీబీఎస్ నుంచి రూ.3,600 చార్జీ ఉంటుంది. బీహెచ్‌ఈఎల్‌లో సాయంత్రం 6 గంటలకు ఈ బస్సు బయలుదేరుతుంది. ఎంజీబీఎస్ నుంచి రాత్రి 6-8 గంటలకు బయలుదేరుతుంది.

'ఎల్వీప్రసాద్'లో ఓక్యులర్ ఫార్మకాలజీ రీసెర్చ్ సెంటర్



రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథులు

బంజారాహిల్స్: కంటి వ్యాధుల అధ్యయనమే లక్ష్యంగా ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ చిగురుపాటి నాగేశ్వరరావు ఓక్యులర్ ఫార్మకాలజీ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించారు. గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. దేశంలోని నేత్ర ఔషధ పరిశోధనను విప్లవాత్మకంగా మార్చడానికి ఈ కేంద్రం సిద్ధంగా ఉందని ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఓక్యులర్ ఫార్మకాలజీ రీసెర్చ్ హెడ్ డాక్టర్ సంహితా రాయ్ తెలిపారు. ముఖ్యంగా ఓక్యులర్ ఫార్మకోలాజికల్ రీసెర్చ్‌లో మరింత పురోగతి సాధించేందుకు ఈ కేంద్రం ఎంతగానో సహాయపడుతుందన్నారు. చికిత్స ప్రభావాలను అర్థం చేసుకోవడం, శుద్ధి చేయడం, కొత్త ఔషధాలను రూపొందించడం ఈ కేంద్రం లక్ష్యాలుగా చెప్పారు. రేపటితరం శాస్త్రవేత్తలకు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు విద్య, శిక్షణ ఇవ్వడానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి, ఎల్వీ ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ చైర్ డాక్టర్ ప్రశాంత్‌గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

డ్రోన్ ద్వారా వైద్యసేవలపై ట్రయల్‌రన్



రామన్నపేట: వివిధ రకాల రక్తపరీక్షలకు సంబంధించిన నమూనాలను ల్యాబ్‌లకు చేరవేయడానికి ఉపయోగించే డ్రోన్ శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వాసుపత్రికి చేరింది. ఆసుపత్రి ఆవరణలో టెక్నీషియన్లు ట్రయల్ రన్ నిర్వహించారు. పీహెచ్‌సీల నుంచి ఏరియా ఆసుపత్రికి, ఏరియా ఆసుపత్రి నుంచి జిల్లా ఆసుపత్రికి, బీబీనగర్ ఎయిమ్స్ వంటి ప్రధాన ఆసుపత్రుల్లోని ల్యాబ్‌లకు సకాలంలో రక్త నమూనాలను చేరవేసి సత్వర నివేదిక పొందడానికి డ్రోన్ దోహదపడుతుందని వైద్య సిబ్బంది తెలిపారు. డ్రోన్‌తో టీ హబ్‌లో పొందుపరిచిన 140 రకాల రక్తపరీక్షలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సెర్బియా ఆహ్వానం

- ఫిబ్రవరిలో బెల్‌గ్రేడ్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ టూరిజం ఫెయిర్
- 'అడ్వెంచర్ బిగిన్స్ హియర్' అనే థీమ్‌తో జరుగనున్న ఐటీఎఫ్



సాక్షి, న్యూఢిల్లీ : కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి సెర్బియా దేశ పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 22 నుంచి 25 వరకు సెర్బియాలోని బెల్‌గ్రేడ్‌లో జరగనున్న 45వ ఇంటర్నేషనల్ టూరిజం ఫెయిర్ (ఐటీఎఫ్)కు హాజరుకావాలని సెర్బియా పర్యాటక శాఖ మంత్రి హుసేన్ మెమిక్ ఆహ్వాన పత్రాన్ని పంపించారు. 'అడ్వెంచర్ బిగిన్స్ హియర్'అనే థీమ్‌తో జరగనున్న ఐటీఎఫ్ గత 30 ఏళ్లుగా యూరప్, సెర్బియా ప్రాంతాల్లో పర్యాటక రంగాభివృద్ధికి జరిగే అతిపెద్ద కార్యక్రమం. వివిధ దేశాల నుంచి పర్యాటక శాఖల మంత్రులు, ఈ రంగానికి సంబంధించిన భాగస్వామ్య పక్షాలు, పెట్టుబడిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

జర్నలిజంలో కాట్రగడ్డ అజితకు డాక్టరేట్



సాక్షి, హైదరాబాద్: జర్నలిజంలో కాట్రగడ్డ అజితకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'మారుతున్న వార్తా విలువలు- వార్తా కేంద్రాల గతిశీల మార్పులు' అనే అంశంపై ప్రొఫెసర్ కడియాల సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధనాగ్రంథాన్ని ఆమె సమర్పించారు. విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి కె.హనుమంతరావు శుక్రవారం అజితకు డాక్టరేట్ పత్రాన్ని అందజేశారు. ఆమె ప్రస్తుతం ఓ న్యూస్ చానల్‌లో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. పరిశోధనకు సహకరించి, ప్రోత్సహించిన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య తంగెడ కిషన్‌రావు, జర్నలిజం మాజీ శాఖాధిపతి ప్రొఫెసర్ వి.సత్తిరెడ్డి, సలహాలు, సూచనలు అందజేసిన ప్రొఫెసర్ సుధీర్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేశ్, జర్నలిజం పీఠాధిపతి డాక్టర్ పద్మప్రియకు అజిత కృతజ్ఞతలు తెలిపారు.





పొద్దుపొడవక ముందే పానీపాట్లు

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పల్సి–బి తండా వాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి కిలోమీటర్ దూరంలోని పంట చేలలోని వ్యవసాయ చేదబావి నుంచే కాలినడకన నీటిని తెచ్చుకుంటున్నారు. ఉదయం 5 గంటల నుంచే చేదబావి వద్ద గ్రామస్తులు బారులు తీరుతుండటం వేసవికి ముందే అక్కడి తాగునీటి కష్టాలకు నిదర్శనంగా నిలుస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్.

గ్రామీణ బాలికలు.. డాక్టరమ్మలు

మెడికల్ కోర్సులపై రాష్ట్రంలోని గ్రామీణ బాలికల ఆసక్తి

- ఆ తర్వాత టీచర్ ఉద్యోగాలకు మొగ్గు
- పోలీస్, ఆర్మీ, ఇంజనీరింగ్ వైపు అబ్బాయిల చూపు
- కేంద్ర 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్'లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల బాలికలు ఎక్కువగా వైద్య రంగం వైపే చూస్తున్నారు. 14.2 శాతం మంది డాక్టర్ కావాలనుకుంటే, మరో 25.2 శాతం మంది నర్స్ అవుదామని ఉందని చెప్పారు. అదే మగపిల్లల్లో డాక్టర్ కావాలనుకుంటున్నవారు 4.7 శాతం మందేకావడం గమనార్హం. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా చూసినా.. బాలికలు డాక్టర్, నర్స్ లేదా టీచర్ కావాలని కోరుకుంటే, బాలురు పోలీసు, ఇంజనీరింగ్, ఆర్మీ వైపు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్'లో ఈ అంశాలు వెల్లడయ్యాయి.

26 రాష్ట్రాల్లో సర్వే చేసి..

దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల్లోని 28 జిల్లాల పరిధిలో ఉన్న 1,664 గ్రామాల్లో 34,745 మంది 14–18 ఏళ్ల మధ్య వయసున్న బాలురు, బాలికలపై ఈ సర్వే చేశారు. వారి ఉద్యోగ/ఉపాధి ఆశలు, విద్యా ప్రమాణాలు, డిజిటల్ స్కిల్స్, చదువును నిజజీవితంలో ఏమేరకు అమలు చేస్తున్నారనేది పరిశీలించారు. స్కూళ్లు, కాలేజీల్లో చదువుతున్నవారితోపాటు బయటివారినీ ప్రశ్నించారు. మొత్తంగా త్వరగా జీవితంలో స్థిరపడాలనేది చాలా మంది ఆలోచనగా ఉందని, ఆ ప్రకారమే ఉద్యోగం/ఉపాధిపై దృష్టిపెడుతున్నారని కేంద్ర నివేదిక పేర్కొంది. లాక్‌డౌన్ సమయంలో కష్టాలు ఎదుర్కొన్నందున ప్రభుత్వ ఉద్యోగంపై చాలా మంది మక్కువ చూపిస్తున్నట్టు తెలిపింది. మహిళలు చదువుకున్నా ఇంటి పని తప్పదన్న ఉద్దేశంతో.. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని వివరించింది. హోటల్ మేనేజ్‌మెంట్, టైలరింగ్, బ్యూటీ పార్లర్, వ్యవసాయం వంటి వాటిపై దృష్టిసారిస్తామని బాలికలు పేర్కొన్నట్టు తెలిపింది.

రాష్ట్రంలో ఏ ఉద్యోగంపై ఎవరికి ఎంత ఆసక్తి?

బాలుర శాతం	ఉద్యోగం	బాలికల శాతం
4.7	డాక్టర్	14.2
0.5	నర్స్	25.2
3.8	ఆర్మీ	0.7
9.8	పోలీస్	4
8.9	టీచర్	15.5
8.2	ఇంజనీర్	5.2
0.9	ఐఏఎస్	1.8
2	ఐపీఎస్	0.9
4.3	ప్రభుత్వ జాబ్	1.5
2.3	ప్రైవేట్ జాబ్	0.5
4.6	క్రీడలు	0.2
5.1	వ్యవసాయం	0.6
0.2	సొంత కంపెనీలు	0.3
5.4	ఇతర ఉద్యోగాలు	4.2
2.7	ఇంటి పని	4.3
18.8	ఏమీ నిర్ణయించుకోనివారు	9.3

'తెలంగాణ' సోషల్ మీడియా లెక్కలివీ..

(దేశంలో అత్యధికంగా కేరళలో 98.8% మంది సోషల్‌మీడియాను వాడుతుండగా.. తెలంగాణ 9వ స్థానంలో ఉంది)

	దేశసగటు శాతం	రాష్ట్రంలో శాతం
సోషల్ మీడియా వాడకం	92.8	94.9
స్మార్ట్‌ఫోన్ వాడకం	94.7	84
వీడియోలను షేర్ చేయడం	89.3	88.9
యూట్యూబ్‌లో వీడియోలు చూసేవారు	81.6	74.2
ఇంటర్నెట్‌లో సమాచారం శోధించేవారు	70.9	55.5

లెక్కలు, ఇంగ్లిష్‌లో వెనుకబాటు

తెలంగాణ గ్రామీణ యువతలో 14–18 ఏళ్ల వయసు వారిలో కూడికలు, తీసివేతలు వంటి లెక్కలు చేయగలిగినవారు 21.5 శాతమేనని కేంద్ర నివేదిక పేర్కొంది. ఇంగ్లిష్‌పై కనీస అవగాహన ఉన్నవారు 41 శాతమేనని తెలిపింది. ఇక రాష్ట్రంలో పనిచేయడానికి ఆసక్తి చూపనివారిలో బాలురు 18 శాతం, బాలికలు 11.7 శాతం ఉన్నారు. పనిపై ఆసక్తి చూపనివారి విషయంలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని నివేదిక పేర్కొంది. ఈ అంశంలో దేశ సగటు రెండు శాతమే.

ఉద్యోగ భద్రతకే గ్రామీణ యువత మొగ్గు



''గ్రామీణ యువత జీవితంలో త్వరగా స్థిరపడాలని, ఉద్యోగ భద్రత కావాలనే ఆలోచనలో ఉన్నట్టు కేంద్ర నివేదిక చెప్తోంది. దానికి తగ్గట్టుగానే చాలా మంది పనిని ఎంచుకుంటున్నారు. అయితే సమాజ అవసరాలు కూడా ముఖ్యమే. పరిశోధనలు, ఉన్నత విద్య, వైద్య రంగంలో స్థిరపడటంలో ఆలస్యం కారణంగా తక్కువ మంది వాటివైపు వస్తున్నారు. పనిచేయడానికి ఆసక్తి చూపనివారూ ఎక్కువగా ఉండటం వెనుక కారణాలను అన్వేషించాలి. – డాక్టర్ కిరణ్ మాదల, సైంటిఫిక్ కన్వీనర్, ఐఎంఎ, తెలంగాణ

త్రివర్ణాలతో 'వింగ్స్'

'వింగ్స్ ఇండియా - 2024' కార్యక్రమంలో భాగంగా బేగంపేట విమానాశ్రయం వద్ద అబర్ష్ విమానాల విన్యాసాలివి. ప్రదర్శనలో రెండో రోజు శుక్రవారం వివిధ దేశాలకు చెందిన విమానాలతో నిర్వహించిన విన్యాసాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



19 మంది చిన్నారులకు రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు

- ఈ నెల 22న ప్రదానం చేయనున్న రాష్ట్రపతి ముర్ము
- ప్రధాని మోదీతో ఈ నెల 23న ముచ్చటించనున్న అవార్డు గ్రహీతలు
- తెలంగాణ నుంచి పెండ్యాల లక్ష్మీప్రియ, ఏపీ నుంచి సూర్యప్రసాద్‌కు అవార్డులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 19 మంది చిన్నారులకు 2024 సంవత్సరానికి గాను రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ నెల 22న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డు గ్రహీతలకు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. కళ, సంస్కృతి (7), శౌర్యం (1), ఇన్నోవేషన్ (1), సైన్స్ టెక్నాలజీ (1), సామాజిక సేవ (4), క్రీడలు (5).. ఇలా ఆరు కేటగిరీల్లో అందిస్తున్న రాష్ట్రీయ బాల పురస్కారాలను అందుకుంటున్న మొత్తం 19 మంది చిన్నారుల్లో 9 మంది అబ్బాయిలు, 10 మంది అమ్మాయిలు ఉన్నారు. తెలంగాణ నుంచి పెండ్యాల లక్ష్మీప్రియ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్.సూర్యప్రసాద్ బాల పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 23న ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయి ఆయనతో ముచ్చటించనున్నారు. అంతేగాక ఈ నెల 26న కర్తవ్యపథ్‌లో జరుగనున్న 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కూడా పాల్గొంటారని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ తెలిపింది.



లక్ష్మీప్రియ

లక్ష్మీ ప్రియకు కళ, సంస్కృతి కేటగిరీలో

తెలంగాణ వరంగల్ జిల్లాకు చెందిన కూచిపూడి నృత్యకారిణి పెండ్యాల లక్ష్మీప్రియ కళ, సంస్కృతి కేటగిరీలో 2024 సంవత్సర బాల పురస్కారానికి ఎంపికైంది. 14 ఏళ్ల లక్ష్మీప్రియ ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంది. 2023లో ఆమె శాస్త్రీయ నృత్యం కేటగిరీలో కళా ఉత్సవ్ జాతీయ అవార్డును గెలుచుకుంది. 2020లో ఆర్ట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కూచిపూడి, మోహిని నాట్యంలో అత్యుత్తమ ప్రదర్శనకు 'లాస్యప్రియ' బిరుదును అందుకుంది.

క్రీడల కేటగిరీలో సూర్యప్రసాద్‌కు

క్రీడల కేటగిరీలో రాష్ట్రీయ బాలపురస్కారానికి ఎంపికైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆర్.సూర్యప్రసాద్ 5 సంవత్సరాల వయస్సులోనే పర్వతారోహణ శిక్షణ తీసుకొని అసాధారణమైన ప్రయాణాన్ని ప్రారంభించాడు. 2022 ఏప్రిల్ 5 న 'మౌంట్ కిలిమంజారో'ని అధిరోహించి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. అక్కడ మౌంట్ కిలిమంజారోపై ప్రముఖ వ్యక్తుల చిత్రాలను ప్రతీకాత్మకంగా ప్రదర్శించాడు. సామాజిక సాధికారత, ప్రగతిశీల భారతదేశ దృక్పథంపై తన నిబద్ధతను చాటి చెప్పాడు.

పేదింటి పద్దు రూ.25 వేల కోట్లు!

- 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే యోచనలో ప్రభుత్వం
- తొలి ఏడాది 4 లక్షల ఇళ్లు నిర్మించే దిశగా కసరత్తు
- అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లనూ పూర్తి చేయాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నిరుపేదలకు గృహ వసతి కల్పించేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.25 వేల కోట్లు ప్రతిపాదించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అప్పట్లో తక్కువ విస్తీర్ణంలో ఆ ఇళ్లను నిర్మించగా, ఇప్పుడు రెండు పడగ్గదులతో నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం యూనిట్ కాస్ట్‌ను రూ.5 లక్షలుగా ఖరారు చేస్తూ ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన విషయం తెలిసిందే. మొత్తంగా ఐదేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల ఇళ్లను నిర్మించాలని అనుకుంటోంది. దీంతోపాటు గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేయాలని నిర్ణయించింది. వీటన్నింటికి కలిపి తొలి ఏడాదిలో రూ.25 వేల కోట్లు అవసరమవుతాయని తాజాగా అంచనాకొచ్చింది. అధికారులతో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్షించి ప్రాథమికంగా నిర్ణయించారు. దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు తిరిగి రాగానే ఆయనతో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకే రూ.20 వేల కోట్లు..

తొలి ఏడాది ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.20 వేల కోట్లు అవసరమవుతాయని అంచనాకొచ్చారు. నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లను చేపడితే ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చొప్పున ఇంత బడ్జెట్ అవసరమవుతుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం హడ్కో తదితర సంస్థల నుంచి తీసుకున్న అప్పు రూ.10 వేల కోట్లు చెల్లించాల్సి ఉంది. అందులో తొలి సంవత్సరం రూ.వేయి కోట్ల నుంచి రూ.2 వేల కోట్లను కేటాయించాలని లెక్కలు వేశారు.

అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం 2వేల కోట్లు

గత ప్రభుత్వంలో మొదలై పూర్తి కాకుండా మిగిలిపోయి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఇళ్ల నిర్మాణం కోసం రూ.2 వేల కోట్లను కేటాయించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కాగా, త్వరలో కేంద్రప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టబోతోన్న నేపథ్యంలో అందులో గృహనిర్మాణ పద్దు కింద ఎంత కేటాయిస్తుంది, ఏయే పథకాల కింద రాష్ట్రానికి ఎన్ని నిధులు వస్తాయి.. అన్న అంశాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటే బాగుంటుందన్న భావనను కూడా మంత్రులు వ్యక్తం చేస్తున్నారు.

అయోధ్యలో మన భోజనాలు సిద్ధం

- హైదరాబాద్ నుంచి తరలివెళ్లిన బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నేతలు
- ఫిబ్రవరి 28 వరకు భక్తులకు భోజన సదుపాయం
- ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు

సాక్షి, హైదరాబాద్: మరో రెండు రోజుల్లో అయోధ్యలో కొలువుదీరనున్న శ్రీరాముడి సందర్శన కోసం భారీ ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఏ ప్రాంతానికి చెందిన భక్తులకైనా మన హైదరాబాద్ వంటకాలను అందజేసేందుకు విశ్వహిందూపరిషత్, బజరంగదళ్ తదితర సంస్థలకు చెందిన స్వచ్ఛంద సేవకులు అయోధ్యకు చేరుకున్నారు. 22వ తేదీన ప్రధాన కార్యక్రమం ఉండగా.. శుక్రవారం నుంచే వీరు భక్తులకు భోజన సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకూ భక్తులకు భోజన సదుపాయాన్ని కల్పించేందుకు హైదరాబాద్‌కు చెందిన వీహెచ్‌పీ, బజరంగదళ్ సంస్థలతో పాటు, దీపక్ గోరక్ష భాగ్యనగర విభాగ్ వంటి సంస్థలు ఏర్పాట్లు చేశాయి.

మన ఇంటి భోజనం రెడీ..

'ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తారు. వారికి నచ్చిన భోజనం అయోధ్యలో లభించడం కష్టమే. అందుకే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం అల్పాహారం మొదలుకొని మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కూడా అందజేస్తున్నాం'అని బజరంగదళ్ ప్రతినిధి సుభాష్ తెలిపారు. ఆయనతో పాటు వంద మందికి పైగా కార్యకర్తలు అయోధ్యకు చేరుకున్నారు. దక్షిణాదితోపాటు ఉత్తరాది వంటకాలను కూడా తాము అందిస్తున్నామని సుభాష్ వెల్లడించారు. ఎంత మంది భక్తులు వచ్చినా భోజనాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

అంబాజీ మందిరం వద్ద భోజన సదుపాయం

అయోధ్యలోని రామమందిరానికి దగ్గర్లో ఉన్న గోలాఘట్ రోడ్, అంబాజీ మందిరం వద్ద వీరు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు ఈ భోజన సౌకర్యాన్ని వినియోగించుకోవాలని విశ్వహిందూ పరిషత్ ధర్మప్రసార్ సహ ప్రముఖ్ మధురనేని సుభాష్ చందర్ తెలిపారు.

ట్రాఫిక్ తిప్పలున్న టాప్‌-10 నగరాలివీ...

నగరం (దేశం)	ర్యాంకు	10 కిమీ జర్నీకి సమయం
లండన్ (యూకే)	1	37 నిమిషాల 20 సెకన్లు
డబ్లిన్ (ఐర్లాండ్)	2	29 నిమిషాల 30 సెకన్లు
టొరొంటో (కెనడా)	3	29 నిమిషాలు
మిలన్ (ఇటలీ)	4	28 నిమిషాల 50 సెకన్లు
లిమా (పెరూ)	5	28 నిమిషాల 30 సెకన్లు
బెంగళూరు (ఇండియా)	6	28 నిమిషాల 10 సెకన్లు
పుణే (ఇండియా)	7	27 నిమిషాల 50 సెకన్లు
బుకారెస్ట్ (రొమేనియా)	8	27 నిమిషాల 40 సెకన్లు
మనీలా (ఫిలిప్పీన్స్)	9	27 నిమిషాల 20 సెకన్లు
బ్రస్సెల్స్ (బెల్జియం)	10	27 నిమిషాలు



బెంగళూరు ట్రాఫిక్.. స్లో అబ్బా..

కాస్త పెద్ద సిటీ అయితే చాలు.. ఇంట్లోంచి బండి తీశామంటే ట్రాఫిక్‌లో ఉసూరుమంటూ ప్రయాణించక తప్పదు. అందులోనూ కొన్ని నగరాల్లో అయితే ఈ ట్రాఫిక్ కష్టాలకు అంతుండదు. మరి 2023లో ప్రపంచవ్యాప్తంగా పెద్ద నగరాల్లో ఎక్కడెక్కడ ట్రాఫిక్ సమస్య ఎలా ఉందన్న దానిపై తాజాగా 'టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్–2023' ర్యాంకులను విడుదల చేసింది. ఇందుకోసం 55 దేశాల్లోని 387 నగరాల్లో సర్వే చేసింది. నగరం లోపల నివాసం ఉండి.. రోజూ పది, పదిహేను కిలోమీటర్లు ప్రయాణించేవారిపై అధ్యయనం చేసింది. ఇందులో ప్రపంచంలోనే లండన్ నగరం టాప్‌లో నిలిచింది. అక్కడ కేవలం 10 కిలోమీటర్ల దూరానికి సగటున 37 నిమిషాల 20 సెకన్లు పడుతున్నట్టు పేర్కొంది. ట్రాఫిక్ ఎక్కువగా రోజులను కలిపితే.. ఏడాదిలో మరో 148 గంటల పాటు రోడ్డుపైనే గడుపుతున్నట్టు తెలిపింది.

ఆ నగరాల్లో 10 నిమిషాల లోపే..

టామ్‌టామ్ ఇండెక్స్‌లో పేర్కొన్న నగరాల్లో అత్యంత వేగవంతమైన ట్రాఫిక్ ఉన్న టాప్–10 నగరాలు మొత్తం అమెరికాలోనివే కావడం గమనార్హం. అక్కడి ఓక్లహామా సిటీలో 10 కిలోమీటర్ల దూరానికి కేవలం 8 నిమిషాల 40 సెకన్లే పడుతున్నట్టు నివేదిక పేర్కొంది.

- సాక్షి సెంట్రల్ డెస్క్

→ ఆ దేశంలోని నాక్స్ విల్లే, శాన్‌డియాగో, అల్బనీ, డేటన్, డెట్రాయిట్, సైరకస్, ఫ్రెస్నో, జాక్సన్‌విల్లే, ఫీనిక్స్ నగరాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ అన్ని సిటీల్లో కూడా 10 కిలోమీటర్ల ప్రయాణానికి 10 నిమిషాలలోపే సమయం పట్టినట్టు తెలిపింది.

ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి సీతక్క. చిత్రంలో ప్రొఫెసర్ కోదండరాం, జయధీర్ తిరుమలరావు తదితరులు



ఆద్యకళను పరిరక్షించుకోవాలి

జానపద, గిరిజన కళల పరిరక్షణ సదస్సులో మంత్రి సీతక్క

నాంపల్లి: ప్రాచీనమైన ఆద్యకళను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శుక్రవారం 'జానపద, గిరిజన కళలు– సంస్కృతి; అధ్యయనం- పరిరక్షణ'అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి మాట్లాడారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఆద్యకళా వస్తుప్రదర్శనను మంత్రి వీక్షించారు. అనంతరం సీతక్క ప్రసంగిస్తూ జానపద, గిరిజన కళలు, సంస్కృతిపై మరింత లోతైన విశ్లేషణ, పరిశోధన జరగాలని సూచించారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు సేకరించిన ఆద్యకళా రూపాలను భావితరాలకు అందజేసేందుకు కృషి చేస్తామని, మ్యూజియం ఏర్పాటు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు ఆద్యకళ కోసం నిరంతరం పాటుపడటం అభినందనీయమన్నారు. కాగా, ఆద్యకళా వస్తుప్రదర్శనను రాష్ట్ర సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా సందర్శించారు. కోదండరాం, తిరుమలరావు వాటి గురించి మంత్రికి వివరించారు. ఆద్యకళకు మ్యూజియం నిర్మించడమే కాకుండా ఒక యాత్రాస్థలంగా రూపొందించి తెలంగాణ సంస్కృతికి చిరునామాగా చేయాల్సి ఉందని జూపల్లి అన్నారు. ఆద్యకళకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, పలువురు కళాకారులు, సీనియర్ జర్నలిస్టులు, మేధావులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

3,500 వస్తువుల ప్రదర్శన

మనిషి జీవన విధానంలో వినియోగించిన అనేక వస్తువులు, కళాఖండాలు తెలుగు వర్సిటీ ప్రాంగణంలోని ప్రదర్శనలో కొలువుదీరాయి. ఆదిలాబాద్, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల నుంచి వివిధ రకాల పడవలు, చెక్క ధాన్యం మర, తోలు శుభ్రం చేసే లంద, పులిబోను, వివిధ రకాల ఎండ్లబండ్లు, సంగీత వాయిద్యాలు, లోహ కళాకృతులను సేకరించారు. ఈ ప్రదర్శనలో సుమారు 3,500 వస్తువులు ఉంచారు. 'సేకరించిన వస్తువులను భద్రపరిచి భావితరాలకు అందజేసే ప్రయత్నం జరగాలి. ఆద్యకళా రూపాల కోసం ఒక శాశ్వతమైన మ్యూజియం ఏర్పాటుకు గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వమైనా సహకరిస్తుందని ఆకాంక్షిస్తున్నాను'అని తిరుమలరావు అన్నారు.

అయోధ్యకు 15 ప్రత్యేక రైళ్లు

- ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఏర్పాటు
- వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ తదితర సంస్థల ఆధ్వర్యంలో రైళ్ల నిర్వహణ



సాక్షి, హైదరాబాద్: అయోధ్యకు వెళ్లే భక్తులకు ఈ నెల 29వ తేదీ నుంచి ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. శ్రీరాముడిసందర్శనకు వెళ్లే భక్తుల రద్దీకి అనుగుణంగా ఫిబ్రవరి 28 వరకు సికింద్రాబాద్ మీదుగా 15 రైళ్లు నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. సాధారణ ప్రయాణికులు ఈ రైళ్లలో నేరుగా బుకింగ్ చేసుకొనే సదుపాయం ఉండదు. విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్, తదితర ధార్మిక సంస్థల ద్వారా మాత్రమే భక్తులకు రైల్వేసేవలు లభిస్తాయని ఐఆర్‌సీటీసీ అధికారి ఒకరు తెలిపారు. భక్తులను అయోధ్యకు తరలించేందుకు, తిరిగి హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు వీలుగా వీహెచ్‌పీ తదితర సంస్థలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. మరోవైపు ఈ నెల 22వ తేదీన జరగనున్న బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి నేరుగా వెళ్లేందుకు ఎలాంటి రైళ్లు అందుబాటులో లేవని అధికారులు తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో మూడు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తారు. ఫిబ్రవరిలో మరో 12 రైళ్లు నడుపుతారు. ''ఈ నెల రోజుల వ్యవధిలో అయోధ్య సందర్శనకు తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే భక్తుల కోసం మొత్తం 60 రైళ్లు సిద్ధం చేస్తున్నాం. వాటిలో హైదరాబాద్ నుంచే 15 రైళ్లు నడుస్తాయి.'' అని ఒక అధికారి వివరించారు. ఈ రైళ్లలో స్లీపర్ కోచ్‌లే ఎక్కువగా ఉంటాయి. హైదరాబాద్ నుంచి అయోధ్య వరకు చార్జీ రూ.1500 వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

మార్చి నుంచి ఐఆర్‌సీటీసీ ప్యాకేజీలు

ఐఆర్‌సీటీసీ అయోధ్య ప్యాకేజీలు మాత్రం మార్చి నుంచి అందుబాటులోకి రానున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరే భక్తులు అయోధ్య రాముడిని సందర్శించుకోవడంతో పాటు, స్థానిక ఆలయాల సందర్శన, భోజనం, వసతి, రోడ్డు రవాణా, తదితర సదుపాయాలతో ఐఆర్‌సీటీసీ ప్యాకేజీలు రూపొందించేందుకు కసరత్తు చేపట్టినట్టు ఆ సంస్థకు చెందిన అధికారులు చెప్పారు.


'సామాజిక సమతా సంకల్ప సభ'కు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి



"ఎన్నటికీ మరణం లేని మహనీయుడు అంబేడ్కర్‌ను తలుచుకుంటూ తరతరాలుగా స్ఫూర్తి పొందుతున్నాం. అభివృద్ధి - అభ్యుదయానికి మధ్య అవినాభావ సంబంధం అంబేడ్కర్ భావజాలం. మనం అదే భావజాలంతో పనిచేస్తుంటే రాష్ట్రంలో పెత్తందార్ల పార్టీలకు, పెత్తందార్ల నాయకులకు నచ్చట్లేదు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ, నా అగ్రవర్ణ పేదలకు మంచి చేయడానికి సామాజిక న్యాయ విప్లవం తెచ్చానని చెప్పేందుకు గర్విస్తున్నా"
- ఏపీ ముఖ్యమంత్రి జగన్

పెత్తందారీ పోకడలూ అంటరానితనమే

కుల అహంకార వ్యవస్థలపై నా పోరాటానికి అంబేడ్కరే స్ఫూర్తి: సామాజిక సమతా సంకల్ప సభలో ఏపీ సీఎం జగన్

- 77 ఏళ్ల స్వాతంత్య్రం తర్వాత కూడా వివక్ష ఇంకా సమసి పోలేదు
- రూపం మార్చి.. బరి తెగించిన దురహంకారులు పెత్తందారులు
- పేద కులాలు ఎప్పటికీ తమ పనివారుగా, సేవకులుగానే ఉండాలట
- చివరికి చరిత్రను కూడా వక్రీకరిస్తూ ఈనాడు దారుణమైన రాతలు
- అంబేడ్కర్ తెలుగు మీడియం మాత్రమే ఉండాలని అన్నట్టు పెత్తందార్ల పత్రిక వక్రీకరణలు.. మన 56 నెలల పాలనలో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం
- 206 అడుగుల ఎత్తుతో ఘనంగా 'సామాజిక న్యాయ మహా శిల్పం' ఆవిష్కరణ


బాబా సాహెబ్ విగ్రహ సందర్శనకు భారీగా తరలివస్తున్న జనం

సాక్షి, అమరావతి: "అంటరానితనంపై తిరుగుబాటు, విప్లవం, స్వాతంత్య్ర పోరాటాలకు ఉమ్మడి రూపమే మన బాబాసాహెబ్ అంబేడ్కర్" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్య్రం వచ్చిన 77 ఏళ్ల తర్వాత కూడా అలాంటి పరిస్థితులు వేర్వేరు రూపాల్లో ఇవాళ్టికీ ఉన్నాయని, పెత్తందారీ పోకడలతో అంటరానితనం, వివక్ష రూపం మార్చుకుని సంచరిస్తున్నాయని చెప్పారు. విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో దేశానికే తలమానికంగా నిర్మించిన రాజ్యాంగ రూపశిల్పి, భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల ఎత్తైన 'సామాజిక న్యాయ మహాశిల్పం' విగ్రహాన్ని సీఎం జగన్ శుక్రవారం రాత్రి జాతికి అంకితం చేశారు. సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణతో మన విజయవాడను చూస్తుంటే సామాజిక చైతన్యాల వాడగా కనిపిస్తోందన్నారు. అంతకుముందు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 'సామాజిక సమతా సంకల్ప సభ'లో మాట్లాడుతూ కుల అహంకార వ్యవస్థల దుర్మార్గాలపై తన పోరాటానికి అంబేడ్కరే స్ఫూర్తి అని తెలిపారు.

చరిత్ర గతిని మార్చిన సంఘ సంస్కర్త

అమెరికాలోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ గురించి మనం విన్నాం. ఇక మీదట స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయ మహాశిల్పం) అంటే ఇండియాలోని విజయవాడ అని మార్మోగుతుంది. మనందరి ప్రభుత్వం ఈ 56 నెలల్లో అనుసరించిన సామాజిక న్యాయానికి ఈ విగ్రహం నిలువెత్తు నిదర్శనం. అంబేడ్కర్ జన్మించిన 133 ఏళ్ల తర్వాత, ఆయన మరణించిన 68 ఏళ్ల తర్వాత సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాం. ఇది వేల సంవత్సరాల భారత సామాజిక, ఆర్థిక, మహిళా చరిత్రలను మార్చిన ఓ సంఘ సంస్కర్త, ఓ మరణం లేని మహనీయుడి విగ్రహం. బాబా సాహెబ్ మన భావాల్లో జీవించే ఉంటారు. మన అడుగుల్లో, బతుకుల్లో, భావాల్లో ఎప్పటికీ కనిపిస్తుంటారు. పెత్తందారీతనం, అంటరానితనం, కుల అహంకార వ్యవస్థలు, అక్కచెల్లెమ్మలపై వివక్ష మీద పోరాటాలకు నిరంతరం స్ఫూర్తి అందిస్తూనే ఉంటారు ఆ మహా మనిషి.

75వ గణతంత్ర దినోత్సవానికి ముందు..

విజయవాడలో.. అది కూడా స్వాతంత్య్ర సమర చరిత్ర కలిగిన మన స్వరాజ్య మైదానంలో, 75వ రిపబ్లిక్ డేకి సరిగ్గా వారం ముందు మనం ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ మహా విగ్రహం స్ఫూర్తిదాయకం. అది చూసినప్పుడల్లా పేదలు, మహిళలు, మానవ హక్కులు, ప్రాథమిక హక్కులు, సమానత్వ ఉద్యమాలు, రాజ్యాంగ హక్కులకు నిరంతరం స్ఫూర్తి ఇస్తూనే ఉంటుంది.

పుణే ఒప్పందం.. అండనిచ్చే మహాశక్తి

ఆయన్ను ఎప్పుడు జ్ఞాపకం చేసుకున్నా అంటరానితనం, ఆధిపత్య భావజాలంపై ఓ తిరుగుబాటుగా మనకు కనిపిస్తుంటారు. సమసమాజ భావాలకు నిలువెత్తు రూపంగా మనందరికీ గుర్తుకొస్తారు. రాజ్యాంగ హక్కుల ద్వారా నిరంతరం మనల్ని కాపాడే మహాశక్తిగా మనందరికీ స్ఫూర్తిదాతగా నిలుస్తారు. గొంతు విప్పలేని దళిత వర్గాలు, అల్పసంఖ్యాకులు, అట్టడుగు వర్గాలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని, రిజర్వేషన్లు కల్పించాలని చరిత్ర గతిని మార్చిన పుణె ఒప్పందానికి కారకులు అంబేడ్కర్. ఈ రోజు దళిత జాతి నిలబడిందన్నా, అల్పసంఖ్యాకులు నిల బడగలుగుతున్నారన్నా, రిజర్వేషన్లు కల్పించి ఒక్క తాటిపైకి తెచ్చే కార్యక్రమం జరిగిందంటే అంబేడ్క రే స్ఫూర్తి.

ఆకాశమంతటి వ్యక్తిత్వం

రూపం మార్చుకున్న అంటరానితనంపై 56 నెలలుగా మనం చేస్తున్న యుద్ధానికి నిదర్శనం సామాజిక న్యాయం. మనం చేస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ యుద్ధానికి నిలువెత్తు నిదర్శనంగా అంబేడ్కర్ విగ్రహం ఎప్పటికీ కనిపిస్తుంది. ఇది దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం అని చెప్పడానికి గర్వపడుతున్నా. 81 అడుగుల వేదిక మీద 125 అడుగుల మహా విగ్రహం.. మొత్తం 206 అడుగుల ఎత్తుతో ప్రతిష్ఠించిన ఆకాశమంతటి ఆ మహానుభావుడి వ్యక్తిత్వాన్ని అంతా గుర్తు చేసుకోవాలి. ప్రతి పిల్లాడూ, ప్రతి పాపా ఆయన జీవిత చరిత్ర నుంచి స్ఫూర్తి పొందాలి. అభివృద్ధి - అభ్యుదయానికి మధ్య అవినాభావ సంబంధం అంబేడ్కర్ భావజాలం. ఇలాంటి భావజాలం పెత్తందార్లకు నచ్చదు. పెత్తందార్లంటే ఎవరో మీ అందరికీ ఈ పాటికి బాగా అర్థమై ఉంటుంది.

ఆయన చదివింది ఇంగ్లిష్ మీడియంలో..

ఈరోజు కూడా ఈ దురహంకారులు, ఈ పెత్తందార్లు తమ పత్రికలో రాశారు. అంబేడ్కర్ తెలుగు మీడియం మాత్రమే ఉండాలి అని అన్నారట. ఈ పెత్తందార్ల పిల్లలు, మనవళ్లు మాత్రం ఇంగ్లీషు మీడియంలోనే చదువుతారట. వీళ్లు అబద్ధాలు ఏ స్థాయిలో చెబుతున్నారో చూస్తుంటే బాధేస్తోంది. అంబేడ్కర్ చదువుకున్నది ఇంగ్లిష్ మీడియంలో. ఆయన 4వ తరగతి పాసైనప్పుడు బంధుమిత్రులంతా పండగ చేసుకున్నారు. ఈనాడు చివరికి చరిత్రను కూడా వక్రీకరిస్తూ రాతలు రాస్తోందంటే పాత్రికేయం ఏ స్థాయికి పడిపోయిందో ఆలోచన చేయమని కోరుతున్నా. ఈ పెత్తందార్ల పత్రిక, ఆ ఈనాడు పత్రిక ముసుగులో తాము పాటించే అంటరానితనాన్ని అబద్ధాలతో అందమైన మేకప్ వేస్తోంది. ఇలాంటి దుర్మార్గులు, నీచులు మన దళితులు, బహుజనులకు వ్యతిరేకులు.

అంటరానితనం.. మరో రూపంలో

స్వాతంత్య్రం వచ్చిన 77 ఏళ్ల తర్వాత కూడా అంటరానితనం, వివక్ష సమసిపోలేదు. పెత్తందార్ల పోకడలతో రూపం మారుకుంది. అంటరానితనం అంటే.. ఫలానా వ్యక్తుల్ని భౌతికంగా ముట్టుకోకూడదని దూరం పెట్టడం మాత్రమే కాదు. పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో, ఆ గవర్నమెంట్ బడిని పాడుపెట్టడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. డబ్బున్న వారి పిల్లలకు ఒక మీడియం, పేద పిల్లలకు మరో మీడియం అని వివక్ష పాటిస్తూ పేద పిల్లలు తెలుగు మీడియంలోనే చదవాలని, వారు ఇంగ్లిష్ మీడియంలో చదవరాదని బరితెగించి వాదించడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే.

మనుషులు చనిపోతున్నా..

పేద కులాల వారు ఎప్పటికీ తమ పొలాల్లో పని వారుగానే ఉండిపోవాలట. తమ ఇళ్లలో పని వారుగా, తమకు సేవకులుగా ఉండిపోవాలట. తమ అవసరాలు తీర్చేవారిగానే మిగిలిపోవాలట. ఇలాంటి ఆలోచనలు కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. పేదలు ఏ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నారో, ఎక్కడ వారికి ఉచితంగా వైద్యం అందుతుందో, అటువంటి ప్రభుత్వ ఆస్పత్రులను నీరుగార్చడం కూడా అంటరానితనమే. పేదలు బస్సు ఎక్కే ఆర్టీసీని కూడా ప్రైవేట్‌కు అమ్మేయాలనుకోవడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. ఏ పౌర సేవ కావాలన్నా, పేదవాడికి ఏ పథకం కావాలన్నా లంచాలు ఇచ్చుకుంటూ, వివక్షకు లోనవుతూ, కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగిన దుస్థితి కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. అవ్వాతాతలు పెన్షన్ కోసం, రైతన్నలు ఎరువుల కోసం పొద్దున్నే లేచి పొడవాటి లైన్లలో నిలబడాల్సి రావడం, మనుషులు చనిపోతున్నా పాలకుల గుండె కరగకపోవడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. పేదల మీద పెత్తందారీ భావజాలంలో ఇవన్నీ కూడా భాగాలే.

● ఎస్సీల అసైన్డ్ భూముల్ని కాజేసి గజాల లెక్కన అమ్ముకోవాలనుకున్న రియల్ ఎస్టేట్ రాజధానిలో పేద వర్గాలకు చోటు లేకుండా తాము మాత్రమే ఒక కోట కట్టుకోవాలని కుతంత్రాలు చేయడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. పేదల ఇళ్ల నిర్మాణానికి భూములిస్తే సామాజిక సమతుల్యం దెబ్బ తింటుందని కోర్టులకు వెళ్లి కేసులు వేసి సిగ్గు లేకుండా వాదించడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. మన ఎస్సీలు, మన ఎస్టీలు, మన బీసీలు, మన మైనార్టీలు, మన నిరుపేద పిల్లలు చదువుకునే ఆ గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పడానికి వీల్లేదని కోర్టులకు వెళ్లి పిటిషన్లు వేయడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. పేద వర్గాల పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వటానికి వీల్లేదని కుత్రపూరిత కథనాలు రాయడం, వాదించడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే.

పెత్తందార్లకు ఏనాడైనా తోచిందా?


బాణసంచా వెలుగుల్లో అంబేడ్కర్ విగ్రహం

దళితుల ఇళ్ల నిర్మాణాలకు చంద్రబాబు సెంటు భూమి అయినా ఇచ్చింది లేదు. అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించింది అంతకంటే లేదు. చంద్రబాబు రక్తంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మీద ఏ కోశానా, ఏనాడూ ప్రేమే లేదు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? అని నాడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న ఆ వ్యక్తి నోరు పారేసుకుంటే గ్రామాల్లో ఆ సామాజిక వర్గాలు ఎలా బతకగలుగుతాయనే కనీస ఆలోచన చేయలేదు. బీసీలను తోకలు కత్తిరిస్తా.. కబడ్దార్! అని బెదిరించిన వ్యక్తి చంద్రబాబు. పేద సామాజిక వర్గాలంటే గిట్టని ఆ వ్యక్తికి మన మాదిరిగా పేద అక్కచెల్లెమ్మల కుటుంబాలు బాగుండాలని ఏకంగా 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేయాలని ఎందుకు అనిపిస్తుంది? చదువుకొనే మన పేద పిల్లలకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద, విద్యా కానుక, ట్యాబ్‌లు, ఇంగ్లీషు మీడియం చదువులు, బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్, గవర్నమెంట్ బడుల్లో డిజిటలైజేషన్, ఐఎఫ్‌పీలు, నాడు-నేడుతో చదు వులు మార్చాలని అలాంటి పెత్తందారీ పార్టీలకు, నాయకులకు ఎందుకు అనిపిస్తుంది? మన అక్క చెల్లెమ్మలకు ఒక దిశా యాప్, అమ్మ ఒడి, ఆసరా, సున్నావడ్డీ, చేయూత, అక్కచెల్లెమ్మల పేరిట 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చి చిరునవ్వులు చూడాలని పెత్తందారీ పార్టీలకు, నాయకులకు ఎందుకు అనిపిస్తుంది? మన రైతన్న లకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్, రైతు భరోసా, ఆర్బీకే వ్యవస్థను తేవాలని వారికి ఎందుకు అనిపిస్తుంది? పేదలకు ఆరోగ్యశ్రీతో రూ.25 లక్షల ఉచిత వైద్యం, , ఆరోగ్య ఆసరా, 104, 108 సేవలు, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, వైద్య ఆరోగ్యశాఖలో 53 వేలకు పైగా పోస్టులను భర్తీ చేయాలని ఆ పెత్తందారు చంద్రబాబుకు ఎందుకు అనిపిస్తుంది? గ్రామ స్థాయిలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు తెచ్చి ప్రతి పేదవాడికీ అందుబాటులో ఉండాలని పెత్తందారు పార్టీలకు ఎందుకు అనిపిస్తుంది? నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టుల్లో 50 శాతం నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలకే దక్కేలా ఏకంగా చట్టం చేయాలని పెత్తందార్లకు ఎందుకు అనిపిస్తుంది?

మరిన్ని వివరాలు, చిత్రాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఈ స్థాయిలో మరెక్కడైనా ఉందా?

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలకు మేలు చేయడంలో దేశ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా 56 నెలల పాలనలో అడుగులు పడ్డాయి. మంత్రి మండలిలో ఏకంగా 4 ఉప ముఖ్యమంత్రి పదవులు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే ఇచ్చాం. మంత్రి మండలిలో 68 శాతం పదవులూ వారికే ఇచ్చాం. ఇది సామాజికపరంగా దేశ చరిత్రలో రికార్డు. శాసనసభ స్పీకర్‌గా బీసీ, శాసన మండలి చైర్మన్‌గా ఎస్సీ, మండలి డిప్యూటీ చైర్ పర్సన్‌గా మైనార్టీ అక్కకు పెద్దపీట వేసిన ఏకైక ప్రభుత్వం మీ బిడ్డదే. మనందరి ప్రభుత్వం వచ్చాక రాజ్యసభకు 8 మందిని పంపిస్తే అందులో నలుగురు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల వారే. మన పార్టీకి మండలిలో 43 మంది సభ్యులుంటే వారిలో 29 మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలే ఉన్నారు. 13 జెడ్పీ చైర్మన్లలో 9 పదవులు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో 12 మేయర్లు, 87 మున్సిపాలిటీలుంటే 84 మీ బిడ్డ గెలుచుకోగా వాటిలో ఏకంగా 58 మున్సిపాలిటీల్లో, 196 మార్కెట్ కమిటీల్లో 117 చైర్మన్లు, 137 కార్పొరేషన్‌లలో 79 చైర్మన్లు ఇలా అన్నింటా నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకే అవకాశం కల్పించాం. మొత్తంగా రాజకీయ నియామకాలు, పదవుల్లో సగానికిపైగా నా అక్కచెల్లెమ్మలున్నారని గర్వంగా చెప్పగలుగుతున్నా. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 56 నెలల కాలంలో 2.10 లక్షల గవర్నమెంట్ ఉద్యోగాలు ఇస్తే 80 శాతం నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్నదమ్ములు అక్కచెల్లెమ్మలే ఉన్నారు. ఇలాంటి సామాజిక న్యాయం మనందరి ప్రభుత్వంలో కాకుండా మరెక్కడైనా చూశారా?

▶ మొదటి పేజీ తరువాయి

'కల్యాణ' కానుకేదీ?

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పామెన గ్రామానికి చెందిన బి.అమృత తన కుమార్తె వివాహం గతేడాది ఫిబ్రవరి 9న చేసింది. వెంటనే కల్యాణ లక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసినా ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదు. పథకం అర్హత, సాయం కోసం అధికారులను అడిగినప్పుడల్లా.. వివరాలను సంబంధిత అధికారులకు పంపించామని, ప్రభుత్వం నిధులు ఇచ్చినప్పుడు అందిస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సాయం అందుతుంతో లేదో ఆమెకు అర్థం కావడం లేదు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ముఖ్య ఉద్దేశం. దరఖాస్తు ప్రక్రియలో నిబంధనలు, క్షేత్రస్థాయిలో విచారణ నేపథ్యంలో అర్జీదారులంతా వివాహం తర్వాతే దరఖాస్తు సమర్పిస్తున్నారు. అలా సమర్పించిన దరఖాస్తును పరిశీలించి విచారణ పూర్తి చేసిన తర్వాత అర్హతలను ఖరారు చేసి, లబ్ధిదారు కుటుంబానికి చెక్కు రూపంలో సాయం అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఈ పథకా లకు నిధుల విడుదల నిలిచిపోగా.. క్షేత్రస్థాయిలో దర ఖాస్తు పరిశీలన కూడా ఆగిపోయింది. ఇప్పటికే దర ఖాస్తు సమర్పించిన అర్జీదారులకు ఎలాంటి సమా చారం అందడం లేదు. దాదాపు నాలుగు నెలలుగా రాష్ట్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ జరగడం లేదు. రెండు పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా 1,04,613 దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నట్లు సంక్షేమ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

విడుదల కాని నిధులు: కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి లక్షకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో ఆ మేరకు బకాయిలు కూడా పేరుకుపోయాయి. నిధుల విడుదలలో జాప్యం కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. 2023-24 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నెలాఖరు నాటికి రెండు పథకాలకు సంబంధించి 1,32,046 దరఖాస్తులు అందగా, 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మరో 69,715 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పెండింగ్ దరఖాస్తులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జత (క్యారీ ఫార్వర్డ్) చేశారు. క్యారీ ఫార్వర్డ్ చేసిన దరఖాస్తులతో 2023-24 డిసెంబర్ నెలాఖరు నాటికి వచ్చిన వాటిని కలిపితే మొత్తం దరఖాస్తులు 2,01,761. వీటిలో 97,148 దరఖాస్తులను అధికారులు విడతల వారీగా పరిష్కరించి క్లియర్ చేశారు. వీటికి సంబంధించి ప్రభుత్వం రూ.972.60 కోట్లు విడుదల చేసింది. కానీ 1,04,613 దరఖాస్తులకు సంబంధించి రూ.1,047.68 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గత నాలుగు నెలలుగా ఎన్నికల కోడ్, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో నిధుల విడుదల జరగక చెక్కుల పంపిణీ నిలిచిపోయింది. కాగా ప్రస్తుత బకాయిల్లో బీసీ, ఈబీసీ కేటగిరీల వారి దరఖాస్తులకు సంబంధించినవే సగానికి పైగా ఉండడం గమనార్హం.

కేటగిరీ వారీగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలు (రూ.కోట్లలో)

సంక్షేమ శాఖ	పెండింగ్ దరఖాస్తులు	చెల్లించాల్సిన బకాయిలు
బీసీ, ఈబీసీ	55541	556.29
మైనారిటీ	23599	236.28
ఎస్సీ	14267	142.90
ఎస్టీ	11206	112.21
మొత్తం	104613	1047.68

కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చా? లేదా?

రాష్ట్రంలో గత డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికాకంలోకి వచ్చింది. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు గత ప్రభుత్వ హయాంలోనే అమల్లో ఉండగా.. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్.. అధికారంలోకొస్తే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ఈ పథకాలకు నిధుల విడుదల నిలిచిపోవడంతో బంగారం సంగతి సరే బకాయిల సంగతి ఏమిటనే ఆందోళన, అయోమయం దరఖాస్తుదారుల్లో నెలకొంది. ఏడాదిన్నరకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లింపులు చేస్తుందా? లేదా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఈ పథకాలకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో..ఆయా పథకాలకు అర్హతలున్న వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలా? వద్దా? అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి.

ఈ నెలాఖరులో రాష్ట్రానికి మోదీ?

ఆదిలాబాద్ లేదా నల్లగొండలో పర్యటన!

- 28న కరీంనగర్, మహబూబ్‌నగర్‌లో అమిత్‌షా టూర్
- ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్ రాక
- నేతల టూర్లతో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతోన్న కమలం
- వచ్చే నెల 5 నుంచి 14 వరకు రథయాత్రలు
- రాష్ట్రంలోని మొత్తం 17 ఎంపీ సీట్లను 5 క్లస్టర్లుగా విభజన
- క్లస్టర్ల వారీగా సమావేశాల నిర్వహణ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సన్నద్ధంలో భాగంగా కమలదళం స్పీడ్ పెంచింది. తెలంగాణలోని 17 ఎంపీ సీట్లలో 35 శాతం ఓటింగ్‌తో పది సీట్లను గెలుపొందాలంటూ జాతీయ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించే దిశగా రాష్ట్ర పార్టీ కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లను 5 క్లస్టర్లుగా విభజించారు. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావుతో పాటు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్య దర్శులు నలుగురిని ఈ క్లస్టర్లకు ఇన్‌చార్జిలుగా నియమించారు. వచ్చే నెల 5 తేదీ నుంచి 14వ తేదీ వరకు ఈ ఐదు క్లస్టర్లలో బీజేపీ ఎన్నికల రథయాత్రలను నిర్వహించనున్నారు. రోజుకు రెండేసి అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున పదిరోజుల్లో ఆయా లోక్‌సభ క్లస్టర్లలోని అసెంబ్లీ సెగ్మెంట్లను కవర్ చేయాలని నిర్ణయించారు. క్లస్టర్ల పరిధిలోకి వచ్చే లోక్‌సభ సీట్లలోని ముఖ్యనేతలంతా ఈ రథయాత్రల్లో పాల్గొనేలా ప్లాన్ చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలు కవర్ అయ్యేలా రథయాత్రలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెలాఖరులోగా ఆయా క్లస్టర్ల వారీగా రథయాత్రల నిర్వహణ కమిటీలు, ఆయా బాధ్యతల నిర్వహణకు వివిధ బృందాల ఏర్పాటు వంటివి ఖరారు కానున్నట్టు తెలిసింది.

రాష్ట్రానికి అగ్రనేతల వరుస టూర్లు

ఫిబ్రవరి ఆఖర్లో లేదా మార్చి మొదటివారంలో ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చుననే అంచనాల నేపథ్యంలో పార్టీ అగ్రనాయకులు రాష్ట్ర పర్యటనకు రానున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఈ నెల 28న బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా కరీంనగర్ లోక్‌సభ క్లస్టర్ పరిధిలో నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొంటారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ క్లస్టర్ పరిధిలో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో కూడా పాల్గొని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తారు. ఇక వివిధ అభివృద్ధికార్యక్రమాలతో పాటు పార్టీపరంగా నిర్వహించే బహిరంగసభల్లో పాల్గొనేందుకు ఈ నెలాఖరులోగా ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చే అవకాశాలున్నాయని పార్టీనాయకులు చెబుతున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల్లో ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో మోదీ పాల్గొనవచ్చునని తెలుస్తోంది. అదేవిధంగా ఈ నెలాఖరులో లేదా వచ్చేనెల మొదటివారంలో జరిగే పార్టీ సమావేశాల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొంటారని తెలుస్తోంది.

▶ ఏపీలో మరో చారిత్రక ఘట్టానికి శ్రీకారం

కులగణన మొదలు..

సాక్షి, అమరావతి


ప్రపంచంలో అతి పెద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగిన రోజే సామాజిక న్యాయానికి మరో అడుగు పడింది. రాష్ట్రంలో శుక్రవా రం మరో చారిత్రక ఘట్టానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా కులగణన ప్రక్రి య మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాల యాలు ఉండగా.. శుక్రవారం తొలిరోజు 14,334 సచివాల యాల్లో కులగణన ప్రక్రియ మొద లైంది. గ్రామ, వార్డు సచివాల యాల ఉద్యోగులు, వలంటీర్లు ఉమ్మడిగా సచివాలయాల పరి ధిలో ఇంటింటికీ వెళ్లి కులాల వారీగా ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తున్నారు. పది రోజుల పాటు ఈ ప్రక్రియ చేపడతారు. ప్రక్రియ మొత్తం పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్ విధానంలో చేపట్టేందుకు గ్రామ, వార్డు సచి వాలయాల శాఖ ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. శుక్రవారం ఉదయం రాష్ట్రమంతటా ఒకేసారి కులగణన ప్రారంభం కాగా.. మొబైల్ యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో చాలా చోట్ల వివరాల నమోదులో ఆటంకాలు ఏర్పడినట్టు అధికా రులు వెల్లడించారు. సాంకేతిక సమస్యలు ఎదురైనప్పటికీ, తొలి రోజు రాష్ట్రవ్యాప్తంగా 5,34,160 కుటుంబాలకు సంబంధించి 10,22,764 మంది సభ్యుల వివ రాల నమోదు పూర్తి చేసినట్టు అధికారులు వెల్లడించారు. గిరి జన, మారుమూల ప్రాంతాల్లో నెట్, సెల్ సిగ్నల్ ఉండని దాదాపు 515 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రత్యేకంగా ఆఫ్‌లైన్ విధానంలో కులగణన చేపట్టారు.



శ్వేత కె సుగాధన్



చునౌతి శర్మ





రిపబ్లిక్ డే

కర్తవ్య పథ్‌లో దళ నాయికలు

ఢిల్లీ పోలీస్ మొదటిసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో సంపూర్ణ మహిళా దళాన్ని కవాతు చేయించనుంది. ఇదొక రికార్డు. ఈ దళానికి ఐపిఎస్ శ్వేత కె సుగాధన్ నాయకత్వం వహించనుంది.

అలాగే ఇండియన్ కోస్ట్ గార్డ్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ చునౌతి శర్మ నాయకత్వం వహించనుంది. ఇదీ రికార్డే. భారత త్రివిధ దళాలలో, రక్షణ దళాలలో మహిళల భాగస్వామ్యం ప్రతి ఏటా ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

75వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో మహిళా శక్తి తన స్థయిర్యాన్ని ప్రదర్శించనుంది. దేశ రక్షణలో, సాయుధ ప్రావీణ్యంలో తాను ఎవరికీ తీసిపోనని చాటి చెప్పనుంది. గత రెండు మూడు సంవత్సరాలుగా రిపబ్లిక్ డే పరేడ్‌లో మహిళలకు దొరుకుతున్న ప్రాధాన్యం ఈ సంవత్సరం కూడా కొనసాగుతోంది. అంతే కాదు గత కొన్నాళ్లుగా త్రివిధ దళాలలో ప్రమోషన్లు, ర్యాంకులు, నియామకాల్లో స్త్రీలకు సంబంధించిన పట్టింపులు సడలింపునకు నోచుకుంటున్నాయి. ప్రాణాంతక విధుల్లో కూడా స్త్రీలు ఆసక్తి ప్రదర్శిస్తే వారిని నియుక్తులను చేయడం కనిపిస్తోంది. ఆ తెగువే ఇప్పుడు రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రదర్శితం కానుంది.

ఢిల్లీ మహిళా దళం

ఈ సంవత్సరం గణతంత్ర వేడుకలలో ఢిల్లీ పోలీసులు సంపూర్ణ మహిళా దళాన్ని కవాతు చేయించాలని, దానికి మరో మహిళా ఆఫీసర్ నాయకత్వం వహించాలని నిర్ణయించడం చరిత్రాత్మకం. ఎప్పుడో 1975లో ఢిల్లీ పోలీసు దళానికి నాటి ఐ.పి.ఎస్. ఆఫీసర్ కిరణ్ బేడీ నాయకత్వం వహించి చరిత్ర సృష్టించింది. మళ్లీ గత సంవత్సరంగాని ఐ.పి.ఎస్. ఆఫీసర్ శ్వేత కె సుగాధన్‌కు నాయకత్వం వహించే అవకాశం రాలేదు. అయితే ఆ దళంలో ఉన్నది మగవారు. ఈసారి మాత్రం పూర్తి మహిళా దళం పాల్గొననుండటం విశేషం. దీనికి తిరిగి శ్వేత కె సుగాధన్ నాయత్వం వహించనుండటం మరో విశేషం. నార్త్ ఢిల్లీకి అడిషినల్ డీసీపీగా పని చేస్తున్న శ్వేత కె సుగాధన్‌ది కేరళ. 2015లో బి.టెక్ పూర్తి చేసిన శ్వేత మొదటిసారి కాలేజీ టూర్‌లో ఢిల్లీని దర్శించింది. 2019లో యు.పి.ఎస్.సి. పరీక్షలు రాయడానికి రెండోసారి ఢిల్లీ వచ్చింది. అదే సంవత్సరం ఐ.పి.ఎస్.కు ఎంపికైన శ్వేత ఇప్పుడు అదే ఢిల్లీలో గణతంత్ర దినోత్సవంలో దళ నాయకత్వం వహించే అవకాశాన్ని పొందింది. శ్వేత దళంలో మొత్తం 194 మంది మహిళా హెడ్ కానిస్టేబుళ్లు ఉంటారు. వీరిలో 80 శాతం మంది ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారు. ఢిల్లీ పోలీసు విభాగంలో ఈశాన్య రాష్ట్రాల మహిళల నియామకానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అందుకే శ్వేత నాయకత్వం వహించే దళంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన మహిళా పోలీసులే ఉంటారు. మరో విశేషం ఏమంటే ఈసారి ఢిల్లీ పోలీస్ బ్యాండ్‌కు రుయాంగియో కిన్సే అనే మహిళా ఆఫీసర్ నాయకత్వం వహించనుంది. 135 మంది పురుష కానిస్టేబుళ్లు ఢిల్లీ పోలీసు గీతాన్ని కవాతులో వినిపిస్తూ ఉంటే వారికి కిన్సే నాయకత్వం వహించనుంది.

కోస్ట్ గార్డ్‌కు చునౌతి శర్మ

గణతంత్ర వేడుకలలో ఇండియన్ కోస్ట్ గార్డ్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ చునౌతి శర్మ నాయకత్వం వహించనుంది. తీర ప్రాంతాల గస్తీకి, అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి నియుక్తమైన ఇండియన్ కోస్ట్ గార్డ్ తన ప్రాతినిధ్య దళంతో పరేడ్‌లో పాల్గొననుంది. దీనికి నాయకత్వం వహించే అవకాశం రావడం పట్ల చునౌతి శర్మ ఆనందం వ్యక్తం చేసింది. 'గతంలో నేను ఎన్‌సీసీ కేడెట్‌గా పరేడ్‌లో పాల్గొన్నాను. ఎన్‌సీసీలో మహిళా కాడెట్‌ల దళం, పురుష కాడెట్‌ల దళం విడిగా ఉంటాయి. కాని ఇక్కడ నేను కోస్ట్ గార్డ్ పురుష జవాన్ల దళానికి నాయకత్వం వహించనున్నాను. ఈ కారణానికే కాదు మరోకందుకు కూడా ఈ వేడుకల నాకు ప్రత్యేకమైనవి. ఎందుకంటే నా భర్త శిక్కు దళానికి పరేడ్‌లో నాయకత్వం వహించనున్నాడు. దేశ సేవలో ఇదో విశిష్ఠ అవకాశం' అందామె.

వీరే కాదు... త్రివిధ దళాల మరిన్ని విభాగాలలోనూ స్త్రీల ప్రాధాన్యం ఈ రిపబ్లిక్ డే వేడుకల్లో పథం తొక్కనుంది.

సెకండ్ జెనరేషన్

ఎంబీఏ చేసిన ఎంఆర్ జ్యోతి వ్యాపార పాఠాలను కళాశాలలో కంటే తండ్రి రామచంద్రన్ అడుగు జాడల్లో నుంచే ఎక్కువగా నేర్చుకుంది. అయిదువేల రూపాయల పెట్టుబడితో ప్రారంభించిన 'జ్యోతి ల్యాబ్స్'ను వేల కోట్ల టర్నోవర్‌కి తీసుకువెళ్లాడు ఎంపీ రామచంద్రన్. ఎండీగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతి కంపెనీని మరోస్థాయికి తీసుకువెళుతోంది. 'తండ్రి మెచ్చిన తనయ' అనిపించుకుంది...

తండ్రి మెచ్చిన తనయ



ఎంఆర్ జ్యోతి

తండ్రి అయిదు వేల రూపాయల పెట్టుబడితో వ్యాపారం మొదలు పెట్టినప్పుడు జ్యోతి వయసు అయిదు సంవత్సరాలు. త్రిసూర్ (కేరళ)లోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తండ్రి వ్యాపారాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ఎంత కష్టపడ్డాడో జ్యోతికి కళ్లకు కట్టినట్లుగా గుర్తుంది. అదృష్టాన్ని కాకుండా కష్టాన్నే నమ్ముకున్న తండ్రి ఇటుకా ఇటుకా పేర్చి కంపెనీని బలోపేతం చేశాడు. సెలవు అంటూ లేకుండా వారానికి ఏడు రోజులూ పనిచేసేవాడు.

ప్రాడక్ట్స్ లోడింగ్ నుంచి పత్రికలకు ఇచ్చే అడ్వరైజ్‌మెంట్‌ల వరకు అన్నీ దగ్గరుండి చూసుకునేవాడు.

సింగిల్ ప్రాడక్ట్ 'ఉజాల'తో మొదలైన కన్స్యూమర్ గూడ్స్ కంపెనీ 'జ్యోతి ల్యాబ్స్' ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

కంపెనీ మొదలు పెట్టిన కొత్తలో ఆరుగురు మహిళల బృందం ఇంటింటికీ తిరిగి 'ఉజాల' అమ్మేవారు.

కట్ చేస్తే...

2005లో కంపెనీ మార్కెటింగ్ విభాగంలో చేరింది జ్యోతి. ఆ తరువాత చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా పనిచేసింది. 2020లో కంపెనీ ఎండీగా బాధ్యతలు స్వీకరించింది. బాధ్యతలు చేపట్టడానికి ముందు తరువాత అనే విషయానికి వస్తే ఎండీగా కంపెనీ ఆదాయాన్ని పెంచింది.

నలభై సంవత్సరాలు పూర్తి చేసుకున్న కంపెనీని మరో స్థాయికి తీసుకువెళ్లడానికి రెండో తరం ఎంటర్ ప్రెన్యూర్ అయిన జ్యోతి నిర్మాణాత్మకమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. మార్కెట్‌లో ఎదురవుతున్న సవాళ్ల నుంచి ప్రాడక్ట్ ఇన్నోవేషన్స్. అడ్వర్‌టైజింగ్ ప్లాన్స్ వరకు ఎన్నో విషయాలపై దృష్టి పెట్టింది.

కంపెనీ ప్రధాన ఆధారం... ఫ్యాబ్రిక్ కేర్, డిష్ వాషింగ్ ప్రాడక్ట్స్. ఈ నేపథ్యంలో పర్సనల్ కేర్ సెగ్మెంట్ మీద ప్రత్యేక దృష్టి పెట్టింది జ్యోతి. గత సంవత్సరం కంపెనీ మార్గో సోప్ మూడు వేరియంట్స్‌ను లాంచ్ చేసింది.

పర్సనల్ కేర్‌కు సంబంధించి ఇతర విభాగాలను కూడా విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంది కంపెనీ.

బహుళజాతి సంస్థల నుంచి పోటీ తట్టుకొని మార్కెట్‌లో ఛాలెంజర్ బ్రాండ్‌గా నిలవడం అంత తేలిక కాదు. అందుకు ఎంతో ఆత్మవిశ్వాసం కావాలి. 'ఇక తిరుగులేదు' అంటూ ఆ ఆత్మవిశ్వాసం ఎక్కువైతే మార్కెట్‌లో ఒక్కో మెట్టు కిందకు దిగక తప్పదు. అందుకే ఆత్మవిశ్వాసం, అతివిశ్వాసానికి మధ్య స్పష్టమైన విభజన రేఖ గీసుకుంది జ్యోతి.

గతంలోలాగా భవిష్యత్ ఉండకపోవచ్చు. భారీ సవాళ్లు ఎదురు కావచ్చు. జ్యోతి వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. దార్శనిక దృష్టితో ఎప్పటికప్పుడు ఆలోచిస్తుంది. కంపెనీకి సంబంధించి మార్కెటింగ్ విభాగంలో చేరిన కొత్తలో తండ్రితో కలిసి దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూటర్‌లు, రిటైలర్‌లు, స్టేక్‌హోల్డర్స్‌కు సంబంధించి ఎన్నో మీటింగ్‌లలో పాల్గొంది. ప్రతి మీటింగ్ ఒక పాఠశాలగా మారి తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పింది.

'గతమెంతో ఘనకీర్తి' అని గతంలోనే ఉండిపోకుండా 'ట్యూన్ విత్ ది చేంజింగ్ టైమ్స్' అంటున్న జ్యోతి కొత్త టెక్నాలజీని పరిచయం చేయడం (ఉదా: రియల్-టైమ్ డేటాను ఉపయోగించడం) ఆటోమేటింగ్ ప్రాసెస్, ఓపెన్ డోర్ కల్చర్ వరకు ఎన్నో ఆధునిక విషయాలకు ప్రాధాన్యత ఇస్తూ కాలంతో గొంతు కలుపుతూనే ఉంది. గెలుపు దారిలో కొత్త ఉత్సాహంతో ప్రయాణిస్తూనే ఉంది.

ఉద్యోగ గృహిణి

ఒకరు రిలేషన్‌షిప్ ఎక్స్‌పర్ట్ అయ్యారు.. మరొకరు హెల్త్ కోచ్ అయ్యారు ఇంకొకరు పాకశాస్త్ర ప్రావీణ్యతను చాటుతున్నారు. పై చదువులు చదివి ఇంట్లో కూర్చున్న మహిళలు ఇంటర్నెట్‌లో ప్రభావశీలురుగా మారారు. ఇంటినుంచే వ్యాపారాన్ని అభివృద్ధి వైపుగా పరుగులు తీయిస్తున్నారు.

కుకింగ్ టు కామెడీ క్వీన్స్..



నాజ్ అంజుమ్



ప్రతీకాత్మక చిత్రం

సాధారణంగా గృహిణి జీవితం ఉదయం 4–5 గంటలకు నిద్రలేచి, ఇల్లు–వాకిలి శుభ్రం చేసుకొని, పిల్లలను స్కూల్‌కు పంపించి, అందరికీ అవసరమైనవి చేసి పెడుతుండగానే సాయంత్రం అవుతుంది. తిరిగి పిల్లలు స్కూల్ నుంచి వస్తారు. సాయంత్రం టీ, టిఫిన్లు, పిల్లల హోంవర్క్‌లు, రాత్రి భోజనం సిద్ధం చేయడం. రాత్రి పది–పదకొండు గంటలలోపు అన్నీ శుభ్రం చేసి అలసిపోయి అదే చిరునవ్వుతో అందరికీ గుడ్‌నైట్ చెప్పి నిద్రపోవడం. ఇలా ఇల్లు, పెద్దలు, భర్త, పిల్లల గురించి ఆలోచిస్తూ తమని తాము విస్మరించుకునే మహిళలకు ఇప్పుడు ఇంటి నుంచే పని చేసే అవకాశాలు పెరుగుతున్నాయి.

మంగళూరుకు చెందిన లిండా ఫెర్నాండేజ్ క్రెస్టా గృహిణి. నాలుగేళ్లుగా కామిక్ రీల్స్ చేస్తూ ప్రజాదరణ పొందింది. క్రెస్టాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 2.3 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అనేక బ్రాండ్లు ఆమెను సంప్రదిస్తూనే ఉన్నాయి. ఈ రోజు మంగళూరు వీధుల్లో ఆమె హోర్డింగులు కూడా పెట్టారంటే ఆమెకున్న ఆదరణ ఏ స్థాయిలో ఉందో చెప్పుకోవచ్చు. 'గృహిణిగా ఉండటం ఎప్పుడూ కష్టమనిపించలేదు. కానీ, నా కొడుకుకు మంచి భవిష్యత్తును ఇవ్వాలనుకున్నాను. దీంతో పాటు ఇంటి బాధ్యతనూ నిర్వర్తించాలనుకున్నాను. అందుకు మా కుటుంబమూ మద్దతు ఇస్తూ వచ్చింది' అని చెబుతుంది క్రెస్టా.



లిండా ఫెర్నాండేజ్ క్రెస్టా

హోమ్ చెఫ్

నాజ్ అంజుమ్ హైదరాబాద్‌లో నివాసముంటున్న హోమ్ చెఫ్. ఏడేళ్ల క్రితం అంజుమ్ తన పేరుతో హోమ్ కిచెన్‌ను ప్రారంభించింది. ఈ రోజుల్లో గృహిణుల ఆలోచనే మారిపోయింది అనడానికి అంజుమ్ ఒక ఉదాహరణ.

కాలంతో పాటు సమాజం ఆలోచనా విధానం కూడా మారింది. ఇంట్లో కూర్చున్నా నాకు సోషల్‌మీడియా చాలా ఆర్డర్లు తెచ్చిపెడుతోంది అని చెబుతుంది అంజుమ్.

'నాకు ముగ్గురు పిల్లలు. ఉదయం 4 గంటలకు నిద్రలేచి, వారిని స్కూల్‌కి రెడీ చేసి, పంపించిన తర్వాత కిచెన్ బాధ్యత తీసుకుంటాను. 80 రూపాయలతో నా పని ప్రారంభించాను. మా చుట్టూ ఉన్నవారు నా వంటలు తిని మెచ్చుకునేవారు. మా అపార్ట్‌మెంట్ వాసులు సోషల్ మీడియాలో అకౌంట్ ఓపెన్ చేయమని సలహా ఇచ్చారు. అలా చేసిన వంటలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేదాన్ని. ఆర్డర్‌లు వరుసగా రావడం ప్రారంభించాయి. ఈ రోజు సోషల్‌మీడియాలో హైదరాబాద్ ఫుడ్ సూపర్ హిట్‌గా పేరొందింది. దీంతో ఒక గృహిణిగా ఉన్న నేను ఉద్యోగినిగా మారిపోయాను'' అని ఆనందంగా చెబుతుంది అంజుమ్.

గృహిణి నుంచి ఒక మహిళ గృహ నిర్వాహకురాలిగా మారింది. ఈ హైటెక్ ప్రపంచంలో గృహిణి తనకంటూ కొత్త బిరుదును సంపాదించుకుంటుంది. ఇప్పుడు తనను తాను పని చేసే గృహిణి అని పిలవడానికి ఇష్టపడుతుంది. ఇంట్లో ఉంటూ డబ్బు సంపాదిస్తూ, బాధ్యతలను నెరవేర్చడంలో తనదైన ప్రత్యేక శైలిని కలిగి ఉంది. మారుతున్న కాలంలో ఈ తరహా ఆలోచన గృహిణితో పాటు ఇంట్లో అందరికీ నచ్చుతోంది.

చేతి కళకు ఆదరణ

నేటి యాంత్రిక యుగంలో చేతితో తయారు చేసిన వస్తువులు దొరకడం కష్టం. నాణ్యమైన సంప్రదాయ పనితనం కోసం అన్ని వైపుల నుండి డిమాండ్ వస్తోంది. ప్రావీణ్యం కలిగిన మహిళలు తమ నైపుణ్యాలను ఉపయోగించుకుంటున్నారు. అదే సమయంలో చాలా మంది గృహిణులు తమ జ్ఞానం ఆధారంగా హోమ్ ట్యూషన్, బ్యూటీ పార్లర్ వంటి సేవలను కూడా అందిస్తున్నారు.

జర్నల్ ఆఫ్ కల్చరల్ ఎకానమీలో ప్రచురించిన ఒక అధ్యయనం సోషల్ మీడియాలో లైక్‌లు, షేర్లు గృహిణిని 'అందం'గా మార్చేశాయి అని నిర్వచించింది. సంప్రదాయ గృహిణులు ఇప్పుడు స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో ఆకర్షణీయంగా మాత్రమే కాకుండా వ్యాపారవేత్తలుగా కూడా మారారు. ఈ చిన్న ఆరంభం మహిళను ఉద్యోగ గృహిణిని చేసింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 2020–21లో దేశంలో కేవలం 32 శాతం వివాహిత మహిళలు మాత్రమే ఉపాధి పొందుతున్నారు. వివాహిత మహిళల్లో 68 శాతం మంది గృహిణులుగా ఉన్నారు. మారిన కాలంలో ఇప్పుడు గృహిణిగా ఇంట్లో ఉంటూనే ఆర్థిక స్వావలంబన సాధిస్తోంది. ఇది 'ఆమె' నైపుణ్యాన్ని మరింతగా పెంచుతుంది. భారతదేశంలో చాలా మహిళలు నైపుణ్యం ఉన్నవారే. కొందరు కుట్లు–ఎంబ్రాయిడరీ చేయడంలో, కొందరు వంటలలో, మరికొందరు పెయింటింగ్‌లో నిష్ణాతులు. పనిచేసే గృహిణికి ఆమె ప్రతిభే ఆదాయ వనరుగా మారుతోంది.



గృహిణి నిర్వచనంలోనే మార్పు..

కరోనా లాక్‌డౌన్ కారణంగా సోషల్ మీడియా గృహిణులకు డబ్బు సంపాదించే శక్తిని ఇచ్చింది. ఇప్పుడు అదే రోజువారీ దినచర్యగా మారిపోయింది. యుఎస్ జనరల్ సోషల్ సర్వే 1972 నుండి 2020 వరకు ఒక సర్వే నిర్వహించింది. ఇందులో శ్రామిక మహిళలు, పని చేసే గృహిణులు ఎంతో సంతోషంగా ఉన్నారని భావించారు. వీళ్లలో ఎక్కువ మంది మధ్య, ఉన్నత తరగతికి చెందిన 40 ఏళ్ల పైబడిన వారు. ఉద్యోగరీత్యా గృహిణిగా ఉన్నా ఇంటి నిర్వహణ, సంపాదనతో పాటు భవిష్యత్తు కోసం పొదుపు చేస్తున్నామనే విషయాలను ఈ సర్వే వెల్లడి చేసింది.

బ్యూటిప్స్

ట్యాన్‌కు చెక్

రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిలో టీస్పూను తేనె, టీస్పూను రోజ్ వాటర్ వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదిహేను నిమిషాలపాటు ఆరనివ్వాలి. చక్కగా ఆరిన తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్‌ను వారానికి ఒకసారి వేసుకోవడం వల్ల ముఖం మీద పేరుకుపోయిన ట్యాన్ తగ్గుముఖం పడుతుంది. రోజ్ వాటర్ ముఖానికి సహజసిద్ధ నిగారింపుని ఇస్తే, తేనె చర్మానికి తేమనందిస్తుంది.



ఇంగువతో నిగారింపు

రెండు స్పూన్ల ముల్తానీ మట్టిలో స్పూను తేనె, చిటికెడు ఇంగువ, స్పూను రోజ్‌వాటర్ వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి ఇరవై నిమిషాలపాటు ఆరబెట్టాలి. తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్‌ను వారంలో రెండుసార్లు వేయడం వల్ల మొటిమలు, నల్ల మచ్చలు, ముడతలు పోతాయి. చర్మం పొడిబారడం తగ్గి ముఖం కాంతిమంతమవుతుంది.

కిచెన్ టిప్స్

- స్టీల్ పాత్రలు వెలిసిపోయి పాతపడినట్లుగా అనిపిస్తే... అయిపోయిన టూత్ పేస్టు ట్యూబ్‌ని ముక్కలుగా కత్తిరించి, లోపల ఉన్న కొద్దిపాటి పేస్టుని స్టీల్ పాత్రకు రాసి టూత్ బ్రష్‌తో రుద్దాలి. రెండు చుక్కలు నీళ్ల వేసి రుద్ది, వస్త్రంతో తుడిస్తే కొత్తవాటిలా తళతళా మెరుస్తాయి. వెండిసామాన్లు కూడా టూత్ బ్రష్‌తో రుద్దితే మురికి అంతా పోయి కొత్తవాటిలా కనిపిస్తాయి.



- డ్రెస్సింగ్ టేబుల్ మిర్రర్, చిన్న అద్దాలు మురికి పట్టి సరిగా కనిపించకపోతే కొద్దిగా టూత్‌పేస్టు వేసి రుద్ది, వస్త్రంతో తుడిస్తే దుమ్మూధూళి, మరకలు పోయి అద్దం స్పష్టంగా కనిపిస్తుంది.



- మిరియాలు, ఉల్లిపాయ, వెల్లుల్లిపాయలను సమపాళల్లో తీసుకుని కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరువాత ఈ మిశ్రమాన్ని వడగట్టి స్ప్రే బాటిల్‌లో వేయాలి. ఈ మిశ్రమాన్ని బల్లులున్న ప్రాంతంలో స్ప్రే చేస్తే ఘాటు వాసనకు బల్లులు పారిపోతాయి.



చాలా మంది కాలి చీలమండల ప్రాంతంలో నొప్పితో బాధపడుతుంటారు. దీనివల్ల నడవటం కూడా ఇబ్బందికరంగా మారుతుంది. ఈ నొప్పి రాకుండా వివిధ రకాల ఔషధాలు తీసుకుంటూ ఉంటారు. అయితే మందు ప్రభావం తగ్గిన వెంటనే, నేనున్నానంటూ మళ్లీ నొప్పి మొదలవుతుంది. ఇటువంటి పరిస్థితులలో కొన్ని ఇంటి నివారణ చిట్కాలు సహాయంతో పాదాల నొప్పి నుంచి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. అవేంటో తెలుసుకుందాం.

నొప్పికి మడమ తిప్పనక్కరలేదు!

మడమల నొప్పులు ఏ సీజన్‌లో అయినా రావచ్చు కానీ ముఖ్యంగా చలికాలంలో ఈ సమస్య మరింత తీవ్రతరమౌతుంది. ఈ నొప్పులకు కారణాలు అనేకం. వాటిలో బరువు పెరగడం, ఎక్కువసేపు నిలబడటం, ఎత్తు మడమల బూట్లు లేదా చెప్పులు ధరించడం, శరీరంలో కాల్షియం లోపించటం వంటివి ముఖ్య కారణాలు.





అల్లం

మడమ నొప్పి నుంచి ఉపశమనం కలిగించేందుకు ఆహారంలో అల్లాన్ని చేర్చుకోవటం మంచిది. దీనికిగాను ముందుగా రెండు కప్పుల నీళ్లలో అల్లం వేయాలి. తరువాత దానిని మరగనివ్వాలి. నీరు సగానికి తగ్గిన తర్వాత అందులో మూడు చుక్కల నిమ్మ రసం, ఒక చెంచా తేనె వేసి సేవించడం వల్ల వల్ల చీల మండల నొప్పి నుంచి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు.



పసుపు

మడమ నొప్పి నుండి ఉపశమనం పొందడానికి పసుపు సహాయపడుతుంది. ఇది వ్యాధి నిరోధక లక్షణాలను కలిగి ఉండి వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. దీనికిగాను పసుపునీళ్లలో కొద్దిగా తేనె కలుపుకుని తాగాలి. అలాగే పసుపు పాలు తీసుకోవచ్చు. దీనిని సేవించటం వల్ల నొప్పి, వాపు తగ్గుతాయి.





లవంగ నూనెతో మసాజ్

మడమ నొప్పి నుంచి ఉపశమనం కోసం నొప్పి ఉన్న ప్రాంతంలో లవంగ నూనెతో సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. కండరాలకు ఉపశమనం కలుగుతుంది. పాదాలలో ఏదైనా నొప్పి అనిపిస్తే లవంగ నూనెతో మసాజ్ చేయటం ద్వారా మంచి ఫలితం ఉంటుంది.

ఆపిల్ సైడర్ వెనిగర్

మడమల నొప్పి, వాపు వంటి సమస్యలు ఉంటే, ఆపిల్ సైడర్ వెనిగర్ బాగా ఉపకరిస్తుంది. కాసిని వేడినీళ్లలో కొన్ని చుక్కల ఆపిల్ సైడర్ వెనిగర్ కలపాలి. ఈ నీటితో పాదాలను మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల ఉపశమనం లభిస్తుంది.

చేప

ఆహారంలో చేపలను చేర్చుకోవడం ద్వారా నొప్పి, మడమల వాపు నుండి ఉపశమనం పొందవచ్చు. ఇందులో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్‌లు ఉన్నాయి. ఇవి నొప్పి, వాపును తగ్గించడమే కాకుండా, ఎముకలను బలోపేతం చేస్తాయి.

రాక్‌సాల్ట్

మడమ నొప్పి నుంచిఉపశమనం పొందడానికి రాతి ఉప్పును ఉపయోగించవచ్చు. ముందుగా ఒక పాత్రలో నీటిని వేడి చేసి, దానిలో రెండు మూడు చెంచాల రాక్ సాల్ట్ వేయండి. ఆ తర్వాత, ఈ నీటిలో పాదాలను 10–15 నిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల మడమ నొప్పి, వాపు ఉపశమిస్తాయి.



ఐస్ క్యూబ్స్

మడమల నొప్పి సమస్య నుండి బయటపడటానికి నొప్పి ఉన్న ప్రాంతంలో రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు సార్లు ఐస్ క్యూబ్‌లు ఉంచాలి. ఐస్ గడ్డను నేరుగా కాకుండా ఒక గుడ్డలో ఉంచి నొప్పి ఉన్న ప్రదేశంలో సున్నితంగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల ఉపశమనం లభిస్తుంది.



కారానికి గారం చేయండి



రెగ్యులర్‌గా మనం వండే వంటల్లో కారం రుచి కోసం పచ్చి మిరపకాయలు వాడతాం. అయితే ఇవి రుచిని అందించడంతో పాటు ప్రమాదకర వ్యాధుల నుండి కాపాడతాయని మీకు తెలుసా?

● పచ్చిమిరపలో ఎ,సి బి6 విటమిన్లతో పాటు ఇనుము, రాగి, పొటాషియం తక్కువ మొత్తంలో ప్రొటీన్, కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి. పచ్చిమిరపలోని క్యాప్సైసిన్ అనే పదార్థం శ్లేష్మ పొరలపై ప్రభావం చూపిస్తుంది. దీంతో అది సులువుగా బయటకు వచ్చేస్తుంది. సైనస్, జలుబుకి పచ్చిమిరప మంచి సహాయకారిగా ఉపయోగపడుతుంది.

● పచ్చిమిరప రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుంది. కంటి ఆరోగ్యాన్ని, చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పచ్చిమిరపలో విటమిన్ సి ఎక్కువగా ఉండటం వల్ల కోతలు, గాయాలు వంటి వాటిని త్వరగా నయం చేస్తుంది. గుండె జబ్బులు, అల్సర్లు కూడా పచ్చిమిరప తీసుకోవడం వల్ల నయమవుతాయి. రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్ చేయడంలో సమర్థంగా పనిచేస్తుంది. డయాబెటీస్‌తో బాధపడుతున్న వారు పచ్చి మిర్చితో చేసిన ఫుడ్ తీసుకోవడం మేలు చేస్తుంది.

● పచ్చిమిరపలో ఉండే విటమిన్ సి, ఇ శరీరంలో రక్తప్రసరణ పెంచడంలో సహాయపడతాయి. మొటిమల సమస్యలను కూడా నయం చేస్తుంది. ఇందులో అసలు క్యాలరీలు ఉండవు కాబట్టి బరువు తగ్గడంలో కూడా ఇది సహాయపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. చాలామందిలో మూడ్ స్వింగ్స్ సమస్య ఉంటుంది. పచ్చిమిరప మెదడులోని ఎండార్ఫిన్‌లను బయటకు పంపేందుకు ఉపయోగపడుతుంది. దీని కారణంగా మూడ్ స్వింగ్స్ నుండి బయటపడి సంతోషంగా ఉండగలుగుతారు.

● ముఖ్యంగా చలికాలంలో పచ్చిమిరపకాయలు తినడం వల్ల యాసిడ్ ఏర్పడకుండా నిరోధిస్తుంది. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఎముకలు దంతాలు, కళ్లకు ఉపయోగకరంగా ఉంటుంది. కీళ్ల నొప్పులు నివారించడంలో పచ్చి మిరపకాయలు ఎంతగానో సహాయపడతాయి. సో.. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలున్న పచ్చి మిరపకాయలను మీరు తినే ఆహారంలో ఎక్కువగా చేర్చుకోండి.

కొంతమందిని చూస్తే ఎప్పుడూ ఏ తాళం చెవో, పెన్ను రీఫిలో, పొడవుగా చుట్టిన కాగితాన్నో, ఏవీ దొరక్కపోతే చేతివేళ్లతోనో చెవిలో సంగీతం పాడిస్తుంటారు. ఈ చికాకంతా ఎందుకని చాలామంది స్నానం చేయగానే వీలైనంత లోతుగా చెవిని శుభ్రం చేస్తుంటారు. కానీ బయటికి కనిపించే చెవి కాకుండా లోపలి వైపు శుభ్రం చేయాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు. ఇంతకీ చెవి ఎలా శుభ్రం చేయాలో చూద్దాం...

● ఇయర్ వాక్స్ నష్టమా? లాభమా?



● కాటన్ బడ్ పెట్టడం వల్ల అది ఇయర్ వాక్స్‌ని చెవి లోపలికి మరింతగా నెట్టి వేస్తుంది ● అంతే కాదు, చెవిలో పెట్టిన బడ్ కర్ణభేరికి తగల వచ్చు. ఇది మరింత ప్రమాదకారి ● దీని వల్ల వినికిడి శక్తి దెబ్బ తింటుంది ● నిజానికి ఇయర్ వాక్స్ వల్ల చెవులకు లాభమేగానీ నష్టం లేదు ● బయటినుంచి వేరే పదార్థాలు, క్రిముల వంటివి చెవి లోపలికి వెళ్లకుండా ఇది రక్షిస్తుంది ● శిలీంధ్రాలు లేదా ఫంగస్ ఏర్పడకుండా నివారిస్తుంది ● చెవిలోని నాళం పొడిబారకుండా ఉండేందుకు దోహదపడుతుంది.

మరి ఇయర్ వాక్స్‌ని ఏం చేయాలి?

దాని జోలికి వెళ్లకుండా ఉండడమే సరి. వాక్స్ తీయడం కోసం చెవి లోపల ఇయర్ బడ్ మాత్రమే కాదు. ఇంకేమీ పెట్టక్కరలేదు. ఎందుకంటే, చెవి తనను తానే శుభ్రం చేసుకోగలుగుతుంది. ఒకవేళ చెవిలో శబ్దాలు రావడం, నొప్పి లాంటి సమస్యలు కనిపించినా, వినికిడిలో తేడా అనిపించినా వెంటనే ఈఎన్‌టీ నిపుణుని కలవండి.

మీకు తెలుసా?

నిద్ర... నిజాలు



రోజుకు మీరు ఎన్ని గంటలు నిద్రపోతున్నారు? పగలు ఎన్ని గంటలు? రాత్రి ఎన్ని గంటలు? కనీసం ఆరు గంటలైనా నిద్రపోతున్నారా? లేదంటే.. మీ హెల్త్ డేంజర్ జోన్‌లో ఉన్నట్టే. అవును. ఇది నిజమేనని ఓ అధ్యయనం వెల్లడించింది. రోజు మొత్తంలో కనీసం ఆరు గంటలైనా నిద్రపోని వారిలో గుండెకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందట. నిద్రలేమి కారణంగా తీవ్ర ఒత్తిడి పెరగడమే కాకుండా అది శరీరంలోని రక్తప్రసరణపై ప్రభావం చూపిస్తుందని తెలిపింది. తద్వారా రక్తనాళాల్లో ఒత్తిడి ఏర్పడి అది మెల్లగా గుండెపై ప్రభావం చూపిస్తుందని పేర్కొంది. ముఖ్యంగా రాత్రివేళల్లో నిద్ర మంచిదని అధ్యయనంలో రుజువైంది. రాత్రివేళల్లో ఆరు గంటలు కంటే తక్కువ సమయం నిద్రించినవారిలో 27 శాతం మేర గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నట్టు అధ్యయనవేత్తలు గుర్తించారు. అందుకే ఎంత ఒత్తిడి ఉన్నా.. ఎన్ని పనులు ఉన్నా.. నిద్రించేందుకు సమయాన్ని కేటాయిస్తే.. ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చునని పరిశోధకులు సూచిస్తున్నారు.

సినిమా

ప్రామిస్!

'మట్కా'లో వరుణ్ తేజ్ ప్రామిస్ చేశారు. ఎవరికి? ఎందుకు? అనేది తెలియాలంటే మాత్రం మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ 'మట్కా'. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లు. కరుణ కుమార్ దర్శకత్వంలో డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. శుక్రవారం (జనవరి 19) వరుణ్ తేజ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'మట్కా' నుంచి ఓపెనింగ్ బ్రాకెట్ అంటూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. ఇందులో వరుణ్ తేజ్ 'ప్రామిస్' అంటూ టెలిఫోన్‌లో మాట్లాడటం కనిపిస్తుంటుంది. యావత్ దేశాన్ని కదిలించిన వాస్తవ ఘటన ఆధారంగా 'మట్కా' కథను రూపొందించారు. 24 ఏళ్ల టైమ్ పీరియడ్‌లో (1958–1982) సాగే ఈ కథలో వరుణ్ తేజ్ నాలుగు విభిన్నమైన గెటప్‌లలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ''ఓ గ్యాంబ్లింగ్ మాఫియా అధిపతి నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది (ఈ పాత్ర వరుణ్ తేజ్‌ది అని ఊహించవచ్చు). ఈ చిత్రంలో ఓ గ్యాంగ్‌స్టర్ పాత్రలో నవీన్ చంద్ర, పోలీసాఫీసర్ పాత్రలో పి. రవిశంకర్ కనిపిస్తారు. కథ రీత్యా 1950, 1980 నాటి పరిస్థితులను రీ క్రియేట్ చేయడంలో దర్శకులు కరుణ కుమార్ విజయం సాధించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, 'సత్యం' రాజేశ్, రవిశంకర్, అజయ్ ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



● వరుణ్ తేజ్



గాయపరిచి ఉంటే క్షమించండి - నయనతార

నయనతార కెరీర్‌లో 75వ చిత్రం 'అన్నపూరణి'. నీలేశ్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా గత ఏడాది డిసెంబరు 1న థియేటర్స్‌లో విడుదలైంది. ఆ తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ ప్రారంభమైంది. అయితే ఈ సినిమా హిందువుల మనోభావాలను కించపరచేలా ఉందనే వివాదం రేగింది. దాంతో 'అన్నపూరణి' ఓటీటీ స్ట్రీమింగ్ ఆగిపోయింది. ఈ విషయంపై తాజాగా నయనతార స్పందించి, ఓ లేఖను విడుదల చేశారు. ''బరువెక్కిన హృదయంతో ఈ లేఖ రాశాను. కేవలం కమర్షియల్ అంశాలనే కాదు... సంకల్ప బలంతో ఏదైనా సాధించవచ్చు అనే సానుకూల ఆలోచనతోనే 'అన్నపూరణి' సినిమా తీశాం. అయితే మాకు తెలియకుండానే కొందరి మనసులను మేం గాయపరిచామని అర్థమైంది. కానీ ఎవరి మనోభావాలను కించపరచాలనే ఉద్దేశం మా టీమ్‌కు లేదు. సెన్సార్ సర్టిఫికెట్‌తో ఓటీటీలో స్ట్రీమింగ్ కాబడిన మా మూవీని అక్కడ్నుంచి తొలగించడం అనేది ఆశ్చర్యపరిచింది. నేను భగవంతునిపై నమ్మకంతో ఎన్నో దేవాలయాలకు వెళ్తుంటాను. అలాంటి నేను ఉద్దేశపూర్వకంగా ఎవరి మనసులను గాయపరచాలని అనుకోను. ఏది ఏమైనా మీ మనోభావాలను గాయపరచి ఉంటే క్షమించండి.. జై శ్రీరామ్'' అని ఆ లేఖలో నయనతార పేర్కొన్నారు.


జర్మనీకి జర్నీ



● మహేశ్‌బాబు

జర్మనీ వెళ్లారు మహేశ్‌బాబు. దర్శకుడు రాజమౌళి, హీరో మహేశ్ బాబు కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ప్రధానంగా ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్సును ఈపాటికే మొదలు పెట్టారు రాజమౌళి. తాజాగా ఈ పనులు మరింత ఊపందుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలో తన లుక్, మేకోవర్ గురించిన సాంకేతికపరమైన విషయాల గురించిన పనుల కోసం మహేశ్‌బాబు జర్మనీ వెళ్లారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను విజయేంద్రప్రసాద్ దాదాపు పూర్తి చేసేశారని, వేసవిలో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.

నెగటివ్ రోల్స్ చేయాలని ఉంది - నటుడు నరేశ్ వీకే



''మంచి నటుడు కావాలని పరిశ్రమలోకి వచ్చాను. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను. 50 ఏళ్ల సినీ ప్రయాణం పూర్తి చేసుకోవడం ప్రేక్షకుల ప్రేమ, అభిమానాల వల్లే సాధ్యమైంది. నా జీవితాంతం చిత్ర పరిశ్రమకు సేవ చేస్తాను'' అని నటుడు డా. నరేశ్ వీకే అన్నారు. నటుడిగా ఆయన ప్రయాణం మొదలై 50 ఏళ్లు పూర్తయ్యాయి. నేడు (జనవరి 20) నరేశ్ పుట్టినరోజు. ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని శుక్రవారం నరేశ్ విలేకరులతో మాట్లాడుతూ– ''నా తొమ్మిదో ఏట 'పండంటి కాపురం' (1972)తో బాలనటుడిగా అడుగు పెట్టాను. మా అమ్మ విజయ నిర్మల, జంధ్యాల, కె. విశ్వనాథ్, బాపు, రమణ, ఈవీవీ సత్యనారాయణ, వంశీ, రేలంగి నరసింహారావు వంటి మహనీయులతో సినిమాలు చేసే అదృష్టం దక్కింది. రాజకీయాలు, ఆ తర్వాత సమాజ సేవ వల్ల దాదాపు పదేళ్లు పరిశ్రమకి దూరమయ్యాను. సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి, బిజీగా ఉన్నాను. నాకు నెగటివ్ రోల్స్ చేయాలని ఉంది. ఇక ఏ ప్రభుత్వమైనా సినీ పరిశ్రమకు తగిన గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలి. నంది అవార్డులని పరిశ్రమ గౌరవంగా చూస్తుంది. కానీ ఇప్పుడా అవార్డులని ఇవ్వడం లేదు.. మళ్లీ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మా అబ్బాయి నవీన్‌కి దర్శకుడిగా మంచి భవిష్యత్ ఉంటుందని నమ్ముతున్నాను. మా విజయ కృష్ణ గ్రీన్ స్టూడియోస్‌ని మోడ్రన్ స్టూడియోగా చేస్తున్నాం'' అన్నారు.

చూడు నాన్నా.. ఏమిటీ ఇంతటీ ప్రేమ!

ఆంధ్రప్రదేశ్‌లో 2009 నుంచి 2019 వరకు జరిగిన రాజకీయ ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'యాత్ర 2'. 2019లో విడుదలై, హిట్‌గా నిలిచిన 'యాత్ర' చిత్రానికి సీక్వెల్‌గా మహి వి. రాఘవ్ దర్శకత్వంలో 'యాత్ర 2' రూపొందింది. ఇందులో దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో నటుడు మమ్ముట్టి, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా నటించారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్‌తో కలసి శివ మేక నిర్మించిన 'యాత్ర 2' ఫిబ్రవరి 8న విడుదల కానుంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చూడు నాన్నా..' అంటూ సాగే లిరికల్ వీడియోను విడుదల చేశారు. 'చూడు నాన్నా.. చూస్తున్నావా నాన్నా, నీడ లేని నేనా వీళ్ల ధీమా.. ఏమిటీ ఇంతటీ ప్రేమ...' అంటూ భావోద్వేగంగా సాగే ఈ పాటకి భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ''వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిగారు ప్రజానాయకుడిగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రకథ ఉంటుంది'' అని మేకర్స్ ప్రకటించారు.



● జీవా...

105.. ఓ ప్రయోగం - హన్సిక



''ముప్పై నాలుగు నిమిషాల షాట్‌ని '105 మినిట్స్' సినిమా కోసం సింగిల్ టేక్‌లో చేయడం అనేది నాకు ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్. దాదాపు ఎనిమిది రోజుల రిహార్సల్స్ తర్వాత ఈ షాట్ చేశాం. ఇలాంటి ప్రయోగాలు ఈ సినిమాలో చాలా ఉన్నాయి'' అని హన్సిక అన్నారు. హన్సిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం '105 మినిట్స్'. రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హన్సిక మాట్లాడుతూ – ''పూర్తి స్థాయి ప్రయోగాత్మక చిత్రం ఇది. ప్రేక్షకులు థియేటర్స్‌లో మా సినిమాను చూసి, సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''సింగిల్ సిట్టింగ్‌లోనే హన్సికగారు ఈ సినిమా కథ ఒప్పుకున్నారు'' అన్నారు రాజు దుస్సా. ''ఈ సినిమాను ముందు ప్రపంచవ్యాప్తంగా తెలుగులో విడుదల చేస్తాం. ఆ తర్వాత ఇతర భాషల్లో విడుదల చేస్తాం'' అన్నారు సహనిర్మాత సుమన్.

కావాలనే టార్గెట్ చేశారు - నిర్మాత ఎస్. నాగవంశీ



''గుంటూరు కారం' చిత్రానికి మొదటి రోజు కొందరి నుంచి నెగటివ్ రివ్యూలు వచ్చినా మహేశ్ బాబుగారు మాత్రం రేపటి నుంచి ఈ సినిమా వసూళ్లు పెరుగుతాయని భరోసా ఇచ్చారు.. ఆయన అంచనా నిజమైంది. మా సినిమా మొదటి వారంలోనే రూ. 212 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు రాబట్టింది'' అని నిర్మాత ఎస్. నాగవంశీ అన్నారు. మహేశ్‌బాబు, శ్రీలీల జంటగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గుంటూరు కారం'. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలైంది. ఈ నేపథ్యంలో నిర్మాత ఎస్. నాగవంశీ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ– ''గుంటూరు కారం'ని కొందరు కావాలని టార్గెట్ చేశారనే అభిప్రాయాలున్నాయి. ఈ సినిమా విడుదలైన రోజు కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులను గందరగోళానికి గురి చేసే ప్రయత్నం చేశారు. కానీ, కుటుంబ ప్రేక్షకులు, సాధారణ ప్రేక్షకులు సినిమాకి రావడంతో అదే రోజు సాయంత్రానికి టాక్ మారిపోయింది. ఇది ఇప్పటిదాకా సాధించిన వసూళ్లే చెబుతున్నాయి. ఇది మాస్ సినిమా అని అందరూ భావించారు. తల్లీకొడుకుల సెంటిమెంట్ బాగా కుదిరింది. కుటుంబ ప్రేక్షకులు మా సినిమాని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. అయినా జానర్‌ను బట్టి ఒక్కో సినిమా ఒక్కో ప్రాంతంలో ఎక్కువ వసూళ్లు రాబడుతుంది. కేవలం ఒక ఏరియా వసూళ్లను చూసి సినిమా ఫలితాన్ని నిర్ణయించలేం. మా సినిమా బయ్యర్లు కూడా సంతోషంగా ఉన్నారు'' అన్నారు.

సైతాన్ ఎవరు?

● మాధవన్





● జ్యోతిక



● అజయ్ దేవగన్

మార్చిలో థియేటర్స్‌కు వస్తున్నాడు సైతాన్. అజయ్ దేవగన్, మాధవన్, జ్యోతిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ 'సైతాన్'. అయితే ఈ చిత్రంలో సైతాన్ ఎవరనేది యూనిట్ బయటపెట్టలేదు. వికాస్ బహల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేసి, సినిమాను మార్చి 8న రిలీజ్ చేయనున్నట్లుగా యూనిట్ ప్రకటించింది. అజయ్ దేవగన్, జ్యోతి దేశ్ పాండే, కుమార్ మంగత్ పాతక్, అభిషేక్ పాతక్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
20-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	496	71,683
నిఫ్టీ ▲	160	21,622

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,159	▲ 104
డోజోన్స్	37,649	▲ 180
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,464	▲ 5
డాక్స్	16,549	▽ 21
షాంఘై	2,833	▽ 14
నికాయ్	35,963	▲ 497

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,390	▲ 420
బంగారం (99.5 స్వచ్ఛత)	62,140	▲ 418
వెండి (కేజీ)	71,228	▲ 330

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.75	83.77
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.56	107.12
€	యూరో	ఒకటి	89.46	91.83
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.54	56.80
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.85	55.78
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.21	62.67
SAR	సౌదీ రియాల్	ఇంటర్‌బ్యాంక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	ఇంటర్‌బ్యాంక్	21.69	23.51
¥	చైనా యువాన్	ఇంటర్‌బ్యాంక్	10.39	12.49

మెప్పించని హెచ్‌యూఎల్

- లాభం, ఆదాయంలో కనిపించని వృద్ధి
- కొన్ని విభాగాల్లో ధరల తగ్గింపు ప్రభావం



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) డిసెంబర్ త్రైమాసికంలో ఫ్లాట్ పనితీరు చూపించింది. లాభం, ఆదాయంలో వృద్ధి కనిపించలేదు. రూ.2,508 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని సంస్థ ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,481 కోట్లతో పోలిస్తే ఒక శాతమే పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో రూ.15,314 కోట్ల నుంచి రూ.15,259 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు స్వల్పంగా పెరిగి రూ.12,305 కోట్లకు చేరాయి. వ్యాపారంలో 75 శాతం వాటా కలిగిన హోమ్‌కేర్, బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ విభాగం అమ్మకాల పరిమాణంలో వృద్ధి కనిపించింది. స్థూల మార్జిన్ 4% మేర.. ప్రకటనలు, ప్రచారంపై పెట్టుబడులు 2.7% పెరిగాయి.

- రిన్, సర్ఫ్ ఎక్సెల్, విమ్, వీల్ తదితర ఉత్పత్తులతో కూడిన హోమ్‌కేర్ విభాగం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 1.26 శాతం తక్కువగా రూ.5,444 కోట్లకు పరిమితమైంది.
- బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ విభాగం ఆదాయం ఫ్లాట్‌గా రూ.5,782 కోట్లుగా నమోదైంది.
- ఫుడ్స్ అండ్ రీఫ్రెష్‌మెంట్ విభాగం ఆదాయం 1% పెరిగి రూ.3,733 కోట్లుగా ఉంది.

బీఎస్‌ఈలో హెచ్‌యూఎల్ షేరు ధర ఒక శాతం లాభంతో రూ.2,565 వద్ద స్థిరపడింది.

రిలయన్స్ లాభం 17,265 కోట్లు

- క్యూ3లో 9 శాతం వృద్ధి
- మెరుగుపడిన ఆపరేటింగ్ మార్జిన్
- జియో, రిటైల్ దూకుడు
- ఆయిల్, కెమికల్స్‌లో బలహీనత



"భారత్‌లో పూర్తి స్థాయి 5జీ సేవలను అత్యంత వేగంగా అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రతి పట్టణం, ప్రతి గ్రామం ఇప్పుడు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని కలిగి ఉంది. డిజిటల్ సదుపాయాలు, టెక్నాలజీ వృద్ధికి ఇది దోహదం చేస్తుంది. కొత్త బ్రాండ్లను జోడించుకోవడం ద్వారా కస్టమర్లకు మరింత మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడంపై రిలయన్స్ రిటైల్ దృష్టి కొనసాగిస్తుంది"

– ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ

న్యూఢిల్లీ: ఆయిల్ నుంచి రిటైల్ వరకు ఎన్నో వ్యాపారాలు నిర్వహిస్తున్న డైవర్సిఫైడ్ కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ డిసెంబర్ త్రైమాసికంలో మిశ్రమ పనితీరు చూపించింది. రిటైల్, టెలికం వ్యాపారాలు రాణించగా, ఆయిల్ టు కెమికల్స్ (ఓటూసీ) నిరాశపరిచింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 9.3 శాతం పెరిగి రూ.17,265 కోట్లకు చేరుకుంది. షేరువారీ ఆర్జన రూ.25.52గా ఉంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 3.6 శాతం వృద్ధితో రూ.2.28 లక్షల కోట్లుగా నమోదైంది. కానీ, 2023 సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చి చూస్తే నికర లాభం 0.7 శాతం, ఆదాయం 3 శాతం చొప్పున తక్కువగా నమోదయ్యాయి. ఎబిటా (ఆపరేటింగ్ మార్జిన్) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 2.10 శాతం మేర, 2023 డిసెంబర్ త్రైమాసికంతో పోల్చితే 0.50 శాతం మేర పెరిగి 18 శాతానికి చేరింది. రుణాలపై వ్యయాలు 11 శాతం పెరిగి రూ.5,789 కోట్లుగా ఉన్నాయి. బ్యాలన్స్ షీటులో నగదు, నగదు సమానాలు రూ.1.92 లక్షల కోట్లుగా ఉన్నాయి. కన్సాలిడేటెడ్ రుణ భారం రూ.3.12 లక్షల కోట్లుగా, నికర రుణ భారం రూ.1,19,372 కోట్లుగా ఉంది.

రిటైల్ భేష్...

- రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్ఆర్వీఎల్) కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 40 శాతం పెరిగి రూ.3,165 కోట్లకు చేరింది.
- స్థూల ఆదాయం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 23 శాతం వృద్ధితో రూ.83,063 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికంలో కంపెనీకి ఇదే అత్యధిక ఆదాయం.
- ఎబిటా 31% పెరిగి రూ.6,258 కోట్లు.
- గత త్రైమాసికంలో 252 స్టోర్లను కొత్తగా ప్రారంభించింది. దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 18,774కు చేరింది.

ఆయిల్, కెమికల్స్...

ఆయిల్ టు కెమికల్స్ విభాగంలోనే బలహీనత కనిపించింది. నిర్వహణ పనుల కోసం జామ్‌నగర్‌లోని రిఫైనరీ ప్లాంట్లను ఏడు వారాలు మూసివేయడం ప్రభావం చూపించింది. ఆయిల్ టు కెమికల్స్ ఆదాయం 2.4% తగ్గి రూ.1.41 లక్షల కోట్లుగా ఉంది. ఆయిల్ అండ్ గ్యాస్ ఆదాయం 50% వృద్ధితో రూ.6,719 కోట్లకు ఎగసింది.

రిలయన్స్ షేరు ఫ్లాట్‌గా రూ.2,736 వద్ద ముగిసింది. మార్కెట్లు ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.

జియో జూమ్...

టెలికం, డిజిటల్ వ్యాపారం రాణించింది. నికర లాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 12% పెరిగి రూ.5,445 కోట్ల గా ఉంది. ఆదాయం 11 శాతానికి పైగా వృద్ధితో రూ.32,510 కోట్లుగా నమోదైంది. జియో వరకే చూస్తే లాభం 12% పెరిగి రూ.5,208 కోట్లుగా ఉంది. ఆదాయం 10% వృద్ధితో రూ.25,368 కోట్లకు చేరింది. ఒక్కో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం రూ. 181.70కి చేరింది. ఏడాది క్రితం రూ. 178గా ఉంది. 2023 సెప్టెంబర్ క్వార్టర్‌తో పోలి స్తే ఫ్లాట్‌గా ఉంది. డిసెంబర్ నాటికి కస్టమర్ల సంఖ్య 470.09 మిలియన్లకు చేరింది. నికరంగా 11.2 మిలియన్ల కస్టమర్లు జతయ్యారు. 9 కోట్ల మంది 5జీ నెట్‌వర్క్‌కు మళ్లారు.

హిందుస్తాన్ జింక్ లాభం 6% డౌన్



న్యూఢిల్లీ: జింక్, సిల్వర్ తయారీ సంస్థ హిందుస్థాన్ జింక్ డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.2,028 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,156 కోట్లతో పోల్చిచూసినప్పుడు 6% తగ్గింది. కానీ, 2023 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం లాభం రూ.1,729 కోట్లతో పోల్చి చూస్తే, 17 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ఆదాయం సైతం 7 శాతం క్షీణించి రూ.7,606 కోట్లతకు పరిమితమైంది. వ్యయాలను రూ.5,028 కోట్ల నుంచి రూ.4,937 కోట్లకు కట్టడి చేసింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో షేరు ఒక శాతం మేర లాభపడి రూ.315 వద్ద ముగిసింది.

తనిష్క్ 'ఫెస్టివల్ ఆఫ్ డైమండ్స్'

హైదరాబాద్: భారతీయ అతిపెద్ద జ్యువెలరీ రిటైల్ బ్రాండ్ తనిష్క్ 'ఫెస్టివల్ ఆఫ్ డైమండ్స్' వేడుకలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ప్రారంభ ధర రూ.15 వేలతో అత్యాధునిక, సరికొత్త వజ్రాభరణాలను అందుబాటులోకి తెచ్చింది. కొనుగోలు విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. పాత బంగారంపై 100% ప్రస్తుత విలువతో కొత్త వజ్రాభరణాల కోసం మార్చుకోవచ్చు. దేశవ్యాప్తంగా అన్ని తనిష్క్ స్టోర్లు, ఆన్‌లైన్ ద్వారా 'ఫెస్టివల్ ఆఫ్ డెమండ్స్' ఆఫర్లు పొందవచ్చని కంపెనీ తెలిపింది.

జెట్‌సెట్‌గో భారీ డీల్...

- 280 హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డర్
- డీల్ విలువ సుమారు రూ.10,790 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ విమాన సర్వీసుల రంగంలో ఉన్న జెట్‌సెట్‌గో భారీ డీల్‌కు తెరలేపింది. ఇందులో భాగంగా 280 హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను సమకూర్చుకుంటోంది. హైదరాబాద్ బేగంపేటలో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2024 వేదికగా ఎలెక్ట్రా, ఏరో, హొరిజన్ ఎయిర్‌క్రాఫ్ట్, ఓవర్‌ఎయిర్‌తో జెట్‌సెట్‌గో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. డీల్ విలువ సుమారు రూ.10,790 కోట్లు. హొరిజన్ తయారీ 50 కెవోరైట్ ఎక్స్7 ఎలక్ట్రిక్ వెర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ (ఈవీటోల్) ఎయిర్‌క్రాఫ్ట్‌లను సమకూర్చుకుంటున్నట్టు సమాచారం. మరో 50 ఎక్స్7 ఈవీటోల్స్ తీసుకునే అవకాశమూ ఉంది. నగరాల్లో ఎయిర్‌ట్యాక్సీలుగా, విమానాశ్రయం నుంచి ఇతర ప్రాంతాలకు, వివిధ ప్రదేశాలకు, నగరాల మధ్య, నగరంలో ఒకచోటు నుంచి మరోచోటుకు వెళ్లేందుకు హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను వినియోగించవచ్చని జెట్‌సెట్‌గో శుక్రవారం వెల్లడించింది. 'ఈ మూడు కంపెనీలతో భాగస్వామ్యం భారత్‌కు బ్లోన్ లిఫ్ట్, ఫ్యాన్ ఇన్ వింగ్ లిఫ్ట్ సిస్టమ్స్, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ ప్రొపల్షన్, సూపర్-క్వైట్ ఆప్టిమల్ స్పీడ్ టిల్ట్ రోటర్స్ వంటి ప్రత్యేక సాంకేతికతలను పరిచయం చేస్తుంది' అని జెట్‌సెట్‌గో ఫౌండర్, సీఈవో కనిక టేక్రివాల్ తెలిపారు.

3 రోజుల వరుస నష్టాలకు చెక్



ముంబై: ఐటీ, ఫైనాన్స్, ఇంధన రంగాల షేర్లు రాణించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని రికవరీతో దేశీయ స్టాక్ సూచీలు మూడు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. సెన్సెక్స్ 496 పాయింట్లు పెరిగి 71,683 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 160 పాయింట్లు బలపడి 21,622 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాలతో మొదలయ్యాయి. ఇటీవల మార్కెట్ పతనంలో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన అధిక వెయిటేజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా స్థిరమైన లాభాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 709 పాయింట్లు ఎగసి 71,896 వద్ద, నిఫ్టీ 209 పాయింట్లు దూసుకెళ్లి 21,670 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. మీడియా, ప్రైవేట్ రంగ బ్యాంకులు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు పతనం ఆగడం లేదు. బీఎస్‌ఈలో 1% నష్టపోయి రూ.1471 వద్ద స్థిరపడింది. వరుసగా 4 రోజుల్లో 10% క్షీణించింది.

నేడు ట్రేడింగ్, 22న సెలవు

అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం సోమవారం (22న) సెలవు దినంగా ప్రకటించింది. దీంతో 22న ఎన్ఎస్‌ఈ, బీఎస్‌ఈ కూడా సెలవు ప్రకటించాయి. కాగా నేడు (20న) ఉదయం 9:15 నుంచి 3:30 వరకు ఎప్పటిలాగానే ట్రేడింగ్ ఉంటుందని ఎక్స్ఛేంజీలు తెలిపాయి.

2042 నాటికి మరో 2,500 విమానాలు

- భారత మార్కెట్‌పై బోయింగ్ అంచనా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత విమానయాన రంగానికి 2042 నాటికి మరో 2,500కు పైగా విమానాలు అవసరం అవుతాయని బోయింగ్ అంచనా వేస్తోంది. 'పెరుగుతున్న ప్రయాణికులు, సరుకు రవాణా డిమాండ్‌ను తీర్చడానికి దక్షిణాసియాకు చెందిన విమానయాన సంస్థలు రాబోయే రెండు దశాబ్దాలలో తమ విమానాల పరిమాణాన్ని నాలుగు రెట్లు పెంచుతాయని అంచనా. వృద్ధి, విమానాల భర్తీని పరిష్కరించడానికి ఈ కంపెనీలకు 2,705 కంటే ఎక్కువ కొత్త విమానాలు అవసరమవుతాయి. ఇందులో 92 శాతం భారత్ కైవసం చేసుకుంటుంది' అని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ డేరిన్ హస్ట్ శుక్రవారం మిక్కడ మీడియాకు తెలిపారు. అంచనా వేసిన మొత్తం విమానాల్లో.. తక్కువ దూరం ప్రయాణించడానికి అనువైన చిన్న విమానాలు 2,300లకుపైగా, సుదూర ప్రాంతాల కోసం సుమారు 400 విమానాలు అవసరం అవుతాయని చెప్పారు. ఆసియాలో దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పరంగా మహమ్మారి ముందస్తు స్థాయికి పుంజుకున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ, పెద్ద మార్కెట్ భారత్ మాత్రమేనని ఆయన అన్నారు.

సాక్షి స్పోర్ట్స్



ఆస్ట్రేలియా 10 వికెట్లతో ఘనవిజయం

వెస్టిండీస్‌తో అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 73/6తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన వెస్టిండీస్ 35.2 ఓవర్లలో 120 పరుగులకే ఆలౌటైంది. హాజల్‌వుడ్ (5/35) విండీస్‌ను దెబ్బ కొట్టాడు. అనంతరం 26 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 6.4 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది. ఉస్మాన్ ఖ్వాజా (9) రిటైర్ట్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. స్మిత్ (11 నాటౌట్; 2 ఫోర్లు), లబుషేన్ (1 నాటౌట్) లాంఛనాన్ని పూర్తిచేశారు. రెండు టెస్టుల సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలో ఉంది. ఆఖరి టెస్టు 25 నుంచి బ్రిస్బేన్‌లో జరుగుతుంది.

నేడే బంగ్లాదేశ్‌తో భారత్ 'ఢీ'

దక్షిణాఫ్రికాలో జరుగుతున్న అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో భాగంగా నేడు గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టుతో భారత్ తలపడుతుంది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-1 చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సింగిల్స్ చాంపియన్ శ్రీజ

డబ్ల్యూటీటీ ఫీడర్ టోర్నీలో టైటిల్ సొంతం • ఫైనల్లో ప్రపంచ 46వ ర్యాంకర్‌పై గెలుపు



టెక్సస్ (అమెరికా): రెండుసార్లు జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం ముగిసిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ టోర్నీలో 25 ఏళ్ల శ్రీజ మహిళల సింగిల్స్ విభాగంలో చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో శ్రీజ 11-6, 18-16, 11-5తో ప్రపంచ 46వ ర్యాంకర్ లిలీ జాంగ్ (అమెరికా)పై గెలిచింది. విజేతగా నిలిచిన ప్రపంచ 94వ ర్యాంకర్ శ్రీజకు 650 డాలర్ల (రూ. 54 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 125 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. టైటిల్ గెలిచిన క్రమంలో శ్రీజ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 37వ ర్యాంకర్ అమీ వాంగ్ (అమెరికా)పై 11-9, 9-11, 11-1, 6-11, 11-9తో గెలుపొందడం విశేషం. 'చాలా సంతోషంగా ఉన్నా. నా కష్టానికి తగ్గ ఫలితం లభించింది. అంతర్జాతీయస్థాయిలో నాకిదే తొలి టైటిల్. నాకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న క్రీడాకారిణులను ఓడించి విజేతగా నిలిచినందుకు ఆనందంగా ఉంది' అని రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బీఐ)లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీజ వ్యాఖ్యానించింది.

మహిళల హాకీ మనోవేదన!

- పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేకపోయిన భారత జట్టు
- జపాన్ చేతిలో 0-1తో పరాజయం
- 9 పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసిన టీమిండియా

సొంతగడ్డపై అర్హత టోర్నీ... 8 జట్లలో టాప్-3లో నిలిస్తే సరిపోయే సులువైన ఫార్మాట్... ప్రత్యర్థి బలహీనమైన జపాన్... ఆ టీమ్‌పై గత ఐదు మ్యాచ్‌లలో వరుసగా గెలిచిన రికార్డు... క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో 9 పెనాల్టీ కార్నర్ అవకాశాలు ... కానీ ఒక్క దానినీ గోల్‌గా మలచలేని వైఫల్యం... వెరసి వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాన్ని భారత మహిళల హాకీ జట్టు కోల్పోయింది... గత టోక్యో ఒలింపిక్స్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో నాలుగో స్థానంలో నిలిచి ఆశలు రేపిన జట్టు ఈసారి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత కాలేకపోయింది.



రాంచీ: భారత మహిళల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్ అవకాశాలు గల్లంతయ్యాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో కనీసం మూడో స్థానంలో నిలిస్తేనే ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉండగా, భారత్ దానిని కోల్పోయింది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో జపాన్ చేతిలో 0-1 గోల్ తేడాతో ఓటమి పాలైంది. జపాన్ తరఫున 6వ నిమిషంలో కానా ఉరాటా పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించింది. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా మన జట్టు స్కోరును సమం చేయలేకపోయింది. శుక్రవారం జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో జర్మనీ 2-0తో అమెరికాను ఓడించింది. టాప్-3లో నిలువడం ద్వారా జర్మనీ, అమెరికా, జపాన్ జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి.

సమష్టి వైఫల్యం...

జపాన్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. రెండో నిమిషంలోనే గోల్ చేసేందుకు చేరువగా వచ్చినా భారత కీపర్ సవిత అడ్డుకోగలిగింది. అయితే మరో నాలుగు నిమిషాల వ్యవధిలోనే జపాన్‌కు రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చాయి. మొదటిసారి విఫలమైనా... రెండో సారి సవిత అడ్డంకిని దాటడంలో జపాన్ సఫలమైంది. ఆ తర్వాతి నుంచి జపాన్ తమ ఏకైక గోల్‌ను నిలబెట్టుకునేందుకు డిఫెన్స్‌పై బాగా దృష్టి పెట్టింది. దీనిని ఛేదించేందుకు భారత ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో వరుసగా పెనాల్టీలను మన జట్టు వృథా చేసుకుంది. 12వ నిమిషంలో మోనిక అందించిన పాస్‌తో లాల్‌రెమిసియామి చేసిన ప్రయత్నంలో బంతి గోల్‌పోస్ట్‌పైనుంచి వెళ్లిపోయింది. రెండో క్వార్టర్‌లో రెండు పెనాల్టీ అవకాశాలను దీపిక గోల్‌గా మలచలేకపోయింది. ఆపై ఒత్తిడిని లోనైన ప్లేయర్లు పాస్‌లు ఇవ్వడం మానేసి ఆశ్చర్యకరంగా 30 గజాల సర్కిల్ నుంచే బంతిని బలంగా బాదే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత వచ్చిన పెనాల్టీలను ఉదిత వృథా చేసింది. చివరి 11 నిమిషాల్లో కూడా భారత్‌కు 3 పెనాల్టీలు దక్కగా ఈసారి కూడా దీపిక, ఉదిత చేతులెత్తేశారు. ఆట ముగియడానికి కొద్దిసేపు ముందు జపాన్ పటిష్ఠ డిఫెన్స్‌ను ఛేదించి సలీమా టెటె గోల్‌పోస్ట్ వైపు దూసుకుపోయినా... ఆమె కొట్టిన షాట్ పోస్ట్‌కు దూరంగా వెళ్లిపోయింది.

పని చేయని వ్యూహాలు...

టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టు అసిస్టెంట్ కోచ్‌గా పని చేసిన నెదర్లాండ్స్ మాజీ ప్లేయర్ జేన్‌కే స్కాప్‌మన్ ఇప్పుడు టీమ్ హెడ్ కోచ్‌గా ఉంది. సీనియర్లను పక్కన పెట్టి చాలా వరకు యువ క్రీడాకారిణులతోనే ఫలితాలు రాబట్టేందుకు ఆమె చేసిన ప్రయత్నం ఫలితమివ్వలేదు. రెగ్యులర్ డ్రాగ్‌ఫ్లికర్ ఒక్కరూ లేకుండా ఫార్వర్డ్‌లను పెనాల్టీ గోల్ కోసం నమ్ముకోవడం పెద్ద తప్పు. ఈ టోర్నీలో జర్మనీ మినహా ర్యాంకింగ్‌పరంగా మిగతా జట్లన్నీ భారత్ కంటే బలహీనమైనవే. మనల్ని ఓడించిన జపాన్ జట్టుకు భారత మాజీ ఆటగాడు జూడ్ మెనెజెస్ హెడ్ కోచ్ కావడం విశేషం.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-7, 21-10తో కిమ్ ఆస్‌ట్రుప్-స్కారుప్ రసముసెన్ (డెన్మార్క్) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 21-11, 17-21, 21-18తో జు వె వాంగ్ (చైనీస్ తైపీ)పై గెలుపొంది సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు.

తెలుగు టైటాన్స్ ఓటమి

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం హైదరాబాద్ అంచె పోటీలు మొదలయ్యాయి. సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ జట్టు 26-42 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్ చేతిలో ఓడిపోయింది. ఈ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టుకిది 12వ పరాజయం కావడం గమనార్హం. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ ఏడు పాయింట్లు స్కోరు చేశాడు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 34-31తో యూపీ యోధాస్‌ను ఓడించింది.



పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
జైపూర్ పింక్ పాంథర్స్	14	10	2	2	58
పుణేరి పల్టన్	12	10	2	0	52
దబంగ్ ఢిల్లీ	13	7	4	2	44
గుజరాత్ జెయింట్స్	13	8	5	0	44
హరియాణా స్టీలర్స్	13	7	5	1	39
బెంగాల్ వారియర్స్	13	6	5	2	38
పట్నా పైరేట్స్	14	6	7	1	37
బెంగళూరు బుల్స్	14	6	8	0	37
యు ముంబా	12	6	5	1	36
తమిళ్ తలైవాస్	13	4	9	0	25
యూపీ యోధాస్	14	3	10	1	23
తెలుగు టైటాన్స్	13	1	12	0	10

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

మెరిసిన తనయ్, తన్మయ్, మిలింద్

- 302 పరుగుల ఆధిక్యంలో హైదరాబాద్
- తొలి ఇన్నింగ్స్‌లో సిక్కిం 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో హైదరాబాద్ క్రికెట్ జట్టు తమ జోరు కొనసాగిస్తోంది. ఇప్పటికే నాగాలాండ్, మేఘాలయ జట్లపై ఇన్నింగ్స్ విజయాలు నమోదు చేసిన హైదరాబాద్ వరుసగా మూడో విజయంపై కన్నేసింది. సిక్కిం జట్టుతో శుక్రవారం మొదలైన మూడో మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ 302 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సిక్కిం జట్టును హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (6/25), సీవీ మిలింద్ (4/30) హడలెత్తించారు. ఎడంచేతి వాటం స్పిన్నర్ తనయ్, మీడియం పేసర్ మిలింద్ దెబ్బకు సిక్కిం తొలి ఇన్నింగ్స్‌లో 27.4 ఓవర్లలో కేవలం 79 పరుగులకే ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 62 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 381 పరుగులు సాధించింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (125 బంతుల్లో 137; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ చేయగా... రాహుల్ సింగ్ గహ్లోత్ (64 బంతుల్లో 83; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు), రోహిత్ రాయుడు (111 బంతుల్లో 75; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. తన్మయ్, రాహుల్ తొలి వికెట్‌కు 18 ఓవర్లలో 132 పరుగులు జోడించడం విశేషం. తన్మయ్, రోహిత్ రాయుడు రెండో వికెట్‌కు 138 పరుగులు జత చేశారు. ప్రస్తుతం కెప్టెన్ తిలక్ వర్మ (66 బంతుల్లో 70 బ్యాటింగ్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), చందన్ సహని (8 బ్యాటింగ్; 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.



తన్మయ్ అగర్వాల్



తనయ్ త్యాగరాజన్



సీవీ మిలింద్

ఆంధ్ర 188 ఆలౌట్

దిబ్రూగఢ్: అస్సాం జట్టుతో శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 72.1 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. 70 పరుగులకే 6 వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడిన ఆంధ్ర జట్టును షోయబ్ మొహమ్మద్ ఖాన్ (63; 3 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (49; 4 ఫోర్లు) ఏడో వికెట్‌కు 113 పరుగులు జోడించి ఆదుకున్నారు. అస్సాం బౌలర్లలో రాహుల్ సింగ్ (6/46), ముక్తార్ (2/45), ఆకాశ్ (2/37) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అస్సాం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది.

సబలెంకా జోరు

- సురెంకోపై 6-0, 6-0తో ఘనవిజయం
- ప్రిక్వార్టర్ ఫైనల్లోకి డిఫెండింగ్ చాంపియన్



మెల్‌బోర్న్: టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా ఆ దిశగా మరో అడుగు వేసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో రెండో సీడ్ సబలెంకా విశ్వరూపం ప్రదర్శించింది. ప్రపంచ 33వ ర్యాంకర్, 28వ సీడ్ లెసియా సురెంకో (ఉక్రెయిన్)తో జరిగిన మ్యాచ్‌లో సబలెంకా 6-0, 6-0తో ఘనవిజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. కేవలం 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా తన ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ సినెర్ (ఇటలీ), ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. డబుల్స్ రెండో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-2, 6-4తో మిల్మన్-వింటర్ (ఆస్ట్రేలియా) జోడీపై గెలిచింది. తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)-కార్నియా (రొమేనియా) జంట 6-3, 6-4తో అర్నాల్డీ-పెలెగ్రినో (ఇటలీ) జోడీపై నెగ్గింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


Reliance
NOW OPEN AT
• KONDAPUR X ROADS, BESIDE RATNADEEP SUPER MARKET
• NEXUS HYDERABAD MALL, GROUND FLOOR, KPHB
• NAGOLE, KINARA GRAND BUILDING
• HASTINAPURAM, NEAR TRAFFIC SIGNALS
Reliance digital
PERSONALISING TECHNOLOGY
కొత్త తరం దేశం కోసం కొత్త టెక్
డిజిటల్ ఇండియా సేల్
భారతదేశపు అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ సేల్
20 – 28 జనవరి 2024
₹26 000 వరకు
ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
₹10 000* వరకు
₹16 000* వరకు
ICICI Bank
onecard
అన్ని క్రెడిట్ & డెబిట్ కార్డ్స్ పై
QLED 4K
AKAI
Google TV
109cm (43) QLED ₹24 990
139cm (55) QLED ₹35 990
127 CM (50) 4K ULTRA HD Google TV
BPL SANSUI SONY TCL
Starting from ₹26 990
OLED TV
2 Year WARRANTY
Starting from ₹89 990*
LG SAMSUNG SONY
EMIs of ₹3990*
BENEFITS UP TO ₹15000 CASHBACK ON LEADING BANKS* + SOUND BAR WORTH ₹45990 FREE (ON SELECT OLEDS)
LG NanoCell ULTRA BRIGHT PANEL 65NANO83
2 Year WARRANTY
165 cm (65) ₹89 990*
EMIs of ₹2990*
BENEFITS GET CASHBACK UPTO ₹7500* ON LEADING BANKS
GAMING LAPTOP Intel® Core™ i5 RTX 2050 Starting from ₹54 999* EMIs of ₹4583*
EVERDAY LAPTOP Intel® Core™ i3 Starting from ₹29 999* EMIs of ₹2500*
MULTI TASKING LAPTOP Intel® Core™ i5 Starting from ₹44 999* EMIs of ₹3833*
CREATOR LAPTOP Intel® Core™ i7 Starting from ₹44 999* EMIs of ₹4167*
AMD R5 RTX 3050 Starting from ₹58 999* EMIs of ₹4999*
AMD R3 Starting from ₹33 499* EMIs of ₹2792*
AMD R5 Starting from ₹35 999* EMIs of ₹3083*
AMD R7 Starting from ₹49 999* EMIs of ₹4167*
GET TROLLEY BAG WORTH ₹7000 ON LAPTOP PURCHASE
WATCH S9 41 mm GPS ₹41 900 ₹34 499*
*Price post bank cashback
AirPods Pro 2nd Gen (USB-C) ₹24 900 ₹19 900* EMIs of ₹829*
*Inclusive of cashback
BEST DEAL
DOLBY ATMOS SOUNDBAR
JBL | SONY | Samsung | boAt | LG
Starting from ₹17 999
SAMSUNG
Introducing Galaxy S24 Series
Galaxy AI is here
Your Choice. Our Promise. Guaranteed Availability. Else, Get ₹10000* worth Gift Vouchers!
Pre Book Now
*T&C Apply.
OnePlus Nord CE 3 Lite 5G
₹21 999 Starting from ₹19 999*
*Price post cashback
SAMSUNG
A15 ₹19 499 Starting from ₹17 999*
A25 ₹26 999 Starting from ₹23 999*
*Price post cashback
iPhone
13/128 ₹59 900 ₹52 900*
14/128 ₹69 900 ₹59 900*
15/128 ₹79 900 ₹73 900*
*Price post in store discount and brand cashback
iPad
9th Gen WiFi 64GB EMI ₹1042*
Air 5 WiFi 64GB EMI ₹2246*
FROST FREE
LG 242L ₹22 990* EMIs of ₹1916*
HAIER 237L ₹23 490* EMIs of ₹1958
SAMSUNG 301L ₹32 490* EMIs of ₹2708
SIDE BY SIDE
KELVINATOR 584L ₹51 990* EMIs of ₹4333*
SAMSUNG 653L ₹85 490* EMIs of ₹7124
LG 635L ₹97 490* EMIs of ₹8124
8Kg FRONT LOAD Starting from ₹31 990* EMIs of ₹2666*
9Kg FRONT LOAD Starting from ₹35 990* EMIs of ₹2999*
*Prices after bank cashback
BUY ANY SMALL APPLIANCE WORTH ₹2999 WITH UPI AND GET 10% INSTANT CASHBACK
GEYSER
HAVELLS 3L ₹3239
BAJAJ 15L ₹6749
HAVELLS 15L ₹11429
*Price after Cashback
MIXER & GRINDER
PHILIPS 750W 4J ₹4229
HAVELLS 750W 4J ₹4409
BOSCH 1000W 4J ₹5849
*Price after Cashback
సరికొత్త టెక్ విస్తృత శ్రేణి
అతితక్కువ ధరలు*
సులభ ఈఎమ్‌ఐలు
వేగవంతమైన డెలివరీ మరియు ఇన్స్టాలేషన్
Reliance resQ
పర్సనలైజ్డ్ గైడెన్స్ | సర్వీస్ | మెయింటెనెన్స్
1800 889 1044
reliancedigital.in
MY JIO STORE
Jio DIGITAL LIFE
VISIT US AT HYDERABAD: • RC PURAM, CINEMART, BESIDE D MART • NARSINGI, NEXT TO OM CONVECTION • NEXUS HYDERABAD MALL, GROUND FLOOR, KPHB • MIYAPUR, OPP. K.S. BAKERS, NEAR MIYAPUR X ROAD. • KONDAPUR X ROADS, BESIDE RATNADEEP SUPER MARKET • TOLICHOWKI, NEXT TO RELIANCE SMART BUILDING • NAGOLE, KINARA GRAND BUILDING, NEAR ALKAPURI X ROAD, OPP. GREEN HONDA CAR SHOWROOM • DILSHUKNAGAR, PILLAR NO: 1521, OPP.TO OLD JR.COLLEGE, VIJAYA DIAGNOSTICS LANE • GOWLIDODDY, Q CITY ROAD, BESIDE APARNA SHANGRILLA • NALLAGANDALA, TOWARDS CITIZEN HOSPITAL ROAD • MADINAGUDA, BESIDE HYUNDAI SHOWROOM • KUKATPALLY, OPP BJP OFFICE • BALANAGAR, A2A CENTRAL, OPP IDPL WATER TANK • NSL MALL, KPHB PHASE 5 • INORBIT MALL, LOWER GROUND FLOOR • KONDAPUR, SARATH CITY CAPITAL MALL • GACHIBOWLI, RELIANCE SMART BUILDING • ATTAPUR, BESIDE SOUTHINDIA SHOPPING MALL • SUN CITY, OPP HP PETROL PUMP • BANJARA HILLS, ROAD NO 12, BESIDE OHRIS • S R NAGAR, BESIDE METRO STATION • PUNJAGUTTA, BESIDE HYDERABAD CENTRAL • SECUNDRABAD, SD ROAD, BESIDE BASERAA HOTEL • EAST MARREDPALLY, NEAR GEETHA NURSING HOME • VIKRAMPURI, NEXT TO VACS BAKERY • SUCHITRA, SWAGATH GRAND BUILDING • ASRAO NAGAR, BESIDE PARIWAR RESTAURANT • NAGARAM, BESIDE SHIVALAYAM TEMPLE • NACHARAM, OPP TO ESI HOSPITAL • SHIVAM ROAD, SURABHI GRAND BUILDING • KACHIGUDA, BESIDE BALAJI RATANLAL SWEET HOUSE • HIMAYAT NAGAR, MPM MALL • MALAKPET, BESIDE MALAKPET GUNJ • SANTOSH NAGAR, NEAR IS SADAN X ROADS • RK PURAM: NEAR VICTORIA MEMORIAL METRO STATION • KOTHAPET: OPP PVT MARKET • HASTINAPURAM, NEAR TRAFFIC SIGNALS • VANASTHALIPURAM, BESIDE MANGALAYA SHOPPING MALL • UPPAL, HEMA DURGA MALL • RAMANTHAPUR, NEAR DOORDARSHAN. • NARAPALLY, MJR MALL • SANGAREDDY: OPP. ITI GOVT. COLLEGE. | TO LOCATE YOUR NEAREST MY JIO STORE SMS LOCATE <PINCODE> TO 561611